జూలై-2026
సంపుటి 22
సంచిక 10
ISSN 2582-2411

# దర్శనమ్®

ఆధ్యాత్మిక వార్తామాసపత్రిక

₹ 51/-



## ఆదిశంకరుల మార్గంలో

## నేపాల రాజ్యంలో శృంగేరీ జగద్గురువుల ధర్మసంస్థాపన













## నేపాల్‌లో శృంగేరీ జగద్గురువులు శ్రీశ్రీశ్రీ విధుశేఖరభారతీస్వామివారి ధర్మవిజయయాత్ర


















|| ఓం శ్రీ పాండురంగాయ నమః ||

# శ్రీ పాండురంగాశ్రమం

## శ్రీభావానందపురం, మర్కూకు మండలం, సిద్ధిపేట జిల్లా



## 95వ ఆషాఢి మహోత్సవాలు

### ఆహ్వానము

భక్తమహాశయులకు సవినయ నమస్కారములు.

సిద్ధిపేట జిల్లామర్కూకు  మండలం, శ్రీ భావానందపురం గ్రామంలోని “శ్రీ పాండురంగ ఆశ్రమం” నందు శ్రీ పరాభవ నామ సంవత్సర ఆషాఢ మాస పర్వదినాలను పురస్కరించుకొని 95వ ఆషాఢి మహోత్సవాలు అత్యంత వైభవోపేతంగా జరుగనున్నాయి.

తేది: 19-07-2026 (ఆదివారం) నుండి 26-07-2026 (ఆదివారం) వరకు

భక్తులందరూ ఈ క్రింది కార్యక్రమాలలో సకుటుంబ సపరివార సమేతంగా పాల్గొని తీర్థ ప్రసాదాలు స్వీకరించి, స్వామివారి కృపకు పాత్రులు కాగలరని మనవి.

### కార్యక్రమ వివరాలు:

| | |
|---|---|
| తేది: 19.07.2026 (ఆదివారం) | ఉదయం 9:00 గంటలకు 95వ ఆషాఢీ ఉత్సవ శోభాయాత్ర. (కొండపాక మండలం అంకిరెడ్డిపల్లి గ్రామంలోని గాయత్రీ ఆశ్రమము నుండి శ్రీ పాండురంగాశ్రమము వరకు శోభాయాత్ర ) |
| తేది: 21.07.2026 (మంగళవారం) | శ్రీశ్రీశ్రీ యతివర భావానంద భారతీ స్వామివారికి పాదుకా పూజ. |
| తేది: 22.07.2026 (బుధవారం) | శ్రీ సీతారామచంద్రస్వామివారికి క్షీరాభిషేకం, పుష్పార్చన, నీరాజన సేవ, తీర్థ ప్రసాద వితరణ. అనంతరం - శ్రీ సీతారామకల్యాణోత్సవం (శ్రీరామభధక్షేత్రం - తూంకుంట వారి నిర్వహణలో)  |
| తేది: 23.07.2026 (గురువారం) | శ్రీ భవానీరామలింగేశ్వర స్వామివారికి శతరుధాభిషేకము, సామూహిక కుంకుమార్చనలు., పుష్పార్చన, నీరాజన సేవ మరియు తీర్థ ప్రసాద వితరణ.  |
| తేది: 24.07.2026 (శుక్రవారం) | 95వ ఆషాఢీ ఉత్సవాల ప్రారంభం - గణపతిపూజ, పుణ్యాహవచనం, అఖండ భగవన్నామం ప్రారంభం. శ్రీ రుక్మిణీ పాండురంగ స్వామివారికి క్షీరాభిషేకం, పుష్పార్చన, నీరాజన సేవ, తీర్థ ప్రసాద వితరణ.  |
| తేది: 25.07.2026 (శనివారం) తొలి ఏకాదశి విశేషము | శ్రీ రుక్మిణీ పాండురంగ స్వామివారికి విశేష పూజ, అఖండ భగవన్నామం, విష్ణు సహస్రనామ స్తోత్ర పారాయణం. సాహిత్య, సాంస్కృతిక (సంగీత - నృత్య) కార్యక్రమాలు మరియు ఆధ్యాత్మిక ప్రవచనములు.  |
| తేది: 26.07.2026 (ఆదివారం) ఆషాఢ శుద్ధ ద్వాదశి | అన్నపూజ, నాదం, అఖండ అన్నప్రసాద వితరణ (అన్నదానం). 95వ ఆషాఢీ ఉత్సవాల ముగింపు కార్యక్రమం.  |

|| శ్రీ భక్తవత్సల భగవాన్ కీ జై ||

ఇట్లు,
ఆశ్రమ నిర్వహణ కమిటీ మరియు భక్త బృందం,
శ్రీ పాండురంగ ఆశ్రమం,
శ్రీ భావానందపురం, మర్కూకు మండలం, సిద్ధిపేట జిల్లా.

# శ్రీకూర్మస్తోత్రం

నమామ తే దేవ పదారవిందం ప్రపన్నతాపోపశమాతపత్రం
యన్మూలకేతా యతయో2ఞ్జసోరుసంసారదుఃఖం సముత్ క్షిపంతి 1

ధాతర్యదస్మిన్భవ ఈశ జీవాస్తాపత్రయేణోపహతా న శర్మ
ఆత్మన్ లభంతే భగవంస్తవాంఘ్రిచ్ఛాయాం సవిద్యామత ఆశ్రయేమ 2

మార్గంతి యత్తే ముఖపద్మనీడైశ్ఛందఃసుపర్ణైరృషయో వివిక్తే
యస్యాఘమర్షోదసరిద్వరాయాః పదం పదం తీర్థపదః ప్రపన్నాః 3

యచ్ఛ్రద్ధయా శ్రుతవత్యాం చ భక్త్యా సంమృజ్యమానే హృదయేవధాయ
జ్ఞానేన వైరాగ్యబలేన ధీరా వ్రజేమ తత్తే2ఙ్ఘ్రిసరోజపీఠం 4

విశ్వస్య జన్మస్థితిసంయమార్థే కృతావతారస్య పదాంబుజం తే
వ్రజేమ సర్వే శరణం యదీశ స్మృతం ప్రయచ్ఛత్యభయం స్వపుంసాం 5

యత్సానుబంధేసతి దేహగేహే మమాహమిత్యూఢదురాగ్రహాణాం
పుంసాం సుదూరం వసతోపి పుర్యాం భజేమ తత్తే భగవన్పదాబ్జం 6

తాన్వా అసద్వృత్తిభిరక్షిభిర్యే పరాహృతాంతర్మనసః పరేశ
అథో న పశ్యంత్యురుగాయ నూనం యే తే పదన్యాసవిలాసలక్ష్మ్యాః 7

పానేన తే దేవ కథాసుధాయాః ప్రవృద్ధభక్త్యా విశదాశయా యే
వైరాగ్యసారం ప్రతిలభ్య బోధం యథాంజసాన్వీయురకుంఠధిష్ణ్యం 8

తథాపరే చాత్మసమాధియోగబలేన జిత్వా ప్రకృతిం బలిష్ఠాం
త్వామేవ ధీరాః పురుషం విశంతి తేషాం శ్రమః స్యాన్న తు సేవయా తే 9

తత్తే వయం లోకసిసృక్షయాద్య త్వయానుసృష్టాస్త్రిభిరాత్మభిః స్మ
సర్వే వియుక్తాః స్వవిహారతంత్రం న శక్నుమస్తత్ప్రతిహర్తవే తే 10

యావద్బలిం తే2జ హరామ కాలే యథా వయం చాన్నమదామ యత్ర
యథోభయేషాం త ఇమే హి లోకా బలిం హరంతోన్నమదంత్యనూహాః 11

త్వం నః సురాణామసి సాన్వయానాం కూటస్థ ఆద్యః పురుషః పురాణః
త్వం దేవశక్త్యాం గుణకర్మయోనౌ రేతస్త్వజాయాం కవిమాదధేజః 12

తతో వయం సత్ప్రముఖా యదర్థే బభూవిమాత్మన్కరవామ కిం తే
త్వం నః స్వచక్షుః పరిదేహి శక్త్యా దేవక్రియార్థే యదనుగ్రహాణాం 13



ఇతి శ్రీమద్భాగవతపురాణాంతర్గతం
శ్రీకూర్మస్తోత్రం సమాప్తం

# దర్శనమ్

## ఆధ్యాత్మిక వార్తా మాస పత్రిక

**జూలై 2026**

సంపుటి-22 విడిప్రతి: రూ. 51/- సంచిక - 10

ISSN 2582-2411 పేజీలు 68

**ఎస్ఆర్ఎస్ పబ్లికేషన్స్ ప్రచురణ**

స్ఫూర్తిప్రదాత

**కీ.శే. మరుమాముల రాజమౌళిశర్మ**

గౌరవ సంపాదకులు

**యాయవరం చంద్రశేఖరశర్మ, ఆర్.వి.వి. కృష్ణారావు**

**మరుమాముల దత్తాత్రేయశర్మ**

ప్రధాన సంపాదకులు

**మరుమాముల వెంకటరమణశర్మ**

ప్రచురణకర్త, సంపాదకులు

**మరుమాముల రుక్మిణి**

సంపాదక మండలి

**డా. పూర్ణప్రజ్ఞా భారతి, అష్టకాల రామ్మోహన్**

**ఆకెళ్ల విభీషణ శర్మ, బాచంపల్లి సంతోష్‌కుమార్‌శాస్త్రి**

**మరుమాముల రామచంద్రమూర్తి**

**ఆదరాసుపల్లి శశిధర్, ప్రసాదవర్మ కామఋషి**

ప్రత్యేక ప్రతినిధి

**పి.వి.ఎం. పవన్,** 81253 36958

ఉప సంపాదకులు

**రామలక్ష్మీ సుబ్రహ్మణ్యం**

website: darshanam.net

**దర్శనమ్**

ఆధ్యాత్మిక వార్తా మాసపత్రిక

**- : ప్రధాన కార్యాలయం : -**

ఇం.నెం. **29-105/4/1,** శ్రీరామ సిద్ధాంతి భవనం
న్యూ విద్యానగర్, నేరేడ్‌మెట్, సికింద్రాబాద్-56
ఫోన్, ఫ్యాక్స్: 9441015469

e-mail: darshanameditordesk@gmail.com

మార్కెటింగ్: రైజింగ్ సన్ న్యూస్ ఏజెన్సీ, 9666680857

దర్శనం దర్శనారామ దర్శనం సమదర్శనం
దర్శనం లోక వృత్తాంతాదర్శ దర్శిన్యపేక్షితమ్ ॥
దర్శనాంతర్ముఖి స్ఫర్శి సద్విమర్శావమర్శనం
దర్శన ప్రతిభూస్థానం జీయాత్ సర్వ నిదర్శనమ్ ॥

**- అష్టకాల నరసింహరామశర్మ**

'దర్శనం దర్శితం యేన దర్శితం సర్వదర్శనమ్
దర్శనం శర్మసంధాతృ దర్శనం దైవదర్శనమ్'

**- అయాచితం నటేశ్వరశర్మ**

## ఈ సంచికలో ...

నేపాల్‌లో శృంగేరి జగద్గురువుల ధర్మవిజయయాత్ర ... 7
శ్రేష్ఠ పర్వం... నిష్ఠ ఆంతర్యం... తొలి ఏకాదశి ... 11
- చింతలపాటి శివశంకరశాస్త్రి
శ్రీ కూర్మ జయంతి ... 14
- చిల్లర సీతారామారావు
భక్తుల చెంతకు భగవంతుడు..జగన్నాథ రథయాత్ర ... 17
- డా. దేవులపల్లి పద్మజ
పాండురంగాశ్రమంలో 95వ ఆషాఢి ఉత్సవాలు ... 19
- ఆదరాసుపల్లి పద్మ ....
సనాతన ధర్మంలో చాతుర్మాస్యవ్రతం ... 22
- ఆచార్య తాడేపల్లి పతంజలి
మైసూరు దత్తపీఠంలో ఆధ్యాత్మిక వైభవం... ... 26
- శర్మ రాణి
సనాతన ధర్మం... సాధికారిక గ్రంథం ... 29
- తాడేపల్లి పతంజలి
మాధవీయ శంకర విజయం ... 32
- తాడేపల్లి పతంజలి
మహాభారత సారసంగ్రహం ... 36
- కీ.శే. డా. పుల్లెల శ్రీరామచంద్రుడు
మహాతపస్వి చంద్రశేఖర భారతి ... 38
- చెఱుకుపల్లి జమదగ్ని శర్మ
తిరుమల చరితామృతం - కీ.శే. పివిఆర్‌కె ప్రసాద్ ... 40
రామాయణం రసరమ్యం ... 42
- వనం జ్వాలా నరసింహారావు
క్షయనామ సంవత్సరం... బార్హస్పత్యమానం ... 44
- డా. శంకరమంచి రామకృష్ణ శాస్త్రి
శ్రీమద్దేవీ భాగవతం - డా. వద్దిపర్తి పద్మాకర్ ... 46
ఒక దివ్యజ్యోతి అంతర్ధానం ... 50
- డా. రేవూరు అనంతపద్మనాభరావు

ఇందులోని వ్యాసాలు, అందులోని భావాలు రచయితలవే. దానికి, దర్శనమ్ పత్రికకు ఎలాంటి సంబంధం లేదు. - సంపాదకుడు

# సర్వస్వమూ సర్వదా గురువే

విశ్వమానవ కల్యాణమే ఏకైక లక్ష్యంగా ఆవిర్భవించిన మహోన్నత జీవన విధానం మన సనాతన ధర్మం. "సర్వే భవంతు సుఖినః సర్వే సంతు నిరామయాః" అని లోకమంతటికీ శాంతిని ప్రబోధించిన అద్భుత దార్శనికత, ఉదాత్త సంస్కృతి మనది. ఈ అనాదిసిద్ధమైన ధర్మగంగాస్రవంతిని యుగయుగాలుగా ఎండిపోకుండా ప్రవహింపజేస్తున్న అపర భగీరథులు మన ఆచార్యులు, పీఠాధిపతులు, జగద్గురువులు. "యస్య దేవే పరా భక్తిః యథా దేవే తథా గురౌ" (ఎవరికైతే భగవంతుని పట్ల అత్యంత భక్తి ఉంటుందో, గురువు పట్ల కూడా అటువంటి భక్తే ఉండాలి) అని శ్వేతాశ్వతరోపనిషత్తు ఘోషిస్తోంది. తైత్తిరీయోపనిషత్తు "ఆచార్య దేవోభవ" అని గురువుకు దైవస్థానాన్ని ఆపాదించింది. అజ్ఞానమనే గాఢాంధకారాన్ని పారద్రోలి, జ్ఞాన జ్యోతులను వెలిగించే గురుపరంపర మనకు ప్రాణప్రదం. ప్రాపంచిక సుఖాలను త్యజించి, కామక్రోధాదులను జయించి, నిరంతర తపస్సు, కఠిన అనుష్ఠానం, లోతైన అధ్యయనం, నిస్వార్థ అధ్యాపనం, నిత్య భగవదారాధనల ద్వారా ధర్మ సంస్థాపనకు అహర్నిశలు శ్రమిస్తున్న ఈ తేజోమూర్తులు మన సంస్కృతికి సజీవ సాక్ష్యాలు. దైవానికి, మానవునికి మధ్య వారధులుగా నిలిచే ఈ ఆచార్యమూర్తులు జాతికి చేస్తున్న నిస్వార్థ సేవ వర్ణనాతీతం, అనిర్వచనీయం.

కానీ, నేటి ఆధునిక సమాజంలో అరచేతిలో ఇమిడిపోయిన సాంకేతికత విచక్షణ కోల్పోయి, భావప్రకటన స్వేచ్ఛ అనే ముసుగులో సామాజిక మాధ్యమాలు (సోషల్ మీడియా) అడ్డూ అదుపు లేని స్వైరవిహారానికి వేదికలయ్యాయి. అనాదిగా వస్తున్న మన సనాతన ధర్మాన్ని, అహర్నిశలు ధర్మ సంస్థాపన కోసం పరితపించే గురువులను లక్ష్యంగా చేసుకుని సాగుతున్న దాడి అత్యంత శోచనీయం, హేయమైన చర్య. మిడిమిడి జ్ఞానంతో కొందరు, అకారణ ద్వేషం, అక్కసుతో మరికొందరు, పనిగట్టుకుని కుట్రపూరిత బుద్ధితో ఇంకొందరు సోషల్ మీడియా వేదికగా సనాతన ధర్మంపై, ఆచార్యులపై నిస్సిగ్గుగా విషం చిమ్ముతున్నారు. కనీస ధార్మిక, ప్రాథమిక జ్ఞానం లేని అజ్ఞానులు సైతం విమర్శకులుగా, కుహనా మేధావులుగా చలామణి అవుతూ, దైవసమానులైన గురువులను అవహేళన చేస్తూ పైశాచిక ఆనందం పొందుతున్నారు. ఇది కేవలం అజ్ఞానం మాత్రమే కాదు, మన హైందవ మూలాలను నాశనం చేయడానికి, సమాజంలో ధార్మిక విశ్వాసాలను సడలించడానికి పకడ్బందీగా జరుగుతున్న ఒక విషపూరిత, వ్యవస్థీకృత కుట్ర.

"న గురోరధికం తత్త్వం, న గురోరధికం తపః" (గురువును మించిన తత్త్వం లేదు, గురువును సేవించుటను మించిన తపస్సు లేదు) అని శాస్త్రాలు స్పష్టం చేస్తున్నాయి. అటువంటి తపోనిధులైన గురువులను కించపరచడం నిస్సందేహంగా మహాపాపమే. ఈ కపట, కుట్రపూరిత, దుర్మార్గపు చర్యలకు పాల్పడేవారు తమకు తెలియకుండానే సకల పాపాలను మూటగట్టుకుంటారు అన్న కఠోర సత్యాన్ని గ్రహించాలి. ధర్మాన్ని, గురువును నిందించే వాడికి ఇహము, పరము రెండూ శూన్యమేనని మన పురాణాలు ఘంటాపథంగా హెచ్చరిస్తున్నాయి. విచ్చలవిడితనంతో, ఉన్మాద స్థితిలో, తమకు తాము మేధావులమన్న అహంకారంతో వీరు చేస్తున్న ఈ వికృత చేష్టలు సమాజంలో నైతిక, ఆధ్యాత్మిక విలువల పతనానికి దారితీస్తున్నాయి. ఈ దుర్నీతి పరాకాష్టకు చేరుకుని, సమాజం పూర్తి గందరగోళంలో పడకముందే, ఈ ఆకతాయిలను, ధర్మకంటకులను ఉక్కుపాదంతో అణచివేయాల్సిన ఆవశ్యకత ఎంతైనా ఉంది.

సామాజిక మాధ్యమాల్లో అడ్డూ అదుపు లేకుండా చెలరేగిపోతున్న ఈ అరాచక శక్తులను కట్టడి చేయడానికి కఠినమైన నియంత్రణ యంత్రాంగం తక్షణ అవసరం. స్వేచ్ఛ పేరుతో ధర్మగ్లాని కలిగించే వారిని గుర్తించి, మత విశ్వాసాలను, గురువులను ఉద్దేశపూర్వకంగా కించపరిచే వారిపై కఠిన చట్టాల కింద ప్రభుత్వాలు తక్షణ చర్యలు తీసుకోవాలి. సైబర్ చట్టాలను మరింత పటిష్టం చేసి, ధార్మిక మనోభావాలను దెబ్బతీసేవారికి కఠిన శిక్షలు పడేలా చూడాలి. అయితే, కేవలం ప్రభుత్వాలు, చట్టాలపై ఆధారపడితే సరిపోదు. ధార్మిక సమాజం మౌన ప్రేక్షకుడిగా మిగిలిపోయే సమయం ఎప్పుడో దాటిపోయింది. "ఉత్తిష్ఠత జాగ్రత ప్రాప్య వరాన్నిబోధత" (మేల్కొండి, లేవండి, గమ్యం చేరేవరకు ఆగకండి) అన్న కఠోపనిషత్తు వాక్యాన్ని ప్రతి హిందువూ స్ఫూర్తిగా తీసుకోవాలి. గురు నిందను **(మిగతా 63వ పేజీలో)**




# పాఠక దర్శిని

మీ అభిప్రాయాలను darshanameditordesk@gmail.comకు పంపగలరు.

## పరిశోధనాత్మక వ్యాసం బాగుంది

రామేశ్వరంలో రాముడు ఎప్పుడు శివలింగాన్ని ప్రతిష్ఠించాడు అనే విషయమై పరిశోధనాత్మక వ్యాసం చాలా బాగుంది. అనేక రామాయణాల్లో ఉన్న విషయాలను ప్రస్తావిస్తూ వివరంగా తెలియజేశారు. రచయితకు ధన్యవాదాలు. గాయత్రీ అమ్మవారి ముఖచిత్రంలో వెలువడిన జూన్ నెల సంచిక ఎంతో ఆహ్లాదంగా ఉంది. జ్యేష్ఠ మాసంలో వచ్చే ఏరువాక పౌర్ణమి గురించి, రైతులు ఆనందంతో జరుపుకునే కార్యక్రమాల గురించి ఇచ్చిన 'పుడమితల్లి పండుగ ఏరువాక పౌర్ణమి' అలరించింది. సంక్రాంతి తరువాత అంత ఆనందంతో రైతులు జరుపుకునే పండుగ అని అర్థమైంది. ఆర్షధర్మంపై అన్యుల విషం, కంచిస్వామి చరిత్ర 'గిని-అద్వైత గని' ధారావాహికలు అలరిస్తున్నాయి.

**- బి.వి. రాములు, కరీంనగర్**

## ఆచరిద్దాం...అందిద్దాం!

వేదమాత గాయత్రీ అమ్మవారి గురించి ఇచ్చిన వ్యాసం అలరించింది. జ్ఞానభిక్షను ప్రసాదించి, బుద్ధిని ప్రచోదన చేసే అమ్మవారి గురించి మంచి విషయాలు తెలియజేశారు. అమ్మను ఆరాధిస్తే జీవితంలో ఎదురయ్యే సవాళ్లను అపారమైన ఆత్మ బలం, స్థితప్రజ్ఞతో ఎదుర్కొంటారని చెప్పడం బాగుంది. మనం నైతిక విలువలు పాటిస్తూ, యువతకు ఆ విలువల అర్థం తెలియజేస్తూ, భవిష్యత్ తరాలకు సత్సంప్రదాయాలు అందిద్దాం అని తెలియజేసే 'తల్లిదండ్రుల్లో పరివర్తన... పిల్లల్లో సత్ప్రవర్తన' సంపాదకీయం ఆలోచింపజేసేదిగా ఉంది.

**- పవన్‌కుమార్ శాస్త్రి, హైదరాబాద్**

## యమునా పుష్కర ప్రాశస్త్యం తెలుసుకున్నాం

పన్నెండు సంవత్సరాలకు ఒకసారి వచ్చే యమునా నది పుష్కరాల గురించి ఇచ్చిన వ్యాసం ఆకట్టుకుంది. యమునానది పుష్కర క్షేత్రాలు ఎక్కడ ఉన్నాయో ఇచ్చిన సమాచారం. పుష్కరాల్లో ఆచరించాల్సిన విధి విధానాలు, చేయాల్సిన పనులు వివరంగా ఇచ్చినందుకు ధన్యవాదాలు. అవధాన విద్యపై అవగాహన కల్పిస్తూ, యువ అవధానులకు శిక్షణ నిస్తున్న 'అవధాన విద్యా వికాస పరిషత్' ఐదవ శిక్షణా శిబిరం విశేషాలను తెలుసుకున్నాం. అవధాన రంగంలో నిష్ణాతులైన వారి చేత యువకులకు శిక్షణనిప్పిస్తున్న ఈ సంస్థకు జేజేలు. ఈ వికాస పరిషత్ మరింత మంది సుశిక్షితులైన అవధానులను తయారు చేయాలని ఆకాంక్షిస్తున్నాం.

**- మారేపల్లి పద్మ, గుంటూరు**

### 'దర్శనమ్' చందా వివరాలు

| | |
|---|---|
| 3 సంవత్సరాలకు | రూ. 2000 |
| 6 సంవత్సరాలకు | రూ. 4000 |
| 12 సంవత్సరాలకు | రూ. 8000 |
| రాజపోషకులు | రూ. 15000 |
| మహారాజ పోషకులు | రూ. 25000 |
| విశిష్ట మహారాజ పోషకులు | రూ. 100000 |

**A/C NAME : DARSHANAM**
**BANK: CANARA BANK**
**A/C NO. 120001974779**
**IFSC CODE: CNRB0013063**

BHIM UPI
Scan using any BHIM UPI enabled APP
DARSHANAM
Canara Bank

## చందాదారులకు విజ్ఞప్తి

'దర్శనమ్' ధార్మికోద్యమ మాసపత్రిక సనాతన ధర్మ పరిరక్షణే లక్ష్యంగా వెలువడుతున్న ఈ పత్రికకు చందాలు, విరాళాలు అందించవలసిందిగా ప్రార్థన. ఈ నెలతో ముగియనున్న తమ చందాలను వెంటనే పునరుద్ధరించుకో వలసిందిగా మనవి. ఎడిటర్, దర్శనమ్ పేరుతో చెక్కు/డిడి/మనియార్డరు/ ఆన్‌లైన్‌లో చందాలను పంపాల్సిందిగా విజ్ఞప్తి. మీరు ప్రత్యుత్తరాలు జరిపేటప్పుడు చిరునామాలను స్పష్టంగా పిన్‌కోడ్‌తో సహా రాయవలసిందిగా కోరుతున్నాం. చిరునామా మారితే తక్షణం తెలియజేయండి. **- ఎడిటర్**



# ఆదిశంకరుల మార్గంలో నేపాల రాజ్యంలో శృంగేరీ జగద్గురువుల ధర్మసంస్థాపన

భారతదేశానికి, నేపాల్‌కు మధ్య ఉన్న ఆధ్యాత్మిక ధార్మిక బంధం ఎంతో ప్రాచీనమైనది, పవిత్రమైనది. ఆ బంధాన్ని మరింత దృఢపరుస్తూ, హిమాలయ సానువుల్లో ఆధ్యాత్మిక పరిమళాలు వెదజల్లిన అపూర్వ ఘట్టం.. ఆదిశంకరుల మార్గంలో నాడు జ్యేష్ఠ మహాసన్నిధానంవారి కఠోర దీక్ష... అదే ఒరవడితో నేడు శ్రీ సన్నిధానంవారి ధర్మవిజయయాత్ర.. ఆరు దశాబ్దాల ఆధ్యాత్మిక వారధి. సనాతన ధర్మ రక్షణే ఊపిరిగా, లోక కల్యాణమే లక్ష్యంగా సాగుతున్న శృంగేరి శారదా పీఠ గురుపరంపర చరిత్రలో జగద్గురువులు చేపట్టే 'విజయయాత్రలు' అత్యంత విశేషమైనవి. జగద్గురు ఆదిశంకరాచార్యుల అడుగుజాడల్లో నడుస్తూ, పీఠాధిపతులు చేసే ఈ ధర్మవిజయయాత్రలు భక్తజనులలో అనంతమైన ఆధ్యాత్మిక చైతన్యాన్ని కలిగిలిస్తాయి. ఈ పవిత్ర ప్రస్థానంలో రెండు అపూర్వమైన చారిత్రక ఘట్టాలు నేపాల్ గడ్డపై విశేషమైన ఆధ్యాత్మిక శోభను సంతరించుకున్నాయి. దాదాపు ఆరు దశాబ్దాల క్రితం అప్పటి శృంగేరి శ్రీశారదా పీఠాధిపతులు..జ్యేష్ఠ మహాసన్నిధానంవారైన జగద్గురు శ్రీశ్రీశ్రీ అభినవ విద్యాతీర్థ మహాస్వామి వారు వేసిన పునాది, నేడు పీఠ ఉత్తరాధికారి జగద్గురు శ్రీశ్రీశ్రీ విధుశేఖర భారతీ సన్నిధానం వారి పర్యటనతో ఇరు దేశాల ధార్మికబంధం ఇతోధికంగా విస్తరించింది. రెండు భిన్న కాలాల్లో జరిగిన ఈ మహత్తర యాత్రల సమగ్ర సమీక్ష ఇది.

మార్చి 2, 1967న భారత సరిహద్దులోని రక్సాల్ వద్ద జగద్గురువులకు అత్యంత భక్తిశ్రద్ధలతో విశేష స్వాగతం లభించింది. గుత్తి సంస్థాన్ ప్రధాన నిర్వాహకులు శ్రీ తారాప్రసాద్ ఉపాధ్యాయ, నేపాల్ ముఖద్వారం వద్ద స్వామివారికి ఎదురేగి సాదర స్వాగతం పలికారు. వీర్‌గంజ్‌లో ఏర్పాటు చేసిన భారీ పందిరిలో అశేష జనవాహిని స్వామివారిని దర్శించుకుని పునీతులయ్యారు. హెటౌడా చేరుకున్న మహాస్వామికి అటవీ రేంజర్స్ శిక్షణా కళాశాల ప్రిన్సిపాల్ ఘన స్వాగతం పలికారు.

ఆ మరుసటి రోజు, మార్చి 3న, నేపాల్ మహారాజు శ్రీ మహేంద్ర బీర్ బిక్రమ్ షా దేవ్ స్వయంగా మహాస్వామిని సంప్రదించి, నేపాల్‌లో జరగబోయే మహాశివరాత్రి ఉత్సవాలను తమ దివ్య చేతుల మీదుగా నిర్వహించాలని భక్తిపూర్వకంగా ఆహ్వానించారు. రాజకుటుంబం విన్నపాన్ని మన్నించిన జగద్గురువులు, ఆనాటి మధ్యాహ్నం నేపాల్ రాజధాని ఖాట్మండుకు బయలుదేరారు. మహారాజు మహేంద్ర పర్యవేక్షణలో స్వామివారికి అపూర్వమైన రాజ లాంఛనాలతో స్వాగతం

లభించింది. మార్గమధ్యంలో కలంకి వద్ద గుత్తి ట్రస్ట్ చైర్మన్ శ్రీ బడా గురుజా ఖగేంద్ర రాజ్ పాండే, ఇతర అధికారులు, భక్తులు నీరాజనాలు అర్పించారు. అనంతరం ఓపెన్ టాప్ కారులో బత్తిస్‌పుతలిలోని మురారి భవన్ వరకు ఒక మహా శోభాయాత్రగా స్వామివారిని తీసుకెళ్లారు. ఆ రోజు సాయంత్రం స్వామివారు శ్రీ పశుపతినాథ్ ఆలయాన్ని దర్శించుకున్నారు.

### ఆలయాల సందర్శన - మహారుద్రయాగ సంకల్పం

మార్చి 4న పవిత్ర బాగమతీ నదీ తీరంలోని అనేక ఆలయాలతో పాటు, పశుపతినాథుని దర్శించుకుని మహాస్వామి వారు ప్రత్యేక పూజలు నిర్వహించారు. వారి దివ్య పర్యవేక్షణలో ఐదు రోజులపాటు సాగే 'మహారుద్ర యాగం' అత్యంత వైభవోపేతంగా ప్రారంభమైంది.

మార్చి 5 తెల్లవారుజామున భక్తపూర్ చేరుకున్న జగద్గురువులు ప్రసిద్ధ దత్తాత్రేయ ఆలయాన్ని సందర్శించారు. అక్కడ సప్తమాతృకలను పూజించిన అనంతరం, సిద్ధేశ్వరి ఆలయంగా పిలువబడే గుహ్యేశ్వరి ఆలయాన్ని, తుల్జా భవానీ మందిరాన్ని దర్శించుకున్నారు. సాయంత్రం బుధనీలకంఠ, బాలాజీ మందిరాలను సందర్శించారు. ఆ రాత్రి మురారి భవన్‌లో జరిగిన సభలో భారత రాయబారితో సహా అనేకమంది ప్రముఖులు పాల్గొనగా, అశేష జనసందోహాన్ని ఉద్దేశించి స్వామివారు అనుగ్రహ భాషణం చేశారు.


మౌన వ్రతం: మరుసటి రోజు (మార్చి 6) ఏకాదశి పర్వదినం కావడంతో, జగద్గురువులు పూర్తి మౌన వ్రతాన్ని పాటించి అంతర్ముఖులయ్యారు.

### బాలవేదపండితులకు ఆశీస్సులు - విశేష సందర్శనలు

మార్చి 7న వందలాదిగా వచ్చిన భక్తులకు దర్శనభాగ్యం కల్పించారు. సాయంత్రం భారత దౌత్య కార్యాలయానికి విచ్చేసిన స్వామివారు, అక్కడి భక్తులను ఉద్దేశించి హిందీలో అద్భుతమైన ప్రవచనం చేశారు. అనంతరం భారత రాయబారి తన నివాసంలో స్వామివారికి పాదపూజ చేసి తరించారు. మార్చి 8వ తేదీన భక్తుల ఇళ్లకు వెళ్లి పాదపూజలు స్వీకరించిన స్వామివారు, సాయంత్రం బాలాజు ఇండస్ట్రియల్ ఎస్టేట్ మరియు మ్యూజియంను సందర్శించారు. అక్కడ ఆదిశేషునిపై ఆసీనులై ఉన్న లక్ష్మీనారాయణుల భారీ ఏకశిలా విగ్రహాన్ని వీక్షించారు.

### త్రిభువన్ విశ్వవిద్యాలయంలో వేదనాదం


విశ్వవిద్యాలయంలోని ఎనిమిది నుంచి




పదేళ్ల వయసున్న చిన్నారి విద్యార్థులు అద్భుతమైన స్పష్టతతో వేద మంత్రాలను పఠించడం జగద్గురువులను ఎంతగానో ఆకట్టుకుంది. ఆ చిన్నారుల నైపుణ్యానికి ముగ్ధులైన స్వామివారు, వారికి మరియు ఉపాధ్యాయులకు ప్రత్యేక నగదు బహుమతులు అందించి ఆశీర్వదించారు. తర్వాత సైనిక మైదానంలో భారీ సభను ఉద్దేశించి ప్రసంగించారు. భగవత్ భవన్‌ను, 2000 సంవత్సరాల నాటి అత్యంత పవిత్రమైన బౌద్ధ చైత్యం 'స్వయంభు'ను దర్శించుకుని తిరిగి మురారి భవన్ చేరుకున్నారు.

### మహాశివరాత్రి మహోత్సవం

మహాశివరాత్రి పర్వదినాన జగద్గురువులు పశుపతినాథ్ ఆలయానికి కాలిబాటన బయలుదేరారు. వేద మంత్రాల ఘోషతో వేలాది మంది భక్తులు వారిని అనుసరించడం ఆ ప్రదేశాన్ని కైలాసంగా మార్చేసింది. పశుపతినాథునికి విశేష పూజలు చేసి, మంగళహారతి స్వీకరించారు. నేపాల్ మహారాజు, మహారాణి స్వామివారిని దర్శించుకుని, సుదీర్ఘ సంభాషణ జరిపి వారి ఆశీస్సులు పొందారు. రాత్రంతా జరిగిన శివరాత్రి మహాపూజను అశేష భక్తజనుల సమక్షంలో స్వామివారు స్వయంగా నిర్వహించారు. ఈ కన్నులపండువను వీక్షించడానికి భారతదేశం నలుమూలల నుంచి భక్తులు తరలిరావడం విశేషం.




### మహారుద్రయాగ పూర్ణాహుతి - రాజ

### సత్కారం


మార్చి 10వ తేదీ ఉదయం మహారుద్రయాగ 'పూర్ణాహుతి' ఘట్టం అత్యంత వైభవంగా జరిగింది. నేపాల్ రాజదంపతులు, భారత రాయబారితో సహా అనేకమంది ప్రముఖులు ఈ మహాక్రతువులో పాల్గొన్నారు.

- రాజ కానుకలు: భక్తిపూర్వకంగా నేపాల్ మహారాజు ఒక వెండి భరిణెను, పశుపతినాథ్ ఆలయ వెండి నమూనాను స్వామివారికి కానుకగా సమర్పించారు.
- యాగ నిర్వహణ: మహారుద్రయాగానికి సంబంధించిన పూర్తి ఖర్చును మహారాజు స్వయంగా భరించడం వారి అపార భక్తికి నిదర్శనం.
- శృంగేరీ మఠానికి ఒక భారీ కంచు గంటను బహూకరించారు. మధ్యాహ్నం భారీ ఎత్తున అన్నదాన కార్యక్రమం జరిగింది.
- శాశ్వత శిలాఫలకం: జగద్గురువుల ఈ పవిత్ర యాత్రకు గుర్తింపుగా, వారి రాకను స్మరిస్తూ పశుపతినాథ్ ఆలయంలో అందరూ చూసేలా ఒక పెద్ద శిలాఫలకాన్ని ఏర్పాటు చేయాలని నేపాల్ ప్రభుత్వం నిర్ణయించింది.

### సాదర వీడ్కోలు

మార్చి 11 మధ్యాహ్నం, బీహార్‌లోని మోతీహారి మీదుగా హెటౌడాకు వెళ్లేందుకు స్వామివారు ఖాట్మండు నుండి తిరుగు ప్రయాణమయ్యారు. వెళ్లే ముందు మరొక్కసారి పశుపతినాథుని దర్శించుకున్నారు. భారతదేశానికి తిరుగు ప్రయాణమవుతున్న జగద్గురువులకు నేపాల్ అపూర్వమైన, ఉద్వేగభరితమైన వీడ్కోలు పలికింది.

నేపాల్‌లో వారు బస చేసిన కాలంలో దాదాపు ఆరు భారీ బహిరంగ సభలలో ప్రవచనాలు చేయగా, 30,000 మందికి పైగా భక్తులు ఆ అమృతవాక్కులను ఆలకించి తరించారు.





శృంగేరీ జగద్గురువుల నేపాల్ యాత్ర కేవలం ఒక పర్యటన మాత్రమే కాదు.. అది రెండు దేశాల నడుమ ఆధ్యాత్మిక వంతెనను నిర్మించిన ఒక సువర్ణాధ్యాయం!

### 2026: సన్నిధానంవారి ధర్మ విజయయాత్ర
### ఆధునిక వికాసానికి దర్పణం


శృంగేరీ పీఠం జగద్గురు శంకరాచార్య శ్రీశ్రీశ్రీ విధుశేఖర భారతీ సన్నిధానం వారు నేపాల్ దేశంలో చేపట్టిన ధర్మ విజయ యాత్ర అత్యంత వైభవంగా, దిగ్విజయంగా ముగిసింది. ఉభయ దేశాల భక్తుల హృదయాల్లో చెరగని ముద్ర వేసిన ఈ వారం రోజుల పర్యటన ఒక అపూర్వ ఆధ్యాత్మిక ఘట్టంగా చరిత్రలో నిలిచిపోతుంది. మంగళూరు నుండి ప్రత్యేక విమానంలో ఖాట్మండు చేరుకున్న జగద్గురువులకు నేపాల్ ప్రభుత్వ యంత్రాంగం, ఆలయ ధర్మకర్తలు, నేపాల్‌లోని భారత రాయబార కార్యాలయం అధికారులు, వేలాది భక్తులు పూర్ణకుంభంతో, మంగళ వాయిద్యాలు, వేదమంత్రోచ్ఛారణల నడుమ కన్నుల పండువగా జరిగిన శోభాయాత్రలో పాల్గొని, ఘన స్వాగతం పలికారు.

ఆనాటి మహాస్వామి వారి దివ్య స్ఫూర్తిని, ధార్మిక సంకల్పాన్ని కొనసాగిస్తూ ఉభయ భారతీ ప్రకాశకులు జగద్గురు శంకరాచార్య శ్రీశ్రీశ్రీ విధుశేఖర భారతీ సన్నిధానం వారు 2026 మే 22 నుండి 31 వరకు నేపాల్‌లో అత్యంత వైభవంగా 'ధర్మ విజయయాత్ర'ను నిర్వహించారు. ఈ యాత్ర పాత జ్ఞాపకాలను నెమరువేస్తూనే, కొత్త తరానికి ధర్మమార్గాన్ని ఉపదేశించింది.

ఈ పర్యటనలో భాగంగా మే 25వ తేదీన ఖాట్మండులోని రాష్ట్రపతి భవన్‌కు గౌరవపూర్వక ఆహ్వానం మేరకు విచ్చేసిన జగద్గురువులకు నేపాల్ రాష్ట్రపతి శ్రీ రామ్‌చంద్ర పౌడెల్

దంపతులతో పాటు మంత్రులు, ఉన్నతాధికారులు సాంప్రదాయబద్ధంగా సాదర స్వాగతం పలికి అత్యంత భక్తిశ్రద్ధలతో దర్శించుకుని ఆశీస్సులు పొందారు. ఈ సందర్భంగా నేపాల్ దేశం సకల అరిష్టాల నుంచి తొలగిపోయి, ప్రజలు సుఖశాంతులతో వర్ధిల్లాలని జగద్గురువులు ప్రత్యేక ఆశీర్వచనాలు, అనుగ్రహ భాషణం అందించారు.

శ్రీ విధుశేఖర భారతీ సన్నిధానం వారు స్వయంగా పశుపతినాథునికి జరిపిన విశేష రుద్రాభిషేకాలు, మహాపూజలు చూపరులను భక్తి పారవశ్యంలో ముంచెత్తాయి. జగద్గురువుల రాకతో ఆలయ ప్రాంగణమంతా శివపంచాక్షరీ మహామంత్ర నాదంతో మారుమోగింది. స్వామివారి కరకమలాలతో జరిగిన ఈ పవిత్ర పూజల ద్వారా పశుపతినాథుని దివ్య అనుగ్రహం యావత్ విశ్వానికి ప్రసరించిందని భక్తులు ఆనంద పారవశ్యానికి లోనయ్యారు.





◆ ముక్తినాథ్ ధామ్‌లో పవిత్ర పూజలు: ఎత్తైన హిమాలయ శ్రేణుల నడుమ, సాక్షాత్తూ శ్రీ మహావిష్ణువు శాలగ్రామ రూపంలో కొలువైన ముక్తినాథ్ క్షేత్రంలో లోక కల్యాణార్థం శ్రీ సన్నిధానం వారు జరిపిన విశేష పూజలు భక్తులకు కనువిందు చేశాయి.

◆ శ్రీ గలేశ్వరనాథునికి మహాభిషేకం: కాళీగండకి నదీ తీరాన గలేశ్వర్ ధామ్‌లో ఒకే ఒక అఖండమైన శిలపై (చక్రశిల) కొలువైన శ్రీ గలేశ్వరనాథునికి భక్తిశ్రద్ధలతో మహాభిషేకం నిర్వహించి పరమశివుని కటాక్షాన్ని లోకానికి అందించారు. బుధనీలకంఠ లోని చారిత్రక విష్ణుమూర్తి ఆలయాన్ని సందర్శించి విశేష పూజలు చేశారు.

◆ వశిష్ఠ గుహలో 'యోగ వాశిష్ఠ' ప్రబోధం: దేవఘాట్ ధామ్‌లో, ముఖ్యంగా మహర్షి వశిష్ఠుడు తపస్సు చేసిన చారిత్రక 'వశిష్ఠ గుహ'ను సందర్శించడం ఒక అరుదైన ఘట్టం. ఆ పవిత్ర తపోభూమిలో వారు 'యోగ వాశిష్ఠం'పై చేసిన మృదుమధురమైన ప్రబోధం భక్తజనానికి స్ఫూర్తిదాయకంగా నిలిచింది.

◆ సార్వజనీన అంగీకారం: నేపాల్ పోలీస్ ప్రధాన కార్యాలయంలో జరిగిన విశేష సత్కారం, పోలీస్ ఉన్నతాధికారులు పశుపతినాథ్ మందిర నమూనాను బహుకరించడం... రాజ్యాంగ వ్యవస్థలు సైతం ధర్మపీఠాల పట్ల చూపిస్తున్న గౌరవానికి ప్రతీక.



## రెండు తరాల సమన్వయం - చెక్కుచెదరని దివ్య లక్ష్యం

ఈ రెండు పర్యటనల నేపథ్యాలు, కాలాలు, భౌగోళిక పరిస్థితులు వేరైనా అంతరార్థం మాత్రం ఒక్కటే. నాటి యాత్ర భారత-నేపాల్ దేశాల మధ్య ఒక దృఢమైన ఆధ్యాత్మిక వారధికి శ్రీకారం చుట్టగా, నేటి యాత్ర ఆ మూలాలను మరింత బలోపేతం చేస్తూ ధర్మ మార్గాన్ని నలుదిశలా విస్తృతం చేసింది.

◆ నాడు: మహాస్వామి వారు అత్యంత కఠోరమైన వాతావరణంలో స్వయంగా శ్రమించి, అజ్ఞానమనే చీకట్లను పారద్రోలి ధర్మ జ్యోతిని వెలిగించారు.

◆ నేడు: శ్రీ సన్నిధానం వారు తమ అపారమైన కరుణా కటాక్షాలతో, దివ్యమైన అనుగ్రహ భాషణాలతో నాడు నాటిన ఆ ధర్మ వృక్షాన్ని ఏపుగా, పచ్చగా పెంచుతున్నారు.

దేశాలు వేరైనా, దశాబ్దాలు మారినా శృంగేరి శారదా పీఠం యొక్క ధార్మిక సంకల్పం చెక్కుచెదరనిది. నేపాల్ ప్రజల హృదయాల్లో శాశ్వతంగా పాతుకుపోయిన ఈ భక్తిభావం, గురుపరంపర పట్ల వారు చూపుతున్న అపారమైన ప్రేమ... సనాతన ధర్మ వైభవానికి సజీవ సాక్ష్యాలు. ఈ రెండు చారిత్రక విజయ యాత్రల స్మరణం ప్రతి ధార్మిక హృదయానికీ సర్వదా ఆచరణీయం, అత్యంత పుణ్యప్రదం! ఈ యాత్రా విశేషాలు భావితరాలకు ఒక దిక్సూచిగా నిలిచిపోతాయి.

■




**భారతీయ సనాతన ధార్మిక వినీలాకాశంలో ఆధ్యాత్మిక ప్రభలను విరజిమ్మే అత్యంత పవిత్రమైన పర్వదినం "తొలి ఏకాదశి". ఆషాడ శుద్ధ ఏకాదశిగా పిలువబడే ఈ దివ్యమైన రోజు, తెలుగునాట పండుగల పరంపరకు నాంది పలుకుతూ భక్తిభావానికి తొలిమెట్టుగా నిలుస్తుంది. శ్రీ మహావిష్ణువు క్షీరసాగరంలో శేషతల్పంపై 'యోగనిద్ర'లోకి ప్రవేశించే అద్భుత ఘట్టానికి ఈ పర్వదినం సజీవ సాక్ష్యం. అందుకే దీనిని 'శయన ఏకాదశి', 'పద్మ ఏకాదశి' మరియు 'హరిశయనీ ఏకాదశి' అనే పరమ పవిత్రమైన నామాలతో భక్తులు భక్తిశ్రద్ధలతో కీర్తిస్తారు. లౌకిక వాంఛలను పక్కనపెట్టి, అంతరంగాన్ని శుద్ధి చేసుకునే ఉత్కృష్టమైన దీక్షాసమయంగా ఈ ఏకాదశి విశిష్టతను సంతరించుకుంది. ఈ పర్వదినం నుండే ప్రారంభమయ్యే 'చాతుర్మాస్య వ్రతం' సాధకులలో జ్ఞానజ్యోతులను వెలిగించి, ఆత్మవికాసానికి మార్గం సుగమం చేస్తుంది. ఉపవాస దీక్షల ద్వారా దేహాన్ని, హరినామ సంకీర్తనల ద్వారా మనసును పునీతం చేసే అత్యంత శక్తివంతమైన సాధనా దినమిది. ప్రకృతి సైతం వర్షఋతువు శోభను అద్దుకుని, సమస్త ప్రాణకోటిలో సరికొత్త ప్రాణశక్తిని నింపే అద్భుతమైన చైతన్య వేదిక ఈ తొలి ఏకాదశి. సర్వ పాపాలను దహించి, సకల శుభాలను ప్రసాదించే ఈ తొలి పండుగ.. అజ్ఞానపు చీకట్లను పారద్రోలి విజ్ఞానపు వెలుగులను ప్రసాదిస్తుంది. సకల ప్రాణికోటి సంక్షేమాన్ని కాంక్షిస్తూ, దైవచింతన వైపు అడుగులు వేయించే ఈ మహోత్సవం ప్రతి హృదయంలో ఆధ్యాత్మిక బీజాలను నాటే ఒక అపురూపమైన వేడుక.**

**చతుర్భుజం చిదానందం మల్లచాణూర మర్దనం**
**చరాచర గురుం దేవం తం వందే చక్రపాణినం**
**శ్రియఃకరం శ్రియోనాథం శ్రీధరం శ్రీవరప్రదం**
**శ్రీవత్సలధరం సౌమ్యం తం వందేశ్రీ సురేశ్వరం**



**చింతలపాటి శివశంకరశాస్త్రి**

పద్మనేత్రుడు, చతుర్భుజుడు, చక్రం పాణియందు గలవాడు దేవదేవుడిగా ప్రసిద్ధి కెక్కిన శ్రీ మహావిష్ణువుకు నమస్సులు.

ఆషాఢ శుద్ధ ఏకాదశిని తొలి ఏకాదశిగా పేర్కొంటారు. దీనినే 'శయన ఏకాదశి' అని కూడా పిలుస్తారు. శ్రీ మహావిష్ణువు ఈ రోజు నుంచి కార్తిక శుద్ధ ఏకాదశి వరకు యోగనిద్రలో ఉంటాడు. నాటి నుంచి శ్రీవారి భక్తులు కామక్రోధాదులను వర్జించి ప్రయాణాలు చేయకుండా ఒకేచోట ఉండి శ్రీహరిని అర్చిస్తూ తిరిగి కార్తిక శుద్ధ ఏకాదశి వరకు ఆ నాలుగు నెలలు 'చాతుర్మాస్య వ్రతం కూడా పాటిస్తుంటారు. ఈ తొలి ఏకాదశిని గురించి భవిష్య పురాణం, బ్రహ్మావైవర్త పురాణం, స్కాందపురాణం, ధర్మసింధు మొదలైన గ్రంథములు విస్తకృతంగా



వివరించాయి. అన్ని ఏకాదశులకన్నా దీనికి ప్రత్యేకత ఉంది. ఇది విష్ణువుకు ప్రియమైనది.

**ఏకాదశ్యాంతు శుక్లాయామషాఢే భగవాన్ హరి**

**భుజంగ శయనేశేతే యథా క్షీరార్ణవే తథా**

ఈ రోజు నుంచి కార్తిక శుద్ధ ఏకాదశి వరకు శ్రీ మహావిష్ణువు ఆదిశేషునిపై పాల సముద్రంలో పడుకొని యోగ నిద్రలో ఉంటాడని భవిష్య పురాణం నందు చెప్పబడింది. అంటే విష్ణుమూర్తి శయనించే రోజు కాబట్టి 'శయనైకాదశి' అని పిలుస్తారు. సంవత్సరం లోని అన్ని ఏకాదశులకూ ఉపవాసం ఉండడానికి వీలుకాని వారు ఈ ఆషాఢ శుక్ల ఏకాదశి నాడు ఉపవాసం ఉండి చాతుర్మాస్య వ్రతం చేస్తే సంవత్సరంలో వారు చేసిన పాపాలు నశించిపోతాయి.

విష్ణు భక్తులకు ఏకాదశి మహాపర్వదినం. అయిదు కర్మేంద్రియాలు. అయిదు జ్ఞానేంద్రియాలు, మనసు మొత్తం పదకొండింటి యందు భగవంతుని లగ్నం చేసి సేవించిన వారికి తప్పక ముక్తి లభిస్తుంది. ఈ సత్యాన్ని తెలియజేసేందుకే ఏకాదశికి అంతటి ప్రాముఖ్యత కలిగింది.

**"ఏకాదశి నామ సర్వకామఫలప్రదం కుర్యన్తి సర్వదా"**

సర్వకామితములు తీర్చగలది ఈ తిథి. ఈ రోజున విగ్రహారాధన, ఉపవాసముండుట మున్నగునవి ముఖ్యమైనవి. మనిషి ఇంద్రియాలకు అధీనుడై ప్రవర్తిస్తాడు. సుఖభోగాలు మనిషిని దైవానికి దూరం చేస్తాయి. ఉపవాసాదిక దిన నియమాల వల్ల ఇంద్రియాల ప్రభావం తగ్గి, ఆధ్యాత్మిక సాధనలకు మార్గం సుగమమవుతుంది. ఉచ్ఛ్వాస, నిశ్వాసము లలో దైవచింతన ఇమిడిపోవాలి. మనస్సు నిర్మలంగా ఉండి సదా భగవద్భజన యందు విహరించాలి. భగవంతునికి సమీపంలో ఉండి హరి నామస్మరణ నిరంతరం చేస్తుండాలి. బుద్ధిని భగవంతుని మీద కేంద్రీకరించాలి. అరిషడ్వర్గాలను త్యజించాలి. పరనింద చేయకూడదు. అసందర్భ ప్రేలాపనలు పనికిరావు. అప్పుడు సర్వకామితములు ఈడేరుతాయి. పది ఇంద్రియములు ఏకరూపమై నియంత్రించేందుకు మనస్సు సాధనముగా మలచబడింది. కావున ఏకాదశి అయింది. మనోవికాసం, సమయపాలన, సాత్విక చింతన, సత్కర్మాచరణ, సత్యనిష్ఠ, జ్ఞానపిపాస, మోక్షాసక్తికి సోపానం ఏకాదశి.

తొలి ఏకాదశి నాడు సూర్యోదయానికి ముందే నిద్ర లేచి, కాలకృత్యాలు ముగించుకుని స్నానమాచరించి ఏకాదశివ్రతాన్ని ఆచరిస్తున్నానని విష్ణుమూర్తికి నమస్కరించాలి. పూజ చేయ దలచుకున్న చోట పీఠం ఏర్పాటు చేసుకుని అందులో శ్రీహరి చిత్రపటాన్ని, ప్రతిమను ప్రతిష్ఠించాలి. దీపారాధన చేసి, ముందుగా పసుపు గణపతిని పూజించి, తర్వాత శ్రీమహా విష్ణువును షోడశోపచారలతోనూ, అష్టోత్తరాలతోనూ పూజిం చాలి. తామరపువ్వులు, తులసీదళాలతో పూజ చేయాలి. పండ్లను నివేదన చేయాలి. ఆవునేతితో పంచహారతి, పంచామృతంతో స్వామిని అభిషేకించాలి. విష్ణు సహస్రనామం, విష్ణు పురాణం, నారాయణ కవచాలను పారాయణ చేయాలి.

**త్వయి సుప్తే జగన్నాథ జగత్సుప్తం భవేదిదమ్**

**విబుద్ధే త్వయి బుధ్యేత తత్సర్వం స చరాచరమ్**

అనే శ్లోకాన్ని పఠించాలి. ఈ రోజు పూర్తిగా ఉపవాసం ఉండి రాత్రికి జాగరణ చేయాలి.

మరుసటి రోజు ఆషాఢ శుక్ల ద్వాదశి నాడు యథావిధిగా బ్రాహ్మీముహూర్తంలోనే లేచి కాలకృత్యాలు తీర్చుకుని, స్నానమాచరించాలి. శ్రీ మహావిష్ణువును పూజించి నైవేద్యం సమర్పించి భోజనం చేయాలి. శయనైకాదశి నాడు (రాత్రి) విష్ణుమూర్తి కథలను, మహాత్మ్యాన్ని స్మరిస్తూ, భజనలు చేస్తూ, ఆ స్వామి లీలా విశేషాలను గానం చేస్తూ జాగరణ చేస్తూ గడపాలి. నియమనిష్ఠలతో ఈవిధంగా ఏకాదశీ వ్రతం పూర్తి చేసినవారు మరణించిన తర్వాత వైకుంఠాన్ని చేరుకుంటారు.

ఏకాదశి మహాత్మ్యాన్ని తెలిపే కథలు అనేకం వివిధ పురాణాల్లో ద్యోతకమవుతున్నాయి. వాటిలో విష్ణుభక్తులలో అగ్రగణ్యుడు సద్గుణగరిష్ఠుడైన అంబరీషుని చరిత్ర మనోహరమైనది. పరమ భాగవతోత్తముడైన అంబరీషుని చరితము వినడం వల్ల విష్ణుసేవ చేయాలన్న బుద్ధి వికసిస్తుంది.

మోక్షం కోరే వారికి మోక్షం లభిస్తుంది.

నాభాగుని పౌత్రుడు, రెండవ నాభాగుని కుమారుడు అంబరీషుడు. గొప్ప విష్ణుభక్తుడు. ఇతనికి బాల్యం నుంచే శ్రీమన్నారాయణునిపై భక్తిభావం ఏర్పడుతుంది. తదేకంగా విష్ణు ధ్యానంలో ఉండడం, విష్ణు కథలను వినడం వంటి పనులు చేస్తుండేవాడు. ఇతనికి యుక్తవయస్సు రాగానే తండ్రి నాభాగుడు యువరాజ పట్టాభిషేకాన్ని అంగరంగ వైభవంగా జరిపిస్తాడు. తదనంతర కాలంలో అంబరీషుడు రాజై ప్రజానురంజకంగా పాలన సాగిస్తాడు. యజ్ఞాలు, హెూమాలు, సత్సంగాలు నిర్వహిస్తూ ప్రజలలో భక్తిభావాన్ని పెంపొందిస్తాడు.

ఇంతటి విష్ణుభక్తుడైన అంబరీషుడు ఏకాదశి వ్రతాన్ని చేయాలని సంకల్పించి తన రాజ్యంలోని ఋషులకు తెలియజేస్తాడు. సంవత్సరకాలం ఈ వ్రతాన్ని పూర్తి చేసి ద్వాదశి ఘడియలలో బ్రాహ్మణోత్తములందరికీ భోజనం పెట్టి, తాను భుజించాలని తలపోస్తాడు. అన్న సంతర్పణ చేయడానికి పూనుకొంటుండగా దుర్వాస మహర్షి అక్కడికి వస్తున్నట్లుగా చారుల వల్ల తెలుసుకొని, ఆయనకెదురేగి, అతిథి సత్కారాలొనర్చి, "స్వామీ! మీ రాకతో ఈ రాజ్యం పావనమైంది. నేను ఏకాదశీ వ్రతాన్ని సంవత్సరం పాటు చేసి ఉన్నాను. ఈ రోజుతో ఏడాది సమయం పూర్తయింది. అతిథులైన మీరు మా ఆతిథ్యాన్ని స్వీకరించి, ఆశీస్సులు అనుగ్రహించవలసింది కోరుతున్నాను" అని ప్రార్థించాడు.

మహారాజు కోరికను దుర్వాసుడు అంగీకరించి, ద్వాదశి ఘడియలు పూర్తికాక ముందే నేను యమునానదిలో స్నానమాచరించి వస్తానని చెబుతాడు. దుర్వాసుడు ఎంతసేపటికి తిరిగి రాకపోయేసరికి అంబరీషుడు ఆందోళన చెంది అక్కడ ఉన్న ఋషిపుంగవులకు వివరించగా- "ద్వాదశి ఘడియలు పూర్తయ్యే సమయం ఆసన్నమయింది. ఈ స్థితిలో మీరు పారణ చేయకున్న ఫలితం దక్కదని, దుర్వాస మహర్షి వచ్చే లోపు జలాన్ని స్వీకరించి, తర్వాత వారికి ఆతిథ్యం ఇచ్చి భోజనం చేయండి. దీనివల్ల వ్రతభంగం కాద"ని చెబుతారు.

వారు చెప్పిన విధంగానే అంబరీషుడు తీర్థం స్వీకరించి, పారణ పూర్తి చేస్తాడు. దుర్వాసుడు తన జ్ఞాననేత్రంతో ఈ విషయాన్ని గ్రహించి ఆగ్రహంతో అతిథి మర్యాదను పాటించని నీవు క్షమించరాని నేరం చేశావు. అందుకు శిక్ష అనుభవించవలసిందేనని పలికి 'కృత్య' అను రాక్షసిని అంబరీషుని చంపమని ఆజ్ఞాపించాడు. వెంటనే ఆ రాక్షసి హాహాకారాలు చేస్తూ అంబరీషుణ్ణి చంపబోగా నారాయణుని సుదర్శనచక్రం అక్కడ ప్రత్యక్షమై కృత్యను వధించి, దుర్వాసుని చంపడానికి వెంటపడుతుంది.

సుదర్శనచక్రం తనవైపునకు రావడంతో భీతిల్లిన దుర్వాసుడు బ్రహ్మను, శివుణ్ణి ఆశ్రయించి, భంగపడి చివరకు నారాయణుణ్ణి ఆశ్రయిస్తాడు. తనను ఆశ్రయించిన దుర్వాసుణ్ణి చూసి, ఆతనితో పూజించవలసిన వారిని, సత్పురుషులను అవమానిస్తే తగిన శిక్ష అనుభవించవలసిందే! పరమభాగవతోత్తముడైన అంబరీషుణ్ణి పట్టుకొని నీవు విష్ణు భక్తుడివా? అని నిందించావు. అది క్షమించరాని నేరం. నీవు ఎవరినైతే నిందించావో వారే నిన్ను కాపాడగల సమర్థులు. నీ తప్పుని సరిదిద్దడం నా వల్ల కాదు. కావున ఆతనినే శరణు వేడమని పలికాడు.



దుర్వాసుడు శ్రీహరి పలుకులు విని చేసేది లేక అంబరీషుణ్ణి శరణుజొచ్చాడు. అంబరీషుడు ఆయన భయాన్ని పోగొట్టి, అభయమిచ్చి నారాయణుని ప్రార్థించి ప్రసన్నుని చేసుకున్నాడు. అంబరీషుని ప్రార్థనతో శ్రీ మహావిష్ణువు సుదర్శనచక్రాన్ని శాంతింపజేసి, దుర్వాసుని భయాన్ని పోగొట్టాడు. అనంతరం అంబరీషుని ప్రార్థనతో దుర్వాసుడు ఆతని ఆతిథ్యాన్ని స్వీకరించాడు. అంబరీషుడు తన ఏకాదశి వ్రతాన్ని పూర్తి చేశాడు.

విష్ణుప్రీతికరమైన శయనైకాదశి వ్రతాన్ని నియమనిష్ఠలతో ఆచరించి తరిద్దాం. జీవితాన్ని చరితార్థం చేసుకుందాం. ■




**సృష్టి మనుగడకు, ధర్మ సంస్థాపనకు శ్రీమహావిష్ణువు దాల్చిన అద్భుతమైన దశావతారాలలో అత్యంత కీలకమైన ద్వితీయావతారం "కూర్మావతారం". క్షీరసాగర మథనంలో అమృతాన్వేషణ కోసం దేవదానవులు మందర పర్వతాన్ని కవ్వంగా చేసి చిలుకుతున్న వేళ.. ఆధారం లేక ఆ పర్వతం సముద్ర గర్భంలోకి జారిపోతున్న ఆపత్కాలంలో, ఆ జగద్రక్షకుడు మహా కూర్మంగా (తాబేలు) అవతరించి తన వెన్నుపై ఆ మహా పర్వతాన్ని మోసిన పరమ పవిత్ర దినమే "కూర్మ జయంతి". జీవితంలో అమృతం లాంటి విజయాన్ని సాధించాలంటే, ఎంతటి బరువైన అడ్డంకులనైనా తట్టుకుని నిలబడే కూర్మమంతటి మనోస్థైర్యం కావాలనే గొప్ప వేదాంతాన్ని ఈ పర్వదినం లోకానికి చాటిచెబుతుంది.**

మంథనాచల ధారణ హేతో దేవాసుర పరిపాలవిభో
కూర్మాకార శరీర నమో భక్తంతే పరిపాలయమాం

సురాసురులు పాలసంద్రాన్ని మందరగిరితో మధించువేళ వారి సౌకర్యానికై కూర్మావతారమెత్తి, మందరగిరిని మూపున దాల్చిన ఓ విష్ణుదేవా! నీ భక్తుడగు నన్ను కాపాడుము.



చిల్లర
సీతారామారావు

జగద్రక్షకుడైన శ్రీమన్నారాయణుడి విశిష్ట అవతారం కూర్మావతారం. ఇది కలావతారం. అంటే భగవంతుని తత్వానికి అనుగుణంగా ధర్మాన్ని బోధించడాన్ని కలావతారం అంటారు. ఇంద్రుడు అమరావతిని పరిపాలిస్తున్నాడు. విశ్వకర్మ సుధర్మ అనునొక సభను నిర్మించి దేవేంద్రునికి ఇచ్చాడు. ఇంద్రుడు ఆ సభలో కార్యక్రమాలను నిర్వహిస్తున్నాడు. ఒకనాడు సభలో బ్రహ్మ విష్ణు మహేశ్వరులు, నవగ్రహాలు, సూర్యచంద్రులు, యక్షులు, కిన్నరులు, కింపురుషులు, సిద్ధులు విద్యాధరులు మున్నగు వారంతా పాల్గొన్నారు. దీంతో పాటు ముప్పై మూడు కోట్ల మంది దేవతలు కూడా పాల్గొన్నారు. వీరందరితో ఆ సభ కనుల పండువగా ఉంది. ఆ సభలో గంధర్వులు పాటలు పాడారు. కింపురుషులు నృత్యం చేశారు. శివుడు తాండవనృత్యం చేశాడు. రంభాది అప్సరసలు నృత్యాలు చేశారు. అందరి ఆటపాటలు ప్రేక్షకులకు ఆనందాన్ని కలుగజేశాయి.

వినోద కార్యక్రమాలు ముగిసిన తరువాత కుబేరుడు లేచి - "సభాసదులారా! నాదొక విన్నపం. దానిని అందరూ దయచేసి వినవలసినదిగా ప్రార్థిస్తున్నాను. సృష్టి ప్రారంభం నందు శ్రీమహావిష్ణువు నన్ను ధనాధిపతిగా నియమించాడు.

నవనిధులను, అపారమైన అనేక రత్నరాశులను నా అధీనంలో ఉంచాడు. అయితే ఇప్పుడు నేను చెప్పబోయేది ఏమిటంటే కోశాగారము పూర్తిగా ఖాళీ అయిపోయింది. దానిని తిరిగి నింపాలి. వాటికి మీ సలహాలను అర్థిస్తున్నాను" అన్నాడు. కుబేరుడి పలుకులకు అందరూ ఆశ్చర్యపోయారు. పరమేశ్వరుడు లేచి కోశాగారము ఖాళీ ఎలా అయ్యింది, నవ నిధులు ఎవరికి ఇచ్చారు. రత్నరాశుల ఉపయోగం ఎలా జరిగింది అని ప్రశ్నించాడు. కుబేరుడు- "పరమేశ్వరా! దేవేంద్రుడికి దేవాధిపత్యం లభించిన తరువాత సమస్త సంపదలు సమసిపోయాయి. మహేంద్రుడు, సూర్యచంద్రులు, ఇతర దేవతల కార్యకలాపాలకు నా వద్దనున్న సమస్త నిధి నిక్షేపాలు వ్యయం చేశాను" అన్నాడు. విష్ణుమూర్తి "కుబేరుడు చెప్పినదంతా నిజం. ఇతని దగ్గర ఉన్న నిధినిక్షేపాలు సమస్తం ఖాళీ అయ్యాయి. మరల వాటిని పొందడానికి ఒకటే పద్ధతి ఉన్నది. క్షీరసాగరాన్ని మథిస్తే మళ్లీ నిధినిక్షేపాలను, రత్నరాశులను పొందవచ్చును. కనుక దాని కోసం కావలసిన సన్నాహాలను ప్రారంభించండి" అని పలికాడు.

విష్ణుమూర్తి వచనాలను ఆలకించిన దేవ దానవులు సముద్ర తటమునకు చేరుకున్నారు. బ్రహ్మ వాసుకుని రమ్మని కబురుపెట్టాడు. నాగలోకవాసులు వాసుంకి తన పడగల మీద భూభారాన్ని మోస్తున్నాడు. దానిని తొలగించుకుని ఎలా రాగలడు అని ప్రశ్నించారు. బ్రహ్మ సమాధానమిస్తూ- శ్రీహరే సమస్తం చూసుకుంటాడు అని పలికాడు. శ్రీహరి తాను కూర్మావతారాన్ని ధరిస్తానని పలికాడు. ఆ సమాధానంతో తృప్తి చెందిన వాసుకి తలపైన ఉన్న భూభారాన్ని కిందికి దించి క్షీరసాగర తటమునకు చేరుకున్నాడు. దేవతలు, రాక్షసులు అక్కడికి చేరుకున్నారు. సాగరాన్ని మథించడానికి కవ్వంగా మందర పర్వతాన్ని తెమ్మని దేవదానవులను ఆదేశించాడు బ్రహ్మ. దేవదానవులు మందర పర్వతం దగ్గరికి వెళ్లి దానిని పెకలించి మోసుకుని రాసాగారు. కాని ఆ పర్వతం చాలా బరువైనది కావడం చేత, పర్వతం కింద పడిపోవడంతో దాని కింద దేవదానవులలో చాలా మంది పడి చనిపోయారు. మిగిలినవారు నిరాశా నిస్పృహలకు లోనై భగవంతుణ్ణి ప్రార్థించసాగారు. వారి ప్రార్థనలు మన్నించిన విష్ణుమూర్తి గరుడవాహనుడై అక్కడికి చేరుకున్నారు. గోలీకాయను ఎత్తినట్లు అవలీలగా మందర పర్వతాన్ని ఎత్తి గరుడిడి మీద పెట్టాడు. ఒక్కసారి కరుణాదృష్టితో వారివైపు చూడగా దేవదానవులు మరల నిదుర నుండి లేచినట్లుగా లేచారు. గరుడుడు ఆ పర్వతాన్ని మోసుకుంటూ వచ్చి సాగరాన పడవేస్తాడు. కింద ఎటువంటి ఆధారం లేకపోవడంతో మందర పర్వతం



సముద్రంలో మునిగిపోసాగింది. దేవదానవులు మళ్లీ నిరాశకు లోనయ్యారు. శ్రీహరి కూర్మావతారం దాల్చి మందర పర్వతాన్ని తన వీపుమీద మోయసాగాడు. దాంతో మందర పర్వతం పైకి రాసాగింది. దానిని చూసిన దేవదానవులు ఆనందానికి లోనయ్యారు. శ్రీహరి వాసుకిని పిలిచి నిన్ను తాడుగా చేసుకుని క్షీరసాగరాన్ని మథించాలనుకుంటున్నారు సురాసురులు. నీవు అంగీకారం తెలియజేయి అని పలుకుతాడు. వాసుకి సమాధానమిస్తూ "దేవా! నన్ను మన్నించాలి. ఈ కార్యాన్ని నిర్వహించడానికి నాకు శక్తి చాలదు. ఈ కార్యం వల్ల నా ప్రాణాలు పోవచ్చు. దయచేసి ఈ కార్యానికి నన్ను దూరంగా ఉంచండి" అని ప్రార్థించాడు. దీనికి శ్రీహరి సమాధానమిస్తూ- ఎందుకు ఇంతలా భయపడిపోతున్నావు. నీ పడగల మీద భూభారాన్ని మోసిన వాడివి ఈ గిరిని చుట్టుకొని ఉండలేవా? నీకు ఎటువంటి ప్రమాదం జరగకుండా నేను చూసుకుంటాను.


భయపడకుండా వెళ్లి మందరపర్వతాన్ని చుట్టుకుని ఉండు... అని అభయమిచ్చాడు. శ్రీహరి మాట ప్రకారం వాసుకి మందరపర్వతాన్ని చుట్టుకున్నాడు. దేవదానవులు గణపతిని పూజించి, క్షీరసాగర మథనానికి ప్రయత్నాలు మొదలుపెట్టారు. వాసుకి కవ్వపు తాడుగా చేసి, తలవైపు రాక్షసులు, తోకవైపు దేవతలు పట్టుకొని సాగరాన్ని చిలుకసాగారు. ఎంతసేపు మథించినా ఏమీ బయటకు రాకపోవడంతో వారంతా నిరాశకు లోనయ్యారు. బ్రహ్మ జాంబవంతుడిని పిలిచి అతని చేత ఓషధులను సముద్రంలో పడవేయించాడు. గుల్మ, తృణ, లత ఓషధులను వేయించాడు.

మథిస్తున్న తరుణంలో తెల్లని రసమొకటి బయటికి వచ్చింది. బ్రహ్మ దానిని తన సువర్ణ కలశంలో భద్రపరచుకున్నాడు. తరువాత హాలాహలం వెలువడింది. దాని ప్రభావానికి అందరూ భయభ్రాంతులైనారు. వారు భగవంతుడిని ప్రార్థించారు. శివుడు తక్షణమే ప్రత్యక్షమై హాలాహలాన్ని మ్రింగి తన కంఠంలో నిల్పుకున్నాడు. అందువలన పరమ శివుడు నీలకంఠుడు అయినాడు. ఆయన్ని అందరూ అలా పిలవసాగారు. తరువాత సురభి, ఉచ్ఛైశ్రవము అను అశ్వం వెలువడ్డాయి. ఉచ్ఛైశ్రవమును రాక్షసులు స్వీకరించారు. తరువాత ఐరావతం వచ్చింది. దానిని ఇంద్రుడు స్వీకరించాడు. తరువాత కౌస్తుభం వచ్చింది. దానిని శ్రీహరి స్వీకరించాడు. తరువాత అప్సరసలు, దాని తర్వాత లక్ష్మీదేవి ఆవిర్భవించారు. లక్ష్మీదేవిని శ్రీహరి స్వీకరించాడు. తరువాత అమృత కలశం చేతబట్టుకొని ధన్వంతరి వెలువడ్డాడు. ధన్వంతరి చేతిలోని అమృతాన్ని రాక్షసులు లాగుకొనగా దేవతలు దిగాలు పడిపోయారు. అమృతపానం కొరకు నేను ముందు, నేను ముందు అని రాక్షసులు తగవులాడుకోసాగారు.

ఇంతలో వారికి మధురగానం వినిపించింది. ఆ మోహిని అందచందాలకు రాక్షసులు మంత్రముగ్ధులయ్యారు. మోహిని వారి దగ్గరకు వచ్చి మీరంతా యెవరు? దేని కోసం తగవులాడుకుంటున్నారు? కారణం తెలిపితే నేను ఆ తగవును తీరుస్తాను అని పలికింది. "ఓ మోహినీ! మేమందరం అక్కచెల్లెండ్ర సంతానం. మేమంతా కలిసి అమృతాన్ని సాధించాం. దానిని త్రాగడానికి మాలో మాకు తగవు ఏర్పడింది. నీవు మా తగవు తీరుస్తానని పలికావు. కాబట్టి నీవే మాకందరకూ సమానంగా అమృతాన్ని పంచిపెట్టు" అని పలికి అమృతకలశాన్ని ఆమె చేతియందుంచారు.

మోహిని దేవతలను ఒక పంక్తిగాను, రాక్షసులను మరొక పంక్తిగాను ఏర్పాటుచేసి కూర్చోపెట్టింది. కలశంలోని పైభాగము నీరుగా ఉంది. కాబట్టి ముందుగా దేవతలకు ఆ నీటి అమృతాన్ని పోస్తాను. గట్టిపడిని అమృతాన్ని మీకు పోస్తాను. మీ అందరికీ అంగీకారమేనా? అని అడిగింది. మోహిని మాటలకు అందరూ అంగీకారం తెలిపారు. చిరునవ్వులు చిందిస్తూ దేవతలకు అమృతాన్ని పోయసాగింది. మోసం గ్రహించిన రాహువు అనే రాక్షసుడు చంద్రుడి రూపం ధరించి దేవతల పంక్తిలో కూర్చున్నాడు. మోహిని రాహువుకు అమృతాన్ని పోసింది. ఆకాశంలో ఉన్న సూర్యచంద్రులు జరిగిన మోసాన్ని మోహినికి తెలియజేశారు. మోహిని రూపంలో ఉన్న శ్రీహరి తన సుదర్శన చక్రంతో రాహువు శిరస్సు ఖండించాడు. అమృతం తాగి ఉండడం చేత రాహువు మరణించక తల, మొండెంలతో గగన వీధులలో సంచరించసాగాడు. తరువాత ఈ రెండు భాగాలు రాహు కేతువులుగా మారి గ్రహణకాలమందు సూర్య చంద్రులను బాధించసాగారు.

వాస్తవాన్ని గ్రహించిన రాక్షసులు దేవతలతో భయంకరమైన సమరాన్ని కొనసాగించారు. ఆ యుద్ధంలో దేవతలు విజయులు కావడంతో రాక్షసులు పాతాళలోకానికి వెళ్లిపోయారు. క్షీరసాగర సమయంలో వెలువడిన నవనిధులు, రత్నరాశులతో కోశాగారం నిండిపోయింది. సృష్టి అంతా సుఖవంతంగా గడవసాగింది. జగద్రక్షకుడైన శ్రీహరి కూర్మావతారాన్ని దాల్చి లోకోద్ధరణకు సాయం చేశాడు. ■



# జగన్నాథ రథయాత్ర

## భక్తుల చెంతకు భగవంతుడు



**లోకనాథుడైన ఆ జగన్నాథుడు తన భక్తులను కరుణించడానికి గర్భగుడి వీడి, రాజవీధుల్లోకి రథమెక్కి వచ్చే అత్యంత అద్భుత, అపురూప ఘట్టమే 'పూరీ జగన్నాథ రథయాత్ర'. ఆషాఢ శుద్ధ విదియ నాడు అశేష జనవాహిని నడుమ ప్రారంభమయ్యే ఈ మహా రథోత్సవం.. అగ్రజుడైన బలభద్రుడు, ప్రియ సోదరి సుభద్రాదేవితో కలిసి శ్రీకృష్ణ పరమాత్మ రథాలపై కొలువుదీరి గుండిచా మందిరానికి పయనమయ్యే అనంతమైన భక్తి పారవశ్యానికి సజీవ సాక్ష్యం. కుల, మత, వర్గ, వర్ణ భేదాలను తుడిచిపెట్టి, భగవంతుని దృష్టిలో మానవులంతా సమానమే అని చాటిచెప్పే మహాద్భుత వేదిక ఈ రథయాత్ర. ఆకాశమంత ఎత్తున నిలిచే దివ్య రథాలు, కడలిలా ఉప్పొంగే భక్తజన సందోహం మధ్య అణువణువునా శ్రీహరి నామస్మరణతో మార్మోగే ఈ చారిత్రక రథయాత్ర వెనుక ఉన్న విశిష్టత తెలుసుకుందాం.**



డా. దేవులపల్లి పద్మజ

ప్రతిసంవత్సరం ఆషాడ మాసంలో శుక్ల పక్ష విదియ నాడు ప్రారంభమవుతుంది.

జగమును పాలించే ఓ జగన్నాథ! శ్రీహరీ ఈ భూమండలమును సర్వ శ్రేయోదాయక పాలన చేయుచున్న నీకు నమస్కరించుచున్నాను. అని శ్రీకృష్ణుని ప్రార్థిస్తూ రథయాత్రకు ఏర్పాట్లకు శ్రీకారం చుడతారు నిర్వాహకులు.

రథయాత్రకు సరిగ్గా అరవై రోజుల ముందు, వైశాఖ బహుళ విదియనాడు పూరీ మహారాజు పూజారులను సంప్రదించి కలప సేకరించాల్సిందిగా ఆదేశిస్తాడు. సామంతరాజు అప్పటికే కలపకి అవసరమైన వృక్షాల్ని గుర్తించి ఉంటాడు. వాటికి వేదపండితులు శాంతి నిర్వహించాక దానిని జాగ్రత్త రథంగా 1,072 కాండలను పూరీకి తరలిస్తారు. రథాల నిర్మాణానికి 13 వేల ఘనపుటడుగుల కలప అవసరం. ప్రధాన పూజారి నేతృత్వంలోని శిల్పుల బృందం అక్షయ తృతీయ నాడు రకాల తయారీకి శుభ శ్రీకారం చుడుతుంది. ముందు వృక్ష కాండాన్ని 2,188 ముక్కలు చేస్తారు. వాటిలో 832 ముక్కలను జగన్నాథుడి రథం కోసం, 763 ముక్కలుగా బలభద్రుడి రథం కోసం, 593 ముక్కలు సుభద్రా దేవి రథం కోసం వినియోగిస్తారు. తయారీ సమయంలో యంత్రం వాడకుండా రూపొందిస్తారు.

జగన్నాథుడి రథం నందిఘోష, ఎత్తు సుమారు 46 అడుగులు, పదహారు చక్రాలు ఉంటాయి. ఒక్కోరథం ఎత్తు ఆరు అడుగులు. సారథి పేరు దారుక. బలభద్రుడి రథం తాళధ్వజం. సుభద్రాదేవి రథం దేవదళన్. నిర్మాణం పూర్తి అయ్యాక రథాల్ని యాత్రకి ఒకరోజు ముందుగా ఆలయ తూర్పుభాగంలోని సింహద్వారం దగ్గర నిలబెడతారు. లాగుడుకు వీలుగా ఒక్కో

రథానికీ 250 అడుగుల పొడవు, ఎనిమిది అంగుళాల మందం కలిగిన తాళ్ళను కడతారు.

రథయాత్రకు రెండురోజుల ముందుగా అమావాస్య నాడు, నూతన దేవతామూర్తుల నేత్రోత్సవం జరుగుతుంది. యథావిధిగా పూజలు ప్రారంభమవుతాయి. మరుసటి రోజు నవ యవ్వన దర్శనం లభిస్తుంది. ఆషాడ శుక్ల విదియనాడు పాండాలు మేళ తాళాలతో పూజలు నిర్వహించి 'మనిమా' అంటే జగన్నాథ! అంటూ పెద్దయెత్తున నినాదాలు చేస్తూ విగ్రహాన్ని కదిలిస్తారు.

ఆనందబజారు, అరుణస్తంభం మీదుగా అత్యంత కోలాహల వాతావరణంలో ఊరేగిస్తూ రథం వెనుక భాగం నుంచి తీసుకువచ్చి రత్న పీఠం మీద అలంకరింపజేస్తారు. ఈ ఉత్సవాన్ని ' పహండీ' అంటారు. ఈ దశలో కలమత భేదాలకు తావులేకుండా అందరూ పాల్గొంటారు. గుండిచా ఆలయానికి వెళ్ళేందుకు సిద్ధమైన సుభద్ర, జగన్నాథ బలభద్రులు, రథారూఢులై ఉండగా 'ఇకపై నడిచే విష్ణువు'గా గౌరవాభిమానాన్ని అందుకునే పూరీరాజు పల్లకీలో అక్కడకి చేరుకోవడంతో సంరంభాలు మిన్నంటుతాయి. మహాత్ముని ముందు సేవకుడిగా మారిన ఆ మహారాజు బంగారు చీపురుతో రథం లోపల ఊడిచి శుభ్ర పరుస్తాడు. దీనినే 'చెరా పహారా' అంటారు.

రథానికున్న తాళ్ళను లాగడంలో ప్రపంచ ప్రఖ్యాత రథ యాత్ర ప్రారంభమవుతుంది. ఈ యాత్ర సమయంలో జగన్నాథుని ' పతితపావనుడు'గా భావిస్తారు. ఆ రథంపై కొలువైన స్వామిదర్శనం చేసుకుంటే మనం చేసిన పాపాలు హరిస్తాయని అధిక సంఖ్యలో భక్తులు దర్శించుకుంటారు. ఆ క్షణం కోసమే ఎదురుచూసే భక్తకోటి ఒక్కసారిగా రెట్టింపు ఉత్సాహంతో ముందుకు దూకుతారు. జయజయధ్వానాల మధ్య రకాలు భారంగా కదులుతాయి. సుమారు మూడు కిలోమీటర్ల దూరంలో ఉన్న గుండిచా ఆలయానికి చేరుకోడానికి 12 గంటల సమయం పడుతుంది. గుండీచా వనం చేరుకున్నాక, ఆ రాత్రి ఆలయం బయట రథాల్లోనే మూలవిరాట్టుకు విశ్రాంతినిస్తారు. మరునాటి ఉదయం మేళతాళాలతో గుడి లోపలకి తీసుకు వెళతారు. శ్రీకృష్ణుడు గోకులం నుండి మథుర యాత్రగా పరిగణించబడుతుంది. ప్రధాన ఆలయం నుంచి మొదలైన యాత్ర గుండిచా ఆలయం చేరుకోవడంలో ఈ యాత్ర హిందూదేశంలో జరిగే గొప్ప కమనీయ వేడుక. మర్నాడు ఉదయం మేళ తాళాలతో గుడిలోపలికి తీసుకువెళతారు. స్వామి అక్కడ ఏడురోజుల పాటు ఉంటాడు. ఈ సమయంలో ఐదవరోజున ఓ ఆసక్తికరమైన విశేషం జరుగుతుంది. ఆలయంలోకి శ్రీనాథుడు తనతోపాటు లక్ష్మీదేవిని తీసుకువెళ్ళ లేదని అలిగి, గుండీచా మందిరం బయట నుంచే జగన్నాథుని ఓరకంట చూసి, పట్టలేని



కోపంతో స్వామిరథాన్ని కొంతమేర ధ్వంసం చేసి వెనక్కి వెళ్ళిపోతుంది. ఈ ముచ్చట అంతా అమ్మవారి పేరిట పూజారులే జరిపిస్తారు. ఆ రోజును 'హేరాపంచమి' అంటారు. వారం రోజులు గుండీచా ఆతిథ్యం స్వీకరించిన సుభద్ర, బలభద్ర, జగన్నాథులు దశమినాడు తిరుగు ప్రయాణం చేస్తారు. దీనినే 'బహుదాయాత్ర' అంటారు. జగన్నాథుడు మాత్రం మధ్య లో 'అర్థాసని' మౌసీ మా గా ప్రసిద్ధి చెందిన గుడి దగ్గర ఆగి తియ్యటి నైవేద్యం స్వీకరించిన తరువాత మధ్యాహ్నానికి మూడు రథాలూ ఆలయానికి చేరుకుంటాయి. మరునాటి ఏకాదశినాడు స్వామివార్లను స్వర్ణ ఆభరణాలతో (సునాబెడాగ చెప్పబడుతుంది) అలంకరించి దర్శనానికి అనుమతిస్తారు. ఆ దృశ్యం అద్వితీయం. ఆ దర్శన భాగ్యము పుణ్య కర్మలచేతనే లభిస్తుంది. ద్వాదశినాడు మరల విగ్రహాలను రత్న సింహాసనంపై ప్రతిష్ఠించడంతో రథయాత్ర పూర్తవుతుంది. స్వామి లేక చిన్నబోయిన పూరీ, జగన్నాథ దేవాలయము తిరిగి కొత్త కళతో చైతన్య వంతమైన వెలుగులు చిమ్ముతుంది.

ఎక్కడ, ఏ దేవాలయంలోనూ కనిపించని సోదరులు సోదరి జగన్నాథ, బలభద్ర, సుభద్ర ల దేవతామూర్తులు సమాజానికి అన్నదమ్ముల, అక్కచెల్లెళ్ళ అనుబంధాన్ని స్ఫూర్తిగా అందిస్తోంది.

ఈ రథయాత్ర జరిగే రోజుల్లో సోదరసోదరీ కుటుంబాల కలయిక మథుర వంటకాలతో కలసి భోజనం చేయడం విశేషం. మనంకూడా ఇటువంటి సంప్రదాయం పాటిద్దాం. సంతోషంగా ఉందాం. జై జగన్నాథ!

పూరీలో జగన్నాథ రథయాత్ర 12 రోజుల పాటు జగన్నాథ, బలభద్ర, సుభద్రలకు జరిపే యాత్రలో పాల్గొనే భక్తులు గానీ లేదా పూరీకి వెళ్ళలేని భక్తులు తమ గృహమందే 12, 9, 7 రోజులపాటు ప్రతినిత్యం విష్ణుమూర్తిని విశేష స్తుతి చేస్తే ఈతిబాధలు పోయి సుఖశాంతులు లభిస్తాయి.

# వందేళ్ళ భక్తి ఉద్యమ వనం..శ్రీపాండురంగాశ్రమం




**శతాబ్దకాలంగా భక్తి పరిమళాలు వెదజల్లుతూ, సేవా సుగంధాలను చాటుతూ వస్తున్న శ్రీ పాండురంగాశ్రమం 95వ ఆషాఢీ ఉత్సవాలకు దివ్యశోభతో ముస్తాబవుతోంది. సనాతన ధర్మ సంరక్షణకు చిరునామాగా, సామాజిక చైతన్యానికి మార్గదర్శిగా నిలిచిన ఈ పుణ్యక్షేత్రం భక్తజన హృదయాల్లో విశిష్ట స్థానాన్ని సంపాదించుకుంది. భావానంద భారతి స్వామి నాటిన ఆధ్యాత్మిక వటవృక్షం నేడు వేలాది మంది భక్తులకు ఆశ్రయంగా, ఆత్మోన్నతికి ఆలంబనగా వెలుగొందుతోంది. నిరంతర నామసంకీర్తన, నిర్విరామ అన్నదానం, అపార జీవకారుణ్యంతో ఆశ్రమం భక్తి-సేవా సంప్రదాయాలకు సజీవ సాక్ష్యంగా నిలుస్తోంది. విశ్వనాథ గురుదేవుల శతజయంతి సంవత్సరం ముందు నిర్వహిస్తున్న ఈ ఆషాఢీ మహోత్సవాలు భక్తి, సంస్కృతి, సమానత్వ సందేశాలను మరింత విస్తృతంగా చాటనున్నాయి. భక్తి ప్రవాహాలు, భజనామృత ధారలు, సేవా స్ఫూర్తి, లోకకల్యాణ సంకల్పాల సంగమంగా పాండురంగాశ్రమం మరోసారి ఆధ్యాత్మిక వైభవాన్ని ఆవిష్కరించనుంది.**

"ప్రతియేట సమయాన పర్జన్య దేవుడు కరుణించి వానలు కురుయుగాక.. పాడిపంటలతోడ కూడి భూదేవత నిరతాన్నపూర్ణయై వరలుగాక.."

గొప్ప సామాజిక చైతన్యం కలిగిన ఆధ్యాత్మిక క్షేత్రం శ్రీపాండురంగాశ్రమం ఆనాడే చాటిన లోకకల్యాణ శాంతి సౌభాగ్యమంత్రమిది. ప్రస్తుత వర్షాభావ పరిస్థితులు, ఎల్‌నినో కాలంలో విశ్వనాథ గురుదేవులు ప్రవచించిన ఈ పంక్తుల ఆవశ్యకత ప్రతి ఒక్కరికీ తెలిసి వస్తోంది. శతాబ్దం క్రితం సిద్దిపేట జిల్లా మర్కుక్ మండలంలో శ్రీ భావానంద భారతి స్వామి వారు నెలకొల్పిన శ్రీ పాండురంగ ఆశ్రమం భక్తజనుల్లో ఆధ్యాత్మిక చైతన్యాన్ని నింపుతూ సనాతన ధర్మ పరిరక్షణకు అహరహం కృషి చేస్తూ నేడు 95 వ ఆశాడి ఉత్సవాల వైపు వడివడిగా అడుగులు వేస్తోంది. స్వామివారి నిర్దేశించిన నాదం-సాదం సూక్తులు అక్కడి భగవద్గీత. నిరంతర భగవన్నామ సంకీర్తన... నిర్విరామంగా అన్నదానం... అక్కడి నిత్య కైంకర్యాలు.

విష సర్పానికైనా హాని చేయకూడదన్నది స్వామివారి సిద్ధాంతం. ఇప్పటికీ రోజు రెండు మూడు సర్పాలు వచ్చినా వాటిని పట్టుకొని అడవిలో వదలడమే తప్ప ఎప్పుడూ చంపింది లేదు. ఇలా జీవ కారుణ్యానికి.. భక్తజీవుల ఉద్ధరణకు పెట్టింది పేరుగా నిలిచింది ఆశ్రమం. వచ్చిన భక్తులకు వారి ఆకలి తీరేలా కడుపునిండా భోజనం పెట్టడం.. మానసిక ఆందోళనలు చెరిగిపోయేలా మనసు నిండా భజనలతో భక్తిని నింపడం అక్కడి ప్రత్యేకత.

### జూలై 19 నుంచి ఉత్సవాలు

జులై 19 ఆదివారం నుంచి జూలై 26 ఆదివారం వరకు అంగరంగ వైభవంగా 95వ ఆషాఢీ ఉత్సవాలు నిర్వహించనున్నారు. అందులో జూలై 24 25 26వ తేదీల్లో జరిగే త్రిరాత్రి ఉత్సవాలు ఎంతో విశేషమైనవి



### భక్తుల రాక భగవంతుడికెరుక..

ఆషాఢ శుద్ధ ఏకాదశి నాడు శ్రీ పాండురంగాశ్రమం భక్తులతో కిక్కిరిసి పోతుంది. శతాబ్దం కిందట శ్రీభావానంద భారతి స్వామి వారు నెలకొల్పిన రుక్మిణీపాండురంగ ఆలయంలో వైభవంగా జరిగే ఆషాఢి ఉత్సవాలకు ఊళ్లు దాటి, జిల్లాలు దాటి భక్తులు తరలివస్తారు. వచ్చినవారంతా తొలి ఏకాదశి రోజు ఉపవాసం ఉంటారు. భజనలు చేస్తూ, కీర్తనలు పాడుతూ రాత్రంతా జాగారం చేస్తారు. మర్నాడు ద్వాదశి రోజున తెల్లవారుజామునే స్నానాదికాలు ముగించుకొని అందరూ అన్నప్రసాదం కోసం వేచిఉంటారు. భక్తుల సంఖ్య వేలల్లో ఉంటుంది. అంతా క్రమశిక్షణగా కూర్చొని అన్న ప్రసాదం కోసం వేచిచూస్తారు. ముత్యాల్లాంటి అన్నం.. రుచికరమైన వేడివేడి సాంబారు. ఇదే ఆషాఢి ఉత్సవ ప్రత్యేక అన్నప్రసాదం. తిరుపతి లడ్డు, అన్నవరం ప్రసాదంలా ఆషాఢి సాంబారు కూడా ప్రత్యేక గుర్తింపును కలిగి ఉంది. ఎందరు వచ్చినా అందరికీ అన్నం అందుతుంది. ఎందుకు అందదూ.. అన్నప్రసాదం ఎంత వండాలో అక్కడ సాక్షాత్ పాండురంగడే నిర్ణయించడం విశేషం. ఏటా ఉత్సవాలు ప్రారంభం కాగానే స్వామి ముందు



## 95వ ఆషాఢీ ఉత్సవాల వివరాలు

సిద్దిపేట జిల్లా, మరుకూకు మండలం, భావానందపురం లోని శ్రీ పాండురంగ ఆశ్రమంలో శ్రీ పరాభవ నామ సంవత్సర ఆషాఢ శు.పంచమి ఆదివారము తేదీ 19-7-2026 నుంచి ఆషాఢ శు. ద్వాదశి ఆదివారం 26-7-2026 వరకు వివిధ కార్యక్రమాలు జరుగుతాయి.

19వ తేదీ ఉ. 9.00 గం. నుండి 95వ, ఆషాఢీ ఉత్సవ శోభాయాత్ర- కొండపాక మండలం, అంకిరెడ్డిపల్లి గ్రామం గాయత్రీ ఆశ్రమము నుంచి శ్రీ పాండురంగాశ్రమము వరకు జరుగును.

21న శ్రీశ్రీశ్రీ యతివర భావానంద భారతీ స్వామివారి పాదుకా పూజ.

22న శ్రీ సీతారామచంద్రస్వామివారికి క్షీరాభిషేకం, పుష్పార్చన, నీరాజన సేవ, తీర్థ ప్రసాద వితరణ, శ్రీ సీతారామకల్యాణోత్సవం శ్రీరామభద్రక్షేత్రం- తూంకుంట వారి నిర్వహణలో జరుగును.

23న శ్రీ భవానీరామలింగేశ్వర స్వామివారికి శతరుద్రాభిషేకము, సామూహిక కుంకుమార్చనలు, పుష్పార్చన, నీరాజన సేవ, తీర్థ ప్రసాద వితరణ.

24న 95వ ఆషాఢీ ఉత్సవాలు ప్రారంభం. గణపతిపూజ, పుణ్యాహవచనం, అఖండ భగవన్నామం ప్రారంభం. శ్రీ రుక్మిణీ పాండురంగ స్వామివారికి క్షీరాభిషేకం, పుష్పార్చన, నీరాజన సేవ, తీర్థ ప్రసాద వితరణ.

25న తొలి ఏకాదశి సందర్భంగా శ్రీ రుక్మిణీ పాండురంగ స్వామివారికి విశేష పూజ, అఖండ భగవన్నామం, విష్ణు సహస్రనామ స్తోత్ర పారాయణం, సాహిత్య-సాంస్కృతిక-సంగీత-నృత్య కార్యక్రమాలు, ఆధ్యాత్మిక ప్రవచనములు.

26 ఆదివారము- ఆషాఢ శు. ద్వాదశి అన్నపూజ, నాదం, అఖండ అన్నప్రసాద వితరణతో 95వ ఆషాఢీ ఉత్సవాల ముగుస్తాయి.





ధర్మచీటీలు వేస్తారు. అందులో ఎన్ని క్వింటాళ్లు వండాలని వస్తే సరిగ్గా అన్ని క్వింటాళ్లే వండుతారు. ఒక మెతుకు అటూ ఇటూ కాకుండా ఆ అన్నమే అందరికీ కడుపునిండా సరిపోతుంది. అన్నాన్ని పెద్ద రాశిగా పోసి పూజచేస్తారు. చాటలతో వడ్డించడం.. పేద పెద్ద తేడా లేకుండా సహపంక్తి భోజనం ఇక్కడి ప్రత్యేకత. ద్వాదశి రోజున అన్నదానంలో పాల్గొనాలని ఒక్క ముద్దైనా ప్రసాదాన్ని స్వీకరించాలని వేలాదిమంది భక్తుల సెంటిమెంట్.

**నామ ఉద్యమం..**

లోకకల్యాణార్థం ఆశ్రమం సంకల్పించిన హరేరామ నామ ప్రచారం దూసుకెళ్తోంది. శతాబ్దం క్రితం స్వామి వారు నెలకొల్పిన భక్తి ఉద్యమం.. ఆ తర్వాత విశ్వనాథ గురుదేవులు స్థాపించిన భగవత్ సేవా సమాజం నేడు మళ్లీ ఊరూవాడా ఉద్యమంలా ముందుకెళ్తోంది. జూన్ 23న మిరుదొడ్డి మండలంలోని అందె గ్రామంలో భగవత్సేవా సమాజం 90వ శాఖ ప్రారంభమైంది. వడివడిగా 100వ శాఖవైపు అడుగులు వేస్తోంది. ఇప్పటికే శతకోటి హరేరామ నామ జపయజ్ఞం పూర్తికాగా.. స్వార్థ త్రిశత కోటి మహా యజ్ఞం వైపు భక్తి ఉద్యమం అడుగులు వేస్తోంది.

**గురుదేవుల శతజయంతి సంవత్సరం**

శ్రీ భావానంద భారతి స్వామి వారి పూర్వాశ్రమ పుత్రులు.. ఆశ్రమ సర్వాధ్యక్షులు మహాత్మ విశ్వనాథ గురుదేవుల శతజయంతి ఉత్సవాలు శ్రావణమాసం నుంచి ప్రారంభం కానున్నాయి. తన అద్భుతమైన రచనలతో.. మార్గ నిర్దేశంతో భక్తులకు దారి చూపిన గొప్ప ఆధ్యాత్మికవేత్త విశ్వనాథ గురుదేవులు. సంవత్సరం అంతా ప్రతినెలా ఒక కార్యక్రమం నిర్వహించి శతజయంతి సమాపనోత్సవాలను ఘనంగా నిర్వహించాలని ఆశ్రమ నిర్వాహకులు నిర్ణయించారు. గురుదేవుల శతజయంతి సంవత్సరం ముందు వస్తున్న ఈ ఆషాఢి ఎంతో ప్రత్యేకమైనది.

- ఆదరాసుపల్లి పద్మ

# సనాతన ధర్మంలో చాతుర్మాస్య వ్రతం

**సనాతన ధర్మంలో చాతుర్మాస్య వ్రతం అనేది మానవ జీవన సరళిని ఆధ్యాత్మికపథంలో నడిపించడానికి ఏర్పడిన అత్యంత పవిత్రమైన కాలంగా పరిగణించబడుతుంది. సాధారణంగా ఆషాఢ శుద్ధ ఏకాదశి (శయన ఏకాదశి) నాడు ప్రారంభమై కార్తిక శుద్ధ ఏకాదశి (ఉత్థాన ఏకాదశి) నాటితో ముగిసే ఈ నాలుగు నెలల కాలాన్ని చాతుర్మాస్యంగా వ్యవహరిస్తారు. స్థితికారుడైన శ్రీమహావిష్ణువు క్షీరసాగరంలో ఆదిశేషునిపై యోగనిద్రలో ఉండే ఈ పుణ్యకాలంలో సాధకులు, యతులు ఎటువంటి ప్రయాణాలు చేయకుండా ఒకే చోట నివసిస్తూ నిరంతర జప, హోమ, ధ్యాన, స్వాధ్యాయ కర్మలలో నిమగ్నమవాలని శాస్త్రాలు నిర్దేశిస్తున్నాయి.**

చాతుర్మాస్య వ్రతాచరణ వెనుక కేవలం వైదిక సాంప్రదాయాలే కాకుండా ఇతర భారతీయ దర్శనాలైన జైన, బౌద్ధ మతాల చారిత్రక ప్రాధాన్యత కూడా దాగి ఉంది. జైన సంప్రదాయంలో దీనిని ''వర్షాయోగ్'' అని పిలుస్తారు. వర్షాకాలంలో భూమిపై అత్యధికంగా పుట్టే సూక్ష్మజీవులకు, కీటకాలకు తమ సంచారం వల్ల ఎటువంటి హింస జరగకూడదనే అహింసా పరమోధర్మ భావనతో జైన మునులు ఒకే చోట స్థిరంగా ఉండి ఈ కాలాన్ని గడుపుతారు.అలాగే బౌద్ధ ధర్మంలో దీనిని ''వస్సా'' (వర్షావస) అని పిలుస్తారు.గౌతమ బుద్ధుని కాలం నుండి బౌద్ధ భిక్షువులు ఈ నాలుగు నెలల పాటు విహారాలలోనే ఉంటూ ధ్యాన సాధనలు చేసేవారు.ఈ వ్రత ముగింపులో గృహస్థులు భిక్షువులకు నూతన కాషాయ వస్త్రాలను దానం చేసే అత్యంత పవిత్రమైన ''కఠిన'' ఉత్సవాన్ని జరుపుకుంటారు.ఈ విధంగా చాతుర్మాస్యం అనేది భారతీయ ఆధ్యాత్మికతలో భౌతిక సుఖాలను త్యజించి, ఆత్మపరిశోధన చేసుకోవడానికి ఏర్పడిన ఒక సామూహిక సాధనా కాలం.

### 'శ్రీ చాతుర్మాస్య మాహాత్మ్యము' - సమగ్ర అధ్యయనం

సద్గురు శ్రీ మలయాళస్వాములవారు రచించిన 'శ్రీ చాతుర్మాస్య మాహాత్మ్యము'' గ్రంథం చాతుర్మాస్య వ్రతం వైదిక పునాదులను, ఆచరణాత్మక నియమాలను, తాత్త్విక రహస్యాలను అత్యంత సులభమైన శైలిలో వివరిస్తుంది.

### కాల నిర్ణయము, వ్రత విధివిధానాలు

గ్రంథంలోని మొదటి అధ్యాయం చాతుర్మాస్య వ్రత కాలనిర్ణయాన్ని స్పష్టం చేస్తుంది. ఆషాఢ శుద్ధ ఏకాదశి నాడు ఉపవాసముండి ఈ వ్రతాన్ని ప్రారంభించి, కార్తిక శుద్ధ ద్వాదశి రోజున పూర్తి చేయాలి.


తెలుగుదేశాలలో అనుసరించే అమాంత పద్ధతికి, వింధ్య పర్వతాలకు ఉత్తరాన ఉన్న పూర్ణిమాంత పద్ధతికి మధ్య నెలల లెక్కింపులో స్వల్ప భేదాలు ఉన్నప్పటికీ, వ్రత కాలం నిడివిలో ఎటువంటి మార్పు ఉండదు.

అమావాస్యతో ముగిసే పద్ధతిని 'అమాంత పద్ధతి' అంటారు. (అమావాస్య ం అంతము = అమాంతము).

ఈ పద్ధతి ప్రకారం ఒక నెల అనేది అమావాస్య ముగిసి, మరుసటి రోజు పాడ్యమి (శుక్ల పక్షం) ప్రారంభమైనప్పటి నుండి.. తిరిగి అమావాస్య ముగిసే వరకు ఉంటుంది. అంటే ఒక నెలలో మొదట శుక్లపక్షం (చంద్రుడు పెరిగే కాలం), ఆ తర్వాత కృష్ణపక్షం (చంద్రుడు తిరిగే కాలం) వస్తాయి.

ఆంధ్రప్రదేశ్, తెలంగాణ, కర్ణాటక, మహారాష్ట్ర, గుజరాత్ వంటి దక్షిణ మరియు పశ్చిమ భారత రాష్ట్రాలలో ఈ అమాంత పద్ధతినే ప్రామాణికంగా తీసుకుంటారు. మన ఉగాది పండుగ (చైత్ర శుద్ధ పాడ్యమి) ఈ పద్ధతి ప్రకారమే వస్తుంది.

పూర్ణిమాంత పద్ధతి వింధ్య పర్వతాలకు ఉత్తరాన ఉన్న రాష్ట్రాలలో (ఉత్తర ప్రదేశ్, మధ్యప్రదేశ్, బీహార్, రాజస్థాన్



మొదలైన చోట్ల) దీనిని పాటిస్తారు. ఈ పద్ధతిలో నెల పౌర్ణమితో ముగుస్తుంది (పూర్ణిమ + అంతము = పూర్ణిమాంతము). ఇక్కడ నెల కృష్ణపక్షంతో (పాడ్యమితో) ప్రారంభమై, పౌర్ణమితో ముగుస్తుంది.

ఈ రెండు పద్ధతుల వల్ల నెలల పేర్ల లెక్కింపులో కేవలం 15 రోజుల తేడా (ఒక పక్షం) కనిపిస్తుంది. కానీ, చాతుర్మాస్య వ్రతాన్ని తిథుల ఆధారంగా లెక్కిస్తారు.

ఇక్కడ రెండు పద్ధతుల్లోనూ 'శుద్ధ పక్షం' (శుక్ల పక్షం) ఒకే సమయంలో వస్తుంది. అమాంత పద్ధతిలో అయినా, పూర్ణిమాంత పద్ధతిలో అయినా ఆషాఢ శుద్ధ ఏకాదశి, కార్తీక శుద్ధ ద్వాదశి తిథులు ఒకే రోజున వస్తాయి. అందువల్ల, ప్రాంతాన్ని బట్టి నెలల లెక్కింపు పద్ధతి మారినప్పటికీ, వ్రతం ఆచరించే ఆ నాలుగు నెలల కాలం అందరికీ ఒక్కటే ఉంటుంది.

### వ్రతం ఎలా చేస్తారు?

ఆషాఢ శుద్ధ ఏకాదశి నాడు వ్రత గ్రహణ సమయంలో "సుప్తే త్వయి జగన్నాథే జగత్సుప్తం భవేదిదమ్..." అనే మంత్రాన్ని పఠిస్తూ శ్రీకృష్ణుని పటాన్ని లేదా విగ్రహాన్ని ప్రతిష్ఠించి, కలశస్థాపన పూజలు నిర్వహించాలి. కార్తీక శుద్ధ ద్వాదశి నాడు వ్రత సమాప్తి సమయంలో "ఉత్తిష్ఠోత్తిష్ఠ గోవింద త్యజ నిద్రాం జగత్పతే..." అనే మంత్రాలను పఠిస్తూ భగవంతుని మేల్కొలపాలి. ఈ నాలుగు నెలల కాలంలో సాధకుడు పాటించవలసిన పది ముఖ్యమైన నియమాలను శ్రీ మలయాళస్వామివారు పేర్కొన్నారు.

### పది ముఖ్యమైన నియమాలు

ఒక పూట మాత్రమే భోజనం చేయడం (ఏకభుక్తం), నేలపై పడుకోవడం (అధశ్శయ్య), బ్రహ్మచర్యము పాటించడం,





అహింసను ఆచరించడం, కఠిన వ్రతాలు మరియు తపస్సు చేయడం, కృచ్ఛ్ర చాంద్రాయణాది క్రియలు నిర్వహించడం, దేవపూజ చేయడం, మరియు దివ్యమంత్ర జపం చేయడం ఇందులో ప్రధానమైనవి.ఒకవేళ నాలుగు నెలలు పూర్తిగా చేయలేని వారు రెండు నెలల పాటు చేసే "అర్ధ చాతుర్మాస్యం" కూడా శాస్త్ర సమ్మతమేనని స్వామివారు వివరించారు.ఈ వ్రతాచరణకు స్త్రీ, పురుష, కుల భేదాలు లేవని, మహాత్మా గాంధీ తల్లి పుత్లీబాయ్ గారు అత్యంత నిష్ఠతో ఈ వ్రతాన్ని ఆచరించి గాంధీజీ వంటి లోకోత్తర పురుషునికి జన్మనిచ్చారని ఉదాహరించారు.

### చాతుర్మాస్యంలో ఆహార నియమాలు

ఈ నాలుగు నెలల్లో నెలకొకటి చొప్పున ఆహార నియమాలను పాటిస్తారు. 1వ నెల (శాక వ్రతం) కూరగాయలు, చింతపండు వాడకూడదు. 2వ నెల (దధి వ్రతం) పెరుగు, మజ్జిగ వంటి పదార్థాలు తీసుకోకూడదు. 3వ నెల (క్షీర వ్రతం) పాలు, పాల పదార్థాలు వాడకూడదు. 4వ నెల (ద్విదల వ్రతం) ముడి ధాన్యాలు (పప్పు ధాన్యాలు) తినకూడదు. ఈ వ్రతంలో కొన్ని పదార్థాలను, అలవాట్లను విడిచిపెట్టడం వల్ల అద్భుతమైన ఫలితాలు కలుగుతాయని పరమేశ్వరుడు నారదునికి చెప్పాడు.

బెల్లం వదిలితే.. మధురంగా మాట్లాడే శక్తి వస్తుంది; నూనెలు వదిలితే.. మంచి సంతానం కలుగుతుంది; నెయ్యి వదిలితే.. అందమైన శరీరం లభిస్తుంది; సువాసన నూనెలు వదిలితే.. సౌభాగ్యం సిద్ధిస్తుంది; మౌనవ్రతం పాటిస్తే.. సర్వాధికారాలు లభిస్తాయి; యోగసాధన చేస్తే.. బ్రహ్మపదం దక్కుతుంది; దేవాలయం శుభ్రం చేస్తే.. వైకుంఠ ప్రాప్తి కలుగుతుంది; తులసి పూజ చేస్తే.. విష్ణులోక ప్రాప్తి లభిస్తుంది.

### ఆరోగ్య రహస్యం

ఆషాఢ మాసం నుండి వర్షాకాలం మొదలై, ఆ తర్వాత శరదృతువు వస్తుంది. వాతావరణంలో వచ్చే ఈ మార్పుల వల్ల

అనేక రోగాలు, క్రిములు వ్యాప్తి చెందుతాయి. వాటి బారినుంచి శరీరాన్ని రక్షించుకోవడమే చాతుర్మాస్య వ్రతం ముఖ్య ఉద్దేశం. శరీరాన్ని, మనస్సును ఆరోగ్యంగా ఉంచుకుంటూ భగవంతుడిని చేరుకోవడమే ఈ వ్రతం అసలు పరమార్థం. ఈ చాతుర్మాస్య వ్రతాన్ని కేవలం సన్యాసులే కాకుండా... బ్రహ్మ చారులు, గృహస్థులు, వానప్రస్థులు ఇలా ఎవరైనా ఆచరించి, ఆ పరమాత్మ అనుగ్రహాన్ని, అక్షయమైన ఆనందాన్ని పొందవచ్చు.


మన సంస్కృతిలో గురువుకు అత్యున్నతమైన స్థానం ఉంది. బ్రహ్మ సమక్షంలో చేసిన పాపం విష్ణు సన్నిధిలో, విష్ణువు వద్ద చేసిన పాపం శివుని సన్నిధిలో, శివుని వద్ద చేసిన పాపం కేవలం గురు సన్నిధిలో మాత్రమే నశిస్తుంది. అందుకే గురువును పరబ్రహ్మ స్వరూపంగా భావిస్తాం. యతులకు (సన్యాసులకు) అత్యంత ముఖ్యమైన రోజు 'గురుపూర్ణిమ'. యతులందరూ విధిగా ఆచరించే చాతుర్మాస్య వ్రతం గురుపౌర్ణమి నాడు కొందరు ప్రారంభిస్తారు.



### పురాణాలలో చాతుర్మాస్య ప్రాశస్త్యం

భాగవతం - నారదుని వృత్తాంతం: నారదమహర్షి తన పూర్వజన్మలో ఒక దాసీ పుత్రుడు. చాతుర్మాస్య వ్రతం చేసే యతులకు సేవ చేయడం వల్లే ఆయనకు విష్ణుపదం దక్కి, తదుపరి జన్మలో దేవర్షి కాగలిగాడు.

వరాహపురాణం: భూదేవి అడిగిన ప్రశ్నకు సమాధానంగా విష్ణుమూర్తి స్వయంగా ఇలా చెప్పాడు. చాతుర్మాస్యపు నాలుగు నెలలు నాకు అత్యంత ఇష్టమైనవి. ఈ రోజుల్లో చేసే దానాలు, వ్రతాలు, జపహోమాలకు నేను త్వరగా సంతోషించి కోరిన కోర్కెలు తీరుస్తాను.



స్కాందపురాణం: సూర్యుడు కర్కాటక రాశిలో ఉన్నప్పుడు (ఆషాఢ శుద్ధ ఏకాదశి నుండి కార్తిక శుద్ధ ఏకాదశి వరకు) దేవతలకు రాత్రి సమయం. ఈ నాలుగు నెలల్లో వ్రతాలు చేయడం వల్ల బ్రహ్మ హత్యాది దోషాలు సైతం తొలగిపోవడమే కాకుండా, అశ్వమేధ యాగం చేసినంత ఫలితం దక్కుతుంది.

### వ్యాసపౌర్ణమి

వ్యాసుడు సాక్షాత్తు విష్ణు స్వరూపం. "వ్యాసో నారాయణో హరి:" అని కదా వచనం. భగవంతుని అవతారాల్లో ప్రతి ద్వాపరయుగంలోను విష్ణువు వ్యాసుడై అవతరించి కర్మ, భక్తి, జ్ఞానాలను బోధించి సమాజాన్ని ధర్మమార్గంలో నడిపిస్తాడని విష్ణుపురాణాది గ్రంథములు పేర్కొన్నాయి. వ్యాసుడనేది ఒక వ్యక్తిపేరు కాదు. అది ఆ వ్యక్తి చేసే పనిని బట్టి ఏర్పడిన దివ్యనామం. ఆ స్థానంలో ఎవరున్నా వారిని వ్యాసుడనే పిలుస్తారు. ఇప్పటి వరకు విష్ణుభగవానుడే అన్ని యుగాలలో వ్యాసరూపముతో అవతరించి లోకోపకారం చేశాడు. అటువంటి వ్యాసుడు అవతరించిన దినమే ఆషాఢ శుద్ధ పూర్ణిమ. దీనినే గురుపౌర్ణమిగా అనేక నిబంధన గ్రంథాలు పేర్కొనడంతో ఈ రోజు వ్యాసపూజ, గురుపూజ మహోత్సవం ఏర్పడింది.

### వ్యాసపూజా-అంతరార్థం

ఉత్కృష్టమైన పర్వదినం వ్యాసపూర్ణిమా. ఈ రోజు పురాతనమైన మన భారతీయ గురుశిష్య సంప్రదాయాన్ని జ్ఞాపకం చేసుకొంటు ప్రతి హిందువు గురువులందరికి పరమ గురువైన వ్యాసునియొక్క స్ఫూర్తిని గ్రహించాలి. జ్ఞాన, విజ్ఞాన సంపన్నత కొరకు వ్యాసున్ని పూజించాలి. ఈ సత్సంప్రదాయంతో మంచి ఉత్తేజాన్ని పొంది "ధర్మోరక్షతి రక్షిత:" అన్న ఉపదేశం ప్రకారం స్వధర్మ ఆచరణలో కార్యోన్ముఖులై తద్వారా సర్వ శుభాలను పొందవచ్చు.

చాతుర్మాస్య వ్రతంలోని 'సీమోల్లంఘనం' అనేది నిశ్చలమైన తపస్సు ముగిసిందని, లోక కల్యాణం కోసం, భక్తుల శ్రేయస్సు కోసం గురువుగారి దివ్య మంగళ ప్రయాణం మళ్లీ మొదలైందని చాటిచెప్పే ఒక పవిత్రమైన ఘట్టం.

ఆరోగ్యవంతులైన భక్తులు ఈ చాతుర్మాస్య వ్రత నియమాలను నిష్ఠగా ఆచరించి భగవంతుని అనుగ్రహం పొందెదరుగాక!

**- ఆచార్య తాడేపల్లి పతంజలి**

# అభినవ శంకర విజయం



మల్లాప్రగడ
శ్రీమన్నారాయణ మూర్తి

(గత సంచిక తరువాయి)

శ్రీ సచ్చిదానంద శివాభినవ నృసింహ భారతీస్వామి వారికి శృంగేరీపీఠాధిపతిగా జగద్గురుత్వ పట్టాభిషేకం కోసం ప్రమాథి సంవత్సర ఆషాఢశుద్ధ అష్టమినాడు సుముహూర్తం నిర్ణయ మైంది. విజయనగర తొలి పాలకులైన హరిహర బుక్కరాయలు ఆనాడు విద్యారణ్యస్వామివారికి సమర్పించిన విలువైన బంగారు ఆభరణాలు ధరించి స్వామివారు పట్టాభిషేకంలో పాల్గొన్నారు. అయినా ఆ మహనీయుని మనస్సులో సంపదల పట్లగాని అధికారాలపట్లగానీ ఏవిధమైన వికారమూ కలుగలేదు. రాజ్యాధికారం స్వీకరించనున్న సమయంలో అనుకోకుండా జరిగిన పరిణామాల కారణంగా వనవాసానికి తగినట్లుగా నారచీరలు ధరించి ఏ విధమైన వికారమూ లేనట్లున్న రామచంద్రునివలె జగద్గురువులు ఏ విధమైన మనోవికారమూ లేకుండా నిర్లిప్తంగా ఉన్నారు.

శిరస్సుపై రత్నాలు పొదిగిన బంగారు కిరీటం, సుకుమార మైన వెలుగు లీనే పట్టువస్త్రాలు, కంఠసీమలో బంగారు హారాలు, చేతిలో స్ఫటికమాల, యోగిరాజైన స్వామివారు విజయనగరకాలంనాటి ఆభరణ విశేషాలతో మహారాజవేషంలో ముచ్చటగొలిపే విధంగా ఉన్నారు. ఆ దృశ్యం చూడాలని వచ్చిన వారి మనస్సులకు ఆనందం కలిగే విధంగా ఒకవంక మంగళ తూర్యరావాలు, మరోవంక వేదపండితులు చేసే వేదనాదాలు వినిపిస్తూ ఉండగా, స్వామివారి శిరస్సుపై కుంభాభిషేకం నిర్వహించారు.

ఈ విధంగా జగద్గురుస్థానంలో పట్టాభిషిక్తులైన స్వామివారు కొన్ని సంవత్సరాలు శృంగేరిలో ఉండి, తపస్సులో యోగంలో నిలిచిఉండి, తన అనుష్ఠానంచేత ఆస్తికలోకాన్ని చక్కగా పరిపాలిస్తూ, పార్థివనామ సంవత్సరంలో మార్గశిర మాసంలో యాత్రకు బయలుదేరారు. ఆస్తికతనూ ధర్మాన్నీ జ్ఞానవైరాగ్యా లనూ జాతికి ప్రబోధించటమే స్వామివారి విజయ యాత్రకు లక్ష్యం. ఈ సందర్భాన్ని ఆధారంచేసుకుని శ్రీ లలితాదిత్య ఒక చమత్కారం చేశారు. ఆ చమత్కారం ఆధారంగా ఒక మంచి విషయం నిరూపించారు.

'ఆశను జయించలేక ఒక దేశపు రాజు ఇంకా ఏవో దేశాలను ఆక్రమించాలనే ఆశకారణంగానే దిక్కులను జయించటానికి దండయాత్రలు చేస్తాడు. ఆశలన్నింటినీ జయించి, జ్ఞానవైరాగ్య సంపన్నులైన స్వామివారు అన్నిదిక్కులా విజయ యాత్రకు బయలుదేరారు. జాతిజనుల హృదయా లలో జ్ఞానసంపదను ప్రవేశపెట్టటమే స్వామివారి విజయయాత్రల లక్ష్యం. ఆశ అంటే మనస్సులోని ఆశ అనీ, దిక్కు అనీ వేరువేరు అర్థాలు ఆధారంగా చక్కని చమత్కారం చేశారు కవి.



"ఆశాజయి కాకుంటనె
ఆశాజితి జేయ వెడలు నవనీశానుం
డాశా విజేత యగుటనె
ఆశాజయయాత్రకేగె యతి చిత్రముగన్."

అన్నారు లలితాదిత్యకవి.

విజయ యాత్రలో భాగంగా మొదట గోకర్ణం చేరారు శ్రీశ్రీశ్రీ సచ్చిదానంద శివాభినవ నృసింహ భారతీస్వామివారు. తమ గురువుగారు చూపిన మార్గాన్నే అనుసరిస్తూ, యాత్రను ప్రారంభించారు.

"గురు దీక్షయె తన దీక్షగ
గురు హృదయము స్వహృదయముగ గోచరమగు న
ట్లరిగె చరమసమయాస్థిత
గురుసుస్మార్యా విషయము గోకర్ణమునన్."

బనవాసి, సిరిసి ప్రదేశాలలో పర్యటిస్తూ, ఉత్తర కర్ణాటక యాత్రలో అక్కడి ప్రజలకు ప్రశాంతతను కలిగిస్తూ, మహారాష్ట్ర వైపుగా అడుగువేశారు. యోగిహర్యక్షుడైన స్వామివారు తమ పరివారం అందించే సేవలు స్వీకరిస్తూ గోకర్ణం చేరారు. ఆ గోకర్ణక్షేత్ర విశిష్టతను అంత్యప్రాస విన్యాసంతో, సమాస భూయి ష్ఠంగా వర్ణించారు లలితాదిత్యకవి. ఆ గోకర్ణం "దేవమయ తీర్థ వ్రాత సంకీర్ణమ"నీ, "రక్షోరాజ బలాప్రకంప్యపుర జైత్రఖ్యాతి పూర్ణంబ"నీ, "ధైర్యాక్షుద్రాంబుధివీచికా ధ్వనిత పంచార్ణ"మనీ చేసిన వర్ణన ప్రౌఢప్రబంధవర్ణనలను తలపిస్తోంది. (సశేషం)

**భారతీయ ఆధ్యాత్మిక సంప్రదాయంలో గురువు కేవలం ఉపదేశకుడు కాదు; ఆయన జీవన మార్గదర్శి, ధర్మరక్షకుడు, జ్ఞానదీపిక. అటువంటి గురుతత్త్వానికి సజీవ స్వరూపంగా, దత్తసంప్రదాయ మహిమాన్విత వారసత్వానికి ప్రతీకగా వెలుగొందుతున్న పరమపూజ్య శ్రీ గణపతి సచ్చిదానంద స్వామీజీ వారి 84వ జన్మదిన మహోత్సవాలు మైసూరు శ్రీ అవధూత దత్తపీఠంలో అంగరంగ వైభవంగా జరిగాయి.**

అధిక జ్యేష్ఠ శుద్ధ ఏకాదశి పుణ్యదినాన జరిగిన ఈ ఉత్సవాలు కేవలం జన్మదిన వేడుకలు మాత్రమే కావు; అవి గురుభక్తికి, ధర్మరక్షణకు, భారతీయ జ్ఞానసంపదకు అర్పించిన మహాయజ్ఞంలా అనిపించాయి. దేశ విదేశాల నుంచి తరలివచ్చిన భక్తజన సమూహం మధ్య దత్తపీఠం ఆధ్యాత్మిక తేజస్సుతో కళకళలాడింది.

భారతీయ సంస్కృతిలో గురుపాదసేవకు ఉన్న ప్రాధాన్యతను ఈ దృశ్యం మరోసారి చాటి చెప్పింది. వేలాది మంది భక్తులు పరమపూజ్య స్వామీజీ వారికి అత్యంత భక్తిశ్రద్ధలతో ప్రత్యక్ష పాదపూజ నిర్వహించి గురుచరణ సేవను పొందారు. గురువు చరణాల్లో శరణాగతి పొందడమే పరమపదమనే భావనతో భక్తులు ఆనందాశ్రువులతో ఈ దివ్యసందర్భాన్ని అనుభవించారు.

**ధర్మసేవకులకు దత్తపీఠ గౌరవ వందనం**

శ్రీ స్వామీజీ జన్మదినోత్సవాలలో అత్యంత విశిష్ట ఘట్టంగా నిలిచింది 'చైతన్య అర్చన'. వేదాలు, శాస్త్రాలు, కళలు, ధర్మప్రచారం, ప్రకృతి పరిరక్షణ వంటి రంగాలలో విశిష్ట సేవలందిస్తున్న శ్రీ స్వామీజీ జన్మదిన మహోత్సవాలలో అత్యంత విశిష్టమైన కార్యక్రమం 'చైతన్య అర్చన' కార్యక్రమం. వేదం, శాస్త్రం, సంగీతం, ధర్మప్రచారం, ప్రకృతి పరిరక్షణ వంటి రంగాలలో విశిష్ట సేవలందిస్తున్న మహనీయులను సత్కరించడం ద్వారా దత్తపీఠం భారతీయ విలువలను గౌరవించే తన మహోన్నత సంప్రదాయాన్ని దత్తపీఠం తరపున సత్కరించడం ఈ కార్యక్రమం ముఖ్య ఉద్దేశ్యం.

# మైసూరు దత్తపీఠంలో ఆధ్యాత్మిక వైభవం

## అప్పాజీ 84వ జన్మదిన మహోత్సవాలు

కర్ణాటక సాంస్కృతిక రాజధాని మైసూరులో వెలసిన శ్రీ అవధూత దత్తపీఠం, మే 27, 2026 (అధిక జ్యేష్ఠ శుద్ధ ఏకాదశి) నాడు అపూర్వ ఆధ్యాత్మిక కాంతితో విరాజిల్లింది. ప్రపంచ వ్యాప్తంగా కోట్లాది భక్తులు ప్రేమతో ''అప్పాజీ'' అని సంబోధించే పరమపూజ్య శ్రీశ్రీశ్రీ గణపతి సచ్చిదానంద స్వామీజీ వారి 84వ జన్మదిన మహోత్సవాలు అత్యంత ఘనంగా, భక్తిశ్రద్ధలతో నిర్వహించబడ్డాయి. భక్తి, గురునిష్ఠ, సనాతన ధర్మ పరిరక్షణ, వేదసంస్కృతి ప్రచారానికి ప్రతీకగా నిలిచిన ఈ ఉత్సవాలు దత్తపీఠ చరిత్రలో మరొక సువర్ణాధ్యాయంగా నిలిచిపోయాయి.

**ప్రత్యక్ష పాదపూజ**

ప్రభాత వేళల నుంచే దత్తపీఠ ప్రాంగణం భక్తి భావాలతో నిండిపోయింది. వేలాది మంది భక్తులు తమ ప్రాణప్రియ గురువైన 'అప్పాజీ' వారికి ప్రత్యక్ష పాదపూజ నిర్వహించి తమ జన్మలను ధన్యం చేసుకున్నారు. గురుచరణాల్లో నమ్రతతో వంగిన ప్రతి శిరస్సులోనూ కృతజ్ఞత, విశ్వాసం, శరణాగతి ప్రతిఫలించాయి.

ఈ సందర్భంగా వేదనిధి, శాస్త్రనిధి, నాదనిధి, ధర్మబంధు, సస్యబంధు వంటి ప్రతిష్ఠాత్మక బిరుదులు ప్రదానం చేశారు. అయితే ఈ సత్కార సభలో ప్రత్యేకంగా అందరి దృష్టిని



ఆకర్షించిన ఘట్టం ఒకటుంది. అందులో బ్రహ్మశ్రీ సామవేదం షణ్ముఖ శర్మ గారికి 'ప్రవచన చక్రవర్తి' బిరుదు ప్రదానం మరింత విశేషం.

ఈ సందర్భంగా స్వామీజీ స్వయంగా క్రింది ప్రముఖులకు ప్రతిష్ఠాత్మక పురస్కారాలు, బిరుదులు ప్రదానం చేసి సత్కరించారు.

వేదనిధి -- శ్రీ వి. జంబునాథ ఘనపాఠి

శాస్త్రనిధి -- శ్రీ కుప్పా విశ్వనాథ శర్మ

నాదనిధి -- విద్వాన్ సురేష్ వైద్యనాథన్

ప్రవచన చక్రవర్తి -- బ్రహ్మశ్రీ సామవేదం షణ్ముఖ శర్మ

ధర్మబంధు -- శ్రీ రవీందర్ పండిత

సస్యబంధు -- శ్రీమతి అనుపమ వేదాచల

ఈ మహనీయుల సేవలను కొనియాడుతూ స్వామీజీ వారందరికీ ఆశీస్సులు అందజేశారు. ధర్మరక్షణకు, భారతీయ జ్ఞానసంపద ప్రచారానికి జీవితాన్ని అంకితం చేసిన వారి కృషిని దత్తపీఠం విశేషంగా గౌరవించడం అందరికీ ఆనందదాయకం .

'ప్రవచన చక్రవర్తి' బిరుదుతో అలంకృతులైన బ్రహ్మశ్రీ సామవేదం షణ్ముఖ శర్మ ఈ సత్కారాలలో భక్తసమాజాన్ని అత్యంత ఆనందపరిచిన ఘట్టం బ్రహ్మశ్రీ సామవేదం షణ్ముఖ శర్మ గారికి 'ప్రవచన చక్రవర్తి' బిరుదు ప్రదానం కావడం.

శ్రీశ్రీశ్రీ గణపతి సచ్చిదానంద స్వామీజీ వారి కరకమలాల నుంచి ఈ ప్రతిష్ఠాత్మక బిరుదును స్వీకరించిన గురువుగారు, దశాబ్దాలుగా వేదాలు, ఉపనిషత్తులు, పురాణాలు, ఇతిహాసాలు, సనాతన ధర్మ తత్వాలను అత్యంత సరళంగా, హృద్యంగా, జీవితానికి అన్వయించే రీతిలో ప్రజలకు అందిస్తున్నారు.

ఆయన ప్రవచనాలలో ఉన్న జ్ఞానగాంభీర్యం, భక్తిరసం, హాస్యచాతుర్యం, జీవనోపయోగ మార్గదర్శకత్వం లక్షలాది మంది శ్రోతల హృదయాలను స్పృశించాయి. యువత నుంచి వృద్ధుల వరకు, పండితుల నుంచి సామాన్యుల వరకు అందరికీ చేరువైన ఆయన ఉపన్యాసాలు ధర్మప్రచారానికి శక్తివంతమైన సాధనంగా నిలిచాయి.

అందువల్ల 'ప్రవచన చక్రవర్తి' అనే మహోన్నత బిరుదు ఆయనకు లభించడం కేవలం వ్యక్తిగత గౌరవం మాత్రమే కాదు; ధర్మప్రచార రంగానికి, గురుపరంపరకు, సనాతన సంస్కృతికి లభించిన గౌరవంగా భక్తులు భావిస్తున్నారు. ఈ సందర్భంలో షణ్ముఖ కింకరులు, శిష్యులు, అభిమానులు హృదయపూర్వక అభినందనలు సమర్పిస్తూ గురువుగారికి ఆయురారోగ్యాలు, మరింత సేవాశక్తి, నిరంతర ధర్మప్రచార వైభవం కలగాలని ప్రార్థించారు.

**వ్యాస వాక్య ప్రవాహేణ భక్తి జ్ఞాన ప్రదాయినే ।**
**ప్రవచన చక్రవర్తిత్వం యుక్తమేవ మహాత్మనే ॥**
**శ్రీ గణపతి సచ్చిదానంద స్వామినః కృపయా లభితం ।**
**శ్రీ సామవేద షణ్ముఖ శర్మణే భూయాత్ కీర్తిరనుత్తమా ॥**

వ్యాసమహర్షి వాక్యాల ప్రవాహంలా జ్ఞానభక్తులను ప్రసాదించే మహాత్ముడైన బ్రహ్మశ్రీ సామవేదం షణ్ముఖ శర్మ గారికి 'ప్రవచన చక్రవర్తి' బిరుదు అత్యంత సముచితమైనదనే భావాన్ని ఈ శ్లోకం వ్యక్తపరుస్తోంది.

చివరిగా కాలం అప్పాజీ స్వామి వారి వారి సంస్థానంలో ఈ విధంగా ప్రశంసించారు. కాలం మారుతోంది, మన జీవన విధా నాలు మారుతున్నాయి. సమాచార ప్రవాహం పెరుగుతోంది. అయితే ధర్మజ్ఞానం ప్రజల హృదయాలకు చేరే మార్గాలు తగ్గిపోతున్నాయని భావించే ఈ యుగంలో వేదాలు, పురాణాలు,



ఇతిహాసాలు, భగవద్గీత, రామాయణం, భారతం వంటి శాశ్వత సత్యాలను సామాన్య ప్రజలకు సులభంగా అందిస్తున్న మహనీయులలో బ్రహ్మశ్రీ సామవేదం షణ్ముఖ శర్మ అగ్రగణ్యులు అని అభివర్ణించారు.

ఆయన ప్రవచనాలలో శాస్త్రగాంభీర్యం ఉంటుంది; కానీ భారంగా అనిపించదు. భక్తి ఉంటుంది; కానీ మూఢత్వం ఉండదు. హాస్యం ఉంటుంది; కానీ అల్పత్వం ఉండదు. జీవిత సత్యాలు ఉంటాయి; కానీ నిరాశ ఉండదు. అందుకే లక్షలాది మంది శ్రోతలు ఆయనను కేవలం ప్రవచనకర్తగా కాకుండా జీవన గురువుగా భావిస్తారు. దశాబ్దాలుగా సాగుతున్న ఆయన ధర్మప్రచార యజ్ఞం కోట్లాది మందిని భారతీయ సంస్కృతికి మరింత చేరువ చేసింది. అలాంటి మహనీయునికి "ప్రవచన చక్రవర్తి" బిరుదు లభించడం కేవలం ఒక సత్కారం కాదు; అది ధర్మప్రచారానికి జరిగిన పట్టాభిషేకం అని మరి కొందరు అక్కడ సంస్థానం లో మన సామవేదం వారిని ఉద్దేశించి మాట్లాడేరు.

అలాగే వివిధ రంగాలలో సేవ చేసిన వారిని కూడా సత్కరిస్తూ ప్రశంసించారు.

### గరుడవాహన ఉత్సవం

సాయంత్రం ప్రదోష వేళ శ్రీ దత్త వెంకటేశ్వర స్వామివారికి నిర్వహించిన గరుడవాహన ఉత్సవం భక్తులకు దివ్యానుభూతిని కలిగించింది. వేదఘోషలు, మంగళవాయిద్యాలు, గోవిందనామ స్మరణల మధ్య సాగిన ఈ ఉత్సవం భక్తులకు అపూర్వ ఆధ్యాత్మి కానందాన్ని ప్రసాదించింది. ఒక్కసారిగా ఈ ఉత్సవం తిరుమల వైభవాన్ని గుర్తుకు తెచ్చింది. భక్తుల కళ్లలో ఆనందబాష్పాలు, హృదయాలలో భక్తిరసం ఒకేసారి పొంగిపొర్లాయి.

### అన్నమయ్య కీర్తనల నృత్యాంజలి

అనంతరం నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలలో 'అన్నమయ్య కీర్తనల నృత్యాంజలి' కార్యక్రమం విశేష ఆకర్షణగా నిలిచింది . ఆధ్యాత్మిక సౌందర్యానికి కళాత్మక రూపం ఇచ్చింది. నృత్యరంజని స్కూల్ ఆఫ్ భరతనాట్యం ఆధ్వర్యంలో డైరెక్టర్ శ్రీమతి రంజితా వివిన్ భావన రూపకల్పన చేసిన ఈ ప్రదర్శన భక్తి, సంగీతం, నృత్యం అనే మూడు పవిత్ర ప్రవాహాలను భక్తి సమ్మేళనంగా సాగిన ఈ ప్రదర్శన ఆధ్యాత్మిక సౌందర్యాన్ని ఒకే వేదికపై ప్రతిబింబించింది

పాదపూజ, పండిత సత్కారాలు, గరుడవాహన సేవ, సాంస్కృతిక కార్యక్రమాలు, గురుభక్తి, ధర్మగౌరవం... ఈ సమస్త అంశాల సమన్వయంతో జరిగిన శ్రీ అప్పాజీ 84వ జన్మదిన మహోత్సవాలు భక్తుల హృదయాలలో చిరస్థాయిగా నిలిచిపోయాయి.

ప్రత్యేకంగా బ్రహ్మశ్రీ సామవేదం షణ్ముఖ శర్మ గారికి "ప్రవచన చక్రవర్తి" బిరుదు ప్రదానం కావడం ఈ



మహోత్సవాలకు మరింత మహిమాన్వితతను చేకూర్చింది. ధర్మప్రచారంలో గురువుల పాత్ర ఎంత విశిష్టమో ప్రపంచానికి చాటిచెప్పిన ఈ సత్కార ఘట్టం సనాతన భారతీయ సంప్రదాయాలకు జీవంత సాక్ష్యంగా నిలిచింది.

గురుభక్తి, ధర్మనిష్ఠ, జ్ఞానప్రచారం, సంస్కృతి పరిరక్షణ... ఈ నాలుగు స్తంభాలపై నిలిచిన ఈ మహోత్సవం భవిష్యత్ తరాలకు స్ఫూర్తిదాయకమైన ఆధ్యాత్మిక సందేశాన్ని అందించింది.

### అప్పాజీ దివ్య సందేశం

శ్రీ అప్పాజీ వారి 84వ జన్మదిన మహోత్సవాలు ఒక ఉత్సవంగా ముగిసాయి. భక్తులను ఉద్దేశించి వారు సందేశం అందించారు.

గురువు ఉన్న చోట జ్ఞానం ఉంటుంది... జ్ఞానం ఉన్న చోట ధర్మం ఉంటుంది... ధర్మం ఉన్న చోట సంస్కృతి ఉంటుంది... సంస్కృతి ఉన్న చోటే భవిష్యత్తు ఉంటుంది.

అందుకే ఈ మహోత్సవం కేవలం ఒక జన్మదిన వేడుక కాదు; అది గురుపరంపర వైభవానికి, సనాతన ధర్మ చైతన్యానికి, భారతీయ ఆధ్యాత్మిక సంస్కృతికి జరిగిన మహామంగళహారతి.

ప్రవచన చక్రవర్తి బిరుదుతో అలంకృతులైన బ్రహ్మశ్రీ సామవేదం షణ్ముఖ శర్మ గారికి హృదయపూర్వక అభినందనలు తెలియచేసారు.

పరమపూజ్య శ్రీ గణపతి సచ్చిదానంద స్వామీజీ వారి ఆశీస్సులతో అందరికీ ప్రసరిస్తూ ఉండాలని కోరుకుంటున్నాము.

**- శర్మ రాణి**




(గత సంచిక తరువాయి)

ఈ రెండు కోశాలు - అన్నమయకోశం మరియు ప్రాణమయ కోశం - భూర్లోకంతో (భౌతిక ప్రపంచంతో) అనుసంధానించబడి ఉంటాయి. అంటే, మన భౌతిక శరీరం మరియు దానిలోని జీవశక్తి రెండూ ఈ భూమి లోకంలోనే ఉనికిలో ఉంటాయి.

మనోమయకోశము రెండు భాగాలను కలిగి ఉంటుంది; మొదటి భాగం దట్టమైన భాగం. ఈ భాగములో కోరికలు తమ స్థానాన్ని కలిగి ఉంటాయి. మనోమయకోశము భువర్లోకముతో అనుసంధానించబడి ఉంటుంది; భావోద్వేగాలు మరియు ఆలోచనలను పోషించే మరో చక్కటి భాగం స్వర్గలోకంతో ముడిపడి ఉంటుంది. ('జ్ఞానేంద్రియై స్సహ మనః మనోమయ కోశః' అని మనోమయ కోశానికి నిర్వచనం. జ్ఞానేంద్రియాలు ఐదు, కర్మేంద్రియాలు ఐదు, పంచ ప్రాణాలు, మనస్సు, బుద్ధి కలసి పదిహేడు అంగాలతో కూడినది సూక్ష్మ శరీరాన్ని మనోమయ కోశమంటారు. ఇది కంటికి కనిపించదు. తాకితే స్పర్శ తగలదు )

వర్గీకరణ చేయబడిన వస్తువును బట్టి ఈ కోశాలకు రకరకాల పేర్లు ఉపయోగించబడతాయి, విద్యార్థి వీటిని చూసి గందరగోళానికి గురికావలసిన అవసరం లేదు. విద్యార్థి విజ్ఞాన మార్గంలో అభివృద్ధి చెందుతున్నప్పుడు, అతని పెరిగిన జ్ఞానం వీటిని బాగా అర్థం చేసుకోగలదు. మేము సాధారణంగా ఉపయోగించే మూడు కోశాల పేర్లు మాత్రమే గమనించి వివరించాము.

ఘనపదార్థాలు, ద్రవాలు మరియు వాయువులతో తయారు చేయబడిన అన్నమయకోశం వలె స్థూలశరీరము (లేదా ఘనాకృతి) ఉంటుంది. (మన ఇంద్రియాలకు ప్రత్యక్షంగా గోచరించే ఈ కరచరణాది అవయవాలతో కూడిన శరీరానికి స్థూల శరీరమని పేరు. ఇది బాహ్య ప్రపంచంతో జీవుడు వ్యవహరించటానికి ఏర్పడిన అధిష్ఠానం) సూక్ష్మశరీరము (లింగ శరీరం) ప్రాణమయ మనోమయకోశాలను కలిగి ఉంటుంది; (మనస్సు ప్రాణం కలిపితే సూక్ష్మశరీరము. మనస్సు, ప్రాణము అను రెండూ చలనాత్మకమైనా బాహ్యంగా మనకు మన ఇంద్రియాలకు ప్రత్యక్షమయ్యేవి కావు. పరోక్షమే. కనుకనే వీటికి సూక్ష్మశరీరమని పేరు వచ్చింది. లీనం గమయతి. గుప్తమైన ఆత్మతత్త్వాన్ని ఇవి ప్రకటన చేసి చూపుతాయి కాబట్టి లింగ శరీరమని కూడా సూక్ష్మశరీరానికి పేరు) వీటితో పాటు మరొక కోశము ఉన్నది. దానిపేరు విజ్ఞానమయకోశము. ఇది జీవుడిని మహర్లోకంతో కలుపుతుంది, త్రిలోకానికి మించిన ఈ మహ ర్లోకంలో (మరీచి మొదలైన మునులు ఉండే లోకం.) జీవుని యాత్ర కొనసాగుతుంది. ఇది నివాసయోగ్యం కాదు. బ్రహ్మ దినం ముగింపులోకూడా ఇది నాశనం చేయబడదు. సూక్ష్మశరీ రములోని భాగమయిన, జ్ఞాన కోశం సాపేక్షంగా శాశ్వతమైనది. జనన మరణాల పరంపరలో ఇది కొనసాగుతుంది.

ఈ పట్టిక రెండింటి (స్థూల, సూక్ష్మ శరీర) వర్గీకరణలను

మరియు లోకాలతో వాటికున్న సంబంధాన్ని స్పష్టం చేస్తుంది:


| **శరీరము** | **లోకము** | **కోశము** |
|---|---|---|
| స్థూల | భూర్లోక | అన్నమయ |
| సూక్ష్మ | భూర్లోక | ప్రాణమయ |
| సూక్ష్మ | భువర్లోక | మనోమయ |
| సూక్ష్మ | స్వర్గలోకం | మనోమయ |

ఇవి మరణ సమయంలో లేదా తరువాత నశిస్తాయి. మరియు తిరిగి పుట్టినప్పుడు పునరుద్ధరించబడతాయి.

సూక్ష్మ (కారణ) మహర్లోకము విజ్ఞానమయ

ఇది మరణించినప్పుడు లేదా తరువాత నశించదు. కాబట్టి పునర్జన్మలో పునరుద్ధరించబడదు.

స్థూలశరీరంలో కర్మేంద్రియాలు అని పిలువబడే చేతులు, పాదాలు మరియు వాక్కు, ఉత్పత్తి మరియు విసర్జనకు సంబంధించిన అవయవాలు ఉంటాయి; కానీ నిజమైన కర్మేంద్రియాలు, అవయవాలను నిర్దేశించే మరియు నియంత్రించే కేంద్రాలు సూక్ష్మశరీరములో ఉన్నాయి. అందువల్ల ఆనందం, దుఃఖం. లేదా ఏదైనా బలమైన భావోద్వేగం (చేతులు వణకడం, పాదాలు మెల్లగా కొట్టుకోవడం, చికాకులో ప్రసంగించి అడ్డుకోవడం మొదలైనవి.)సూక్ష్మశరీరములోని కేంద్రాలను ప్రభావితం చేస్తుంది.


SANĀTANA DHARMA
AN ELEMENTARY TEXT-BOOK
OF
HINDU RELIGION AND ETHICS
PUBLISHED BY THE BOARD OF TRUSTEES
CENTRAL HINDU COLLEGE
BENARES
1916
[THE RIGHT OF TRANSLATION AND REPRODUCTION IS RESERVED.]

జ్ఞానేంద్రియాలని పిలువబడే స్థూలశరీరంలో ఉన్న కళ్ళు, చెవులు, నాలుక, ముక్కు మరియు చర్మం అను అవయవాలకు సంబంధించిన కేంద్రాలు సూక్ష్మశరీరంలో కూడా ఉన్నాయి.

ఇప్పుడు మరణంలో ఏమి జరుగుతుందో చూద్దాం. మొదటగా, సూక్ష్మశరీరము స్థూలశరీరము నుండి వేరు చేయబడుతుంది. జీవుడు ప్రాణమయ కోశము నుండి వేరుచేయబడతాడు. సూక్ష్మశరీరము స్థూలశరీరాన్ని 'నిర్జీవమైన' పదార్థంగా వదిలి వేస్తుంది; అంటే, సూక్ష్మ, స్థూల శరీరాలను కలిపి ఉంచిన ప్రాణం ఉపసంహరించబడుతుంది. శరీర కణాలలో చైతన్యం పుష్కలంగా మిగిలి ఉంటుంది కాని మరణ సమయంలో అవి ఒకదానితో ఒకటి విడిపోవటం ప్రారంభిస్తాయి. వీటన్నింటిని కలిపి ఉంచి వీటిని పాలించే ప్రాణము ఉండదు.

మరణం తరువాత జీవుడు తన సూక్ష్మశరీరములో ఉంటాడు. అతి త్వరగా తన ప్రాణమయ కోశాన్ని వదులుతాడు. ఆపై మనోమయకోశం యొక్క దట్టమైన భాగాన్ని తన బయటి వస్త్రంగా కలిగి ఉంటాడు. అప్పుడు అతన్ని ప్రేత అని పిలుస్తారు. అతడు ఇప్పుడు ప్రేతలోక నివాసి. అతను భూమిపై చాలా మంచి వ్యక్తి అయితే, అతను ఈ ప్రేత స్థితిలో


తాడేపల్లి పతంజలి

ఉన్నప్పుడు సంతోషంగా కలలు కంటాడు; కానీ అతను చెడ్డ వ్యక్తి అయితే, అతను ప్రేతగా ఉన్నప్పుడు బాధపడతాడు. అతను ఇకపై పొందలేని భూలోక సంబంధమైన ఆనందాల కోసం ఆరాటపడతాడు.

ఈ భూలోక సంబంధమైన కోరికల బలాన్ని అనుసరించి, మనోమయ కోశంలోని దట్టమైన భాగం తననుంచి విడిపోవటానికి కావలసిన సమయం తీసుకొన్న తర్వాత (అది ఎక్కువ కావచ్చు, తక్కువ కావచ్చు) జీవుడు పితృదేవతగా మారి పితృలోకానికి వెళతాడు. అక్కడ స్వర్గానికి పనికిరాని అన్ని మూలపదార్థాల నుండి తన మనోమయ కోశాన్ని శుద్ధి చేయడానికి తగినంత సమయాన్ని జీవుడు తీసుకొంటాడు. తరువాత శుద్ధి చేయబడిన మనోమయకోశంతో జీవుడు స్వర్గానికి వెళ్లి, అక్కడ తాను నిల్వ చేసుకొన్న కర్మ ఫలాలను అనుభవిస్తాడు.

పుణ్య కర్మ ఫలాలు పూర్తయిన తరువాత, స్వర్గం నుంది జీవుడు భూమికి తిరిగి వచ్చే సమయం వస్తుంది. శుద్ధి చేయబడిన జీవుని మనోమయ కోశం కరిగిపోతుంది. తన జీవాన్ని విజ్ఞానమయకోశంలో వదిలివేస్తాడు. అతను త్వరగా నూతన జన్మ వాహనాలను పొండడానికి కావలసిన శక్తిని వినియోగిస్తాడు. అధోలోకాలకు తగిన (1. అతలము, 2. వితలము, 3. సుతలము, 4. తలాతలము, 5. రసాతలము, 6. మహాతలము, 7. పాతాళము) తన రాబోయే జీవితానికి తగిన విధంగా నూతన మనోమయకోశాన్ని సృష్టించు కొంటాడు. అతని కర్మ ప్రకారం, దేవతలు అతని కోసం ఒక ప్రాణమయకోశం మరియు అన్నమయ కోశం నిర్మిస్తారు. అతను మళ్లీ భూర్లోకంలో జన్మిస్తాడు.



ఇవి జీవుని యాత్రలో పునరావృత (తిరిగి వచ్చే) దశలు :

జీవితం, మరణం ఈ కనిపించే ప్రపంచంలో ఉంటాయి. అలాగే జీవితం, పునర్జన్మ అదృశ్య ప్రపంచాలలో ఉంటాయి. ఈ దశలు కాలానుగుణంగా, చేసుకొన్న కర్మ ఫలితాన్ని అనుసరించి మరలా మరలా పునరావృతమవుతుంటాయి. చివరకు, జీవుడు ఈ మూడు ప్రపంచాల (మానవ లోకం, పితృ లోకం, దేవ లోకం) గురించి విసిగిపోతాడు. ఉన్నతమైన, సూక్ష్మమైన అను భవాలు కలిగిన మరింత విస్తరించిన జీవితం కోసం ఆశపడ తాడు; క్రమంగా తనకు విస్తృతానుభవాలను అందించే ఈ ప్రపం చాల నుండి దూరంగా ఉంటాడు. ధ్యానంలో, ఆరాధనలో, బలహీనులకు కరుణతో సహాయం చేయడంలో ఆనందాన్ని పొందుతాడు; అతను క్రమంగా తన జన్మోపాధులను తనకు ఆనందాన్ని పొందేందుకు ఉపయోగించడు. ఇతరులకు సేవ చేయడానికి మాత్రమే ఉపయోగిస్తాడు. అలా ఉపయో గించినట్లయితే, బంధనాలు అతన్ని ఇకపై జన్మల చెరసాలలో పెట్టలేవు. అతడు ఉన్నత లోకాలలో నివసిస్తూ, అధో లోకాలలో తన మిగిలిన జన్మలను తన సాధన లుగా నడిపిస్తూ, ఈశ్వరునితో సహచరు నిగా ఉంటాడు. పరులసేవ కోసం తన జన్మలను నిలుపుకుం టాడు లేదా వాటిని వదిలివేసి బ్రహ్మములోకి ప్రవేశిస్తాడు.



**అథ త్రయో వావ లోకా మనుష్యలోకః పితృలోకో దేవలోక ఇతి॥1**

"ఇప్పుడు నిశ్చయంగా మూడు ప్రపంచాలు ఉన్నాయి. అవి మానవ లోకం, పితృ లోకం, దేవ లోకం"

**జాతస్య హి ధ్రువో మృత్యుః ధ్రువం జన్మ మృతస్య చ ।**
**తస్మాదపరిహార్యే-ర్థే న త్వం శోచితుమర్హసి ॥**
**అవ్యక్తాదీని భూతాని వ్యక్తమధ్యాని భారత ।**
**అవ్యక్తనిధనాన్యేవ తత్ర కా పరిదేవనా ॥ 2**

పుట్టిన వానికి మరణం తప్పదు, మరణించినవానికి మరల పుట్టుక తప్పదు. కాబట్టి ఈ అనివార్యమైన దాని కోసం నీవు శోకించ వద్దు.

ఓ భరత వంశీయుడా! సృష్టింపబడిన ప్రాణులన్నీ పుట్టుక ముందు అవ్యక్తములు, జీవిత కాలంలో వ్యక్తములు, మరల మరణించిన పిదప అవ్యక్తములు. కావున శోకించుట ఎందులకు?

(భౌతిక జగత్తులో ప్రతి యొక్క జీవాత్మ స్థూల శరీరం, సూక్ష్మ శరీరం, కారణ శరీరం అను మూడు శరీరాలచే కట్టుబడి ఉంటుంది - 1. స్థూల శరీరమనగా భూమి, నీరు, అగ్ని, గాలి, ఆకాశము అను పంచభూతములతో తయారు చేయబడినది. 2. సూక్ష్మ శరీరమనగా ఐదు ప్రాణవాయువులు, ఐదు కర్మేంద్రియ ములు, ఐదు జ్ఞానేంద్రియములు, మనస్సు, బుద్ధి, మరియు అహంకారం అను పద్దెనిమిది మూల-వస్తువులతో కూడినది 3. కారణ శరీరమనగా అంతులేని మునుపటి జీవితాల నుండి ఉన్న సంస్కారములతో కూడి ఉన్నది.


మరణ సమయంలో, ఆత్మ, తన స్థూల శరీరాన్ని విడిచి పెట్టి, తనతో పాటు సూక్ష్మ, కారణ శరీరములను తీసుకొని వెళు తుంది. భగవంతుడు మరల ఆత్మకి మరియొక స్థూల శరీరాన్ని, దాని సూక్ష్మ, కారణ శరీరాల అనుగుణంగా ఇచ్చి, దానికి తగిన తల్లి గర్భం లోనికి తిరిగి ప్రవేశపెడతాడు. ఆత్మ ఒక స్థూల శరీరాన్ని వదిలి వేసిన తరువాత, వేరే స్థూల శరీ రాన్ని గ్రహించే మధ్య కాలంలోని పరివర్తన దశ కొన్ని క్షణాల నుండి కొన్ని సంవత్స రాల వరకూ ఉండవచ్చు. కాబట్టి పుట్టుక ముందు, ఆత్మ అవ్యక్తమైన సూక్ష్మ, కారణ శరీరాలతో ఉంటుంది. మరణం తరువాత కూడా అది అవ్యక్త స్థితిలో ఉంటుంది. ఈ మధ్యలోనే అది వ్యక్తమవు తుంది (ప్రకటితమవుతుంది). కాబట్టి శోకించటానికి మరణం కారణం కారాదని ఈ శ్లోక భావం).

**సహస్రయుగపర్యంతమ్ అహర్యద్బ్రహ్మణో విదుః ।**
**రాత్రిం యుగసహస్రాంతాం తే-హోరాత్రవిదో జనాః ॥**

వేయి చతుర్యుగము (మహాయుగము)ల కాలము, బ్రహ్మ దేవునికి ఒక రోజు (కల్పము) అవుతుంది. మరియు ఆయన ఒక రాత్రి కూడా అంతే సమయం ఉంటుంది. దీనిని అర్థం చేసుకున్న వివేకవంతులు పగలు రాత్రి యొక్క యదార్థాన్ని అర్థం చేసుకుంటారు.

(వేదముల ప్రకారం, ఇంద్రుడు, వరుణుడు వంటి దేవతల ఒక పగలు ఒక రాత్రి కలిపి భూలోకంలో ఒక సంవత్సరం అవుతుంది. దేవతల యొక్క ఒక సంవత్సరం భూలోకంలో 360 సంవత్సరాలకు సమానం. దేవతల 12,000 సంవత్సరాలు, భూలోకంలో ఒక మహాయుగం (నాలుగు యుగాల చక్రం) అవుతుంది; అంటే 4,320,000 సంవత్సరాలు. ఇటువంటి 1000 మహా యుగములు బ్రహ్మ దేవుడికి ఒక పగలు. దీనినే కల్పము అంటారు, ఇది కాలాన్ని కొలవటానికి ప్రపంచంలో ఉన్న అతి పెద్ద ప్రమాణం. బ్రహ్మ యొక్క ఒక రాత్రి కూడా ఇంతే సమయం ఉంటుంది. బ్రహ్మ దేవుడు 100 సంవత్సరాలు బతుకుతాడు. భూలోక లెక్క ప్రకారం ఇది 311 ట్రిలియన్ 40 బిలియన్ సంవత్సరాలు).

(సశేషం)




(గత సంచిక తరువాయి)

పదాల అర్థ వివరణ:

- గుణగణాః: సత్పురుషులకు గురువైన ఆ శంకరాచార్యుల యొక్క గుణాల సమూహాలు.
- దిగ్జాలకూలంకషాః: దిక్కులనే గట్లను ఒరిపిడి చేసేవి (అనగా దిగంతాల వరకు వ్యాపించినవి అని అర్థం). వ్యాకరణ రీత్యా ఇక్కడ 'ఖచ్' ప్రత్యయం, 'ముమ్' ఆగమం వచ్చాయి.
- కాలోన్మీలితమాలతీ...: సమయానుకూలంగా వికసించిన మాలతీ (జాజి) పూల పరిమళం యొక్క గర్వాన్ని అణచివేసేవి. అనగా, ఈ గుణాల సువాసన వికసించిన పూల సువాసన కంటే కూడా మిన్నగా ఉండి, మనస్సుకు ఎంతో ఆనందాన్ని ఇస్తుందని భావం.

కవి వినయం:

- క్వాహం: అత్యంత అల్పుడనైన నేను ఎక్కడ? (వ్యాఖ్యానంలో 'హంత' అనేది ఇక్కడ ఖేదాన్ని లేదా ఆశ్చర్యాన్ని సూచిస్తుంది).
- తథాపి: అయినప్పటికీ, లోకప్రసిద్ధులైన ఆ శంకర సద్గురువుల కృప అనే అమృత ప్రవాహంలో మునిగి తేలే (మగ్నోన్మగ్న) వారి కటాక్ష వీక్షణాల వల్ల నాకు ఈ కావ్యాన్ని రచించే గొప్ప యోగ్యత కలిగింది.

సాహిత్య విశేషాలు (అలంకారాలు): ఇక్కడ పరస్పర విరుద్ధమైన అంశాల (అల్పుడైన కవికి, గొప్పదైన గుణవర్ణనకు) కలయికను వర్ణించడం వల్ల 'విషమ అలంకారం' ఉంది.

- అలాగే, తన అశక్తతను చెప్పుకుంటూనే గురుకృప వల్ల సాధ్యమైందని చెప్పడం ద్వారా 'ఆక్షేప అలంకారం' కూడా కనిపిస్తుంది.
- ఈ రెండు అలంకారాలు కలిసి ఉండటం వల్ల దీనిని 'సంకర అలంకారం' అని అంటారు.

ఛందస్సు: ఈ శ్లోకం 'శార్దూలవిక్రీడితము' అనే ఛందస్సులో వ్రాయబడింది.

దిగ్జాలకూలంకషాః (దిక్కులనే గట్లను ఒరిపిడి చేసేవి):

- అర్థం: 'దిక్' అంటే తూర్పు మొదలైన దిక్కుల సమూహం. ఈ గుణగణాలు నదీ ప్రవాహం తన గట్లను (కూలములను) ఎలాగైతే ఒరిపిడి చేస్తూ ప్రవహిస్తుందో, అలా దిగంతాల వరకు విస్తరించి ఉన్నాయి.
- విశేషం: దీని ద్వారా శంకరాచార్యుల గుణాల అనంతత్వం సూచించబడుతోంది. అవి ఎక్కడో ఒకచోట ఆగిపోయేవి కావు, దిక్కులనే హద్దులను కూడా దాటి వెళ్లేవి అని భావం.

కాలోన్మీలితమాలతీ... (సమయానికి వికసించిన మాలతీ పరిమళం):

- కాలం: వసంతం వంటి ఆయా ఋతువుల ప్రభావం చేత, సమయం వచ్చినపుడు వికసించే మాలతీ పూలు.
- మాలతీ: అమరకోశం ప్రకారం "సుమనా మాలతీ జాతిః" - అంటే మాలతీ లేదా జాజి పువ్వులు. ఇవి వసంత, గ్రీష్మ ఋతువులలో తమ సహజసిద్ధమైన పరిమళాన్ని వెదజల్లుతాయి.
- పరిమళం: అమరకోశం ("విమర్దోత్థే పరిమలో గంధే

జనమనోహరే") ప్రకారం.. వికసించిన పూల నుండి వచ్చే మనోహరమైన సువాసన అని అర్థం.

ముష్టింధయాః (ముష్టిని తాగే పసిబిడ్డల వంటివి):


◆ భావం: పసిపిల్లలు (స్తనధయులు) తమ గుప్పిటను నోట్లో పెట్టుకుని ఎలాగైతే పాలు తాగుతారో, ఈ శంకరాచార్యుల గుణాల సువాసన కూడా మాలతీ పూల పరిమళం యొక్క గర్వాన్ని ఆ విధంగా అణచివేసి/తాగేస్తోంది.

◆ అంటే, ఆ పూల సువాసన కంటే గురువుగారి గుణాల పరిమళమే అత్యంత గొప్పది మరియు శక్తివంతమైనది.

సద్గురుః (బ్రహ్మ నిష్ఠ కలిగిన గురువు):

◆ శ్రుతి ప్రమాణం: "బ్రహ్మవిద్ బ్రహ్మైవ భవతి" (బ్రహ్మను తెలిసినవాడు బ్రహ్మమే అవుతాడు) అనే వేద ప్రమాణం ప్రకారం.. ఇక్కడ 'సద్గురువు' అంటే సాక్షాత్తు పరబ్రహ్మ స్వరూపమైన శంకరాచార్యుల వారు అని అర్థం.

సారాంశం : ఈ వ్యాఖ్యానం శంకరాచార్యుల గుణాలను అనంతమైనవిగా, ప్రకృతి సిద్ధమైన సువాసనల కన్నా మిన్నయైనవిగా వర్ణిస్తోంది. గురువుగారిని కేవలం ఒక వ్యక్తిగా కాకుండా, సాక్షాత్తు పరబ్రహ్మగా భావించాలని ఈ టీక స్పష్టం చేస్తోంది.




**ధన్యంమన్య వివేకశూన్యసుజనం మన్యాబ్ధికన్యానటీ-**

**నృత్యోన్మత్తనరాధమాధమ కథాసంమర్ద దుష్కర్దమైః ।**

**దిగ్ధాం మే గిరమద్య శంకరగురుక్రీడా సముద్యద్యశః-**

**పారావారసముచ్చలజ్జలఝరైః సంక్షాలయామి స్ఫుటమ్ ॥ 7॥**

ఇందులో కవి తన వాక్కును (మాటను) ఎలా శుద్ధి చేసుకుంటున్నారోచెబుతూలోకంలోని అల్పులైన మనుషుల స్వభావము ఎలా ఉన్నదో చాలా చక్కగా వివరించారు.

తాత్పర్యం : ఇంతకాలం నేను లోకంలో ఉన్న అల్పమైన మనుషులను స్తుతించాను. అసలు దాతృత్వమే లేనివారిని గొప్ప దాతలని పొగిడాను. తమను తాము గొప్పగా భావించుకునే అహంకారులను, చంచలమైన లక్ష్మీకటాక్షం (డబ్బు) ఉందన్న గర్వంతో ఉన్నవారిని కీర్తించాను. ఆ అబద్ధపు పొగడ్తల వల్ల నా నాలుక అపవిత్రమై, బురదలో కూరుకుపోయినట్లు ఉంది."శ్రీ శంకరాచార్యుల వారి దివ్య లీలా విశేషాలు ఒక మహాసముద్రం వంటివి. ఆ పవిత్రమైన గాథలను గానం చేయడం ద్వారా, నా నాలుకకు అంటుకున్న ఆ అపవిత్రతను కడిగి వేసుకోవాలనుకుంటున్నాను."

వ్యాఖ్య :

1. లోకంలోని మనుషుల స్వభావం (దుర్జన వర్ణన):

◆ ధన్యమ్మన్య: ఏమీ సాధించకపోయినా, తనను తాను చాలా గొప్పవాడినని (ధన్యుడినని) భావించుకునేవాడు.

◆ సుజనమ్మన్య: వివేకం శూన్యమైనా, దుర్జనుడైనా సరే.. తనను తాను 'సజ్జనుడు' అని లోకానికి చెప్పుకునేవాడు.

◆ అబ్ధికన్యానటీ: సముద్ర పుత్రిక అయిన లక్ష్మీదేవి (సంపద). సంపద అనేది ఒక నర్తకి (నటి) వంటిది, ఎందుకంటే అది ఒకచోట స్థిరంగా ఉండదు, చంచలమైనది.

◆ నృత్యోన్మత్త: అశాశ్వతమైన ఆ సంపద అనే నర్తకి ఆటలు చూసి, మదంతో ఉన్మత్తులైన నరాధములను ఇక్కడ వర్ణించారు.

2. వాక్కుకు అంటిన మాలిన్యం:

◆ దుష్కర్దమైః: అటువంటి నరాధముల యొక్క నీచమైన కథలను వినడం వల్ల లేదా వర్ణించడం వల్ల కవి వాక్కుకు 'పాప పంకిలం' (దుష్టమైన బురద) అంటుకుంది. దీన్నే వ్యాఖ్యాత 'దుష్కర్దమ' అని పిలిచారు.

3. వాక్కును శుద్ధి చేసే విధానం:

◆ శంకరగురు క్రీడా సముద్యద్యశః: శంకర సద్గురువుల దివ్య లీలా విశేషాలు మరియు వారి కీర్తి అనేవి ఒకపారావారము (మహాసముద్రం) వంటివి.

◆ సంక్షాలయామి: ఆ కీర్తి సముద్రం నుండి ఉప్పొంగే స్వచ్ఛమైన జలధారలతో, బురద అంటిన నా వాక్కును ఇప్పుడు స్పష్టంగా కడిగి శుభ్రం చేసుకుంటున్నాను అని విద్యారణ్య స్వామివారిభావం.

4. వేదవ్యాసుల ప్రమాణం: ఈ సందర్భంలో వ్యాఖ్యాత భగవాన్ వేదవ్యాసుల మాటలను ఉదహరించారు:"శ్రీహరి కథలనే గంగానదిలో మునగడం ద్వారానే మన వాక్కు పవిత్రమవుతుంది."అదే విధంగా ఇక్కడ శంకరాచార్యుల చరిత్ర ద్వారా వాక్కు పవిత్రమవుతుందని అర్థం.( అసత్కీర్తన కాంతరపరివర్తన శంసులామ్ । వాచా శౌరికథాలాపైర్గఙ్గయేవ పునీమహే)

5. అలంకార విశేషం: ఇందులో 'సంసృష్టి అలంకారం' ఉంది. అంటే.. ఇక్కడ రూపక అలంకారం, ఇతర అలంకారాలు ఒకదానితో ఒకటి కలవకుండా, బియ్యం మరియు నువ్వులు కలిసినట్లుగా (తిలతండుల న్యాయం) స్పష్టంగా విడివిడిగా కనిపిస్తూనే కలిసి ఉన్నాయి. (సశేషం)



# దర్శనమ్

ఆధ్యాత్మిక వార్తామాసపత్రిక

## దర్శనమ్ శ్రేయోభిలాషులకు నమస్కారం... సవినయ విన్నపం

సనాతన ధర్మ పరిరక్షణే లక్ష్యంగా 21 సంవత్సరాలుగా 'దర్శనమ్' ఆధ్యాత్మిక వార్తామాసపత్రిక ధర్మనిష్ఠతో కృషిచేస్తోంది.. చతురామ్నాయ పీఠాల జగద్గురువులు సహా ధర్మాచార్యులకు, పీఠాధీశ్వరులకు గురువందనమ్, ధార్మికవేత్తలు, మహాత్ములకు గురుసత్కారం కార్యక్రమాలను సభక్తికంగా నిర్వహిస్తోంది. వేద, శ్రౌత, శాస్త్ర, ఆర్ష ధర్మాన్ని పునరుజ్జీవింపజేసే ఎన్నో ధార్మిక కార్యక్రమాలను చిత్తశుద్ధితో నిర్వహిస్తోంది. సంస్కృత, తెలుగు భాషా వికాస కార్యక్రమాలను, అవధానాలను విరివిగా నిర్వహిస్తోంది. జీర్ణదేవాలయాల పునరుద్ధరణ, గోసంరక్షణ, లోక కళ్యాణం కోసం ఎన్నో యాగాలు, ధార్మిక కార్యక్రమాలను తరచూ నిర్వహిస్తోంది. దర్శనమ్ పత్రిక ప్రతి నెల 25వ తేదీన మార్కెట్లోకి, 1వ తేదీన పాఠకుల ముంగిట్లోకి అందేలా క్రమశిక్షణ, సమయపాలన, నిబద్ధతతో కృషిచేస్తోంది. ఒక సామాన్యుడి ధార్మికోద్యమ అక్షరాయుధం 'దర్శనమ్' ఆర్షధర్మ పరిరక్షణ, సంస్కార సమాజం కోసం అహరహం ధర్మనిష్ఠతో పనిచేస్తోంది. ఈ ధార్మికోద్యమానికి మీరు అనేక సందర్భాల్లో అందించిన చేయూత.. వదాన్యత అమోఘం.. మీ సహకారం నాలో ఆత్మస్థైర్యాన్ని మరింత పెంచుతోంది. ప్రస్తుతం ఎన్నో క్లిష్టపరిస్థితులను, అవరోధాలను అధిగమించి ముందుకు సాగుతూ 22వ వసంతంలోకి పత్రిక అడుగిడింది. ఈ ధార్మికోద్యమ పత్రిక ఎల్లకాలం ముందుకు సాగాలని, తెలుగునాట పాఠకదేవుళ్లకు ఆత్మీయ నేస్తంగా ధర్మప్రబోధం అందించాలని నా ఆకాంక్ష... ఇందుకోసం పత్రిక మూలనిధి(ధర్మనిధి)ని ఏర్పాటు చేయాలని నిశ్చయించాను. మీరు మీకు తోచినంత ఈ మూలనిధికి భాగస్వామ్యం అందించి సాయపడాలని, ఈ ధార్మికోద్యమంలో భాగస్వాములు కావాలని మనఃస్ఫూర్తిగా ప్రార్థిస్తున్నాను.

**- మరుమాముల వెంకటరమణ శర్మ**

## 'దర్శనమ్' చందా వివరములు

| | | |
|---|---|---|
| మూడు సంవత్సరాలకు | రూ. | 2000 |
| ఆరు సంవత్సరాలకు | రూ. | 4000 |
| జీవిత చందా (12 సం॥లు) | రూ. | 8000 |
| రాజపోషకులు | రూ. | 15000 |
| మహారాజ పోషకులు | రూ. | 25000 |
| విశిష్ట మహారాజ పోషకులు | రూ. | 100000 |


**విదేశీయులకు...**


| | | |
|---|---|---|
| మూడు సంవత్సరాలకు | రూ. | 12000 |
| ఆరు సంవత్సరాలకు | రూ. | 24000 |
| జీవిత చందా (12 సం॥లు) | రూ. | 48000 |
| విశిష్ట చందాదారులు | రూ. | 60000 |
| రాజపోషకులు | రూ. | 80000 |
| మహారాజ పోషకులు | రూ. | 100000 |

BHIM UPI
Scan using any BHIM UPI enabled APP
DARSHANAM
917013093123@cnrb
Canara Bank

**దర్శనమ్** ఆధ్యాత్మిక వార్తా మాసపత్రిక
ఇ.నెం. 29-105/4/1, శ్రీరామ సిద్ధాంతి భవనం,
న్యూ విద్యానగర్ కాలనీ, నేరేడ్‌మెట్, సికింద్రాబాద్ - 500 056.
సెల్ : 94410 15469
darshanameditordesk@gmail.com

A/C NAME : DARSHANAM
BANK: CANARA BANK
ACCOUNT NO : 120001974779
IFSC CODE : CNRB0013063
MICR : 500015150
BRANCH CODE : 13063
SWIFT CODE: CNRBINBBBFD


శ్రీరస్తు
శుభమస్తు
అవిఘ్నమస్తు
పరమహంస పరివ్రాజకాచార్యవర్య
శ్రీ శంకరాచార్య పరంపరాగత మూలామ్నాయ సర్వజ్ఞ శ్రీకంచికామకోటి పీఠాధీశ్వరులు
శ్రీశ్రీశ్రీ శంకర విజయేంద్ర సరస్వతీ స్వామి వారి
దివ్యానుగ్రహముతో...
శ్రీ మహాభారతంలో శ్రీకృష్ణ గాథ
నవాహ్నిక జ్ఞానయజ్ఞ మహోత్సవము
తేది : 24-10-2026 నుండి 01-11-2026 వరకు
స్థలం : గీతాజ్ఞాన సంస్థాన్, కె.డి.బి. రోడ్, కురుక్షేత్రం
ప్రవచన కర్త :
విద్యావాచస్పతి, ధార్మిక వరేణ్య
ఆర్షధర్మ విద్వన్మణి, వాగ్దేవి వరపుత్ర
బ్రహ్మశ్రీ సామవేదం షణ్ముఖ శర్మ గారు
కీ॥శే॥ బ్రహ్మశ్రీ గుంటూరు వాసుదేవ మూర్తి గారు
కీ॥శే॥ శ్రీ జి.వి.ఆర్.జి. మూర్తి - సుబ్బమ్మ
వేదపండితులు :
స్వాధ్యాయరత్న, వేదనిధి, ఘనరత్న,
వేదభాష్యరక్షామణి, భారతాత్మ పురస్కార గ్రహీత
బ్రహ్మశ్రీ వేదమూర్తులు విష్ణుభట్ల లక్ష్మీనారాయణ ఘనపాఠీ గారు
(టీ.టీ.డి. ఈ.సి. మెంబర్)
పారాయణము :
బ్రహ్మశ్రీ సామవేదం సత్యనారాయణ శాస్త్రి గారు
డా॥ ఇనుగంటి ఉమారామారావు గారు,
Sanskrit M.A. PhD.
కార్యక్రమ వివరములు
ది. 24-10-2026న ఉ॥ అంకురారోపణ ప్రవచనం ప్రారంభం
ది. 02-11-2026న పూర్ణాహుతి అవబృథ స్నానం
ప్రతిరోజు ఉ॥ 10:00 గం॥ల నుండి మ॥ 12:00 గం॥ల వరకు
సా॥ 4:00 గం॥ల నుండి రా॥ 6 గం॥ల వరకు
శ్రీమహాభారతంలో శ్రీకృష్ణ గాథలు ప్రవచనము జరుగును
ప్రతిరోజు ఈ కార్యక్రమమునకు అంగముగా
వేదపారాయణ మొదలగు కార్యక్రమములు జరుగును.




# మహాభారతసారసంగ్రహము

154



కీ.శే. ఆచార్య పుల్లెల శ్రీరామచంద్రుడు

(గత సంచిక తరువాయి)

అప్పుడు విష్ణువు కోపించి - "ఇలా నీ అభిప్రాయం' అంటూ తన కుడి చెయ్యి వాని వీపు మీద పడవేశాడు. దానితో వైన తేయుడు నేలమీద పడి నలిగిపోయాడు. క్షమించమని కోరగా విష్ణువు క్షమించాడు. దీని కంతకీ ఈ నారదుడే ప్రత్యక్ష సాక్షి, సుయోధనా! ఆ వీరులు వచ్చి మీద పడనంతవరకు మహాబల వంతుడనని విర్రవీగుతున్నావు. భీమార్జునులను ఎవరెదిరించ గలరు? అందుచేత యుద్ధ ప్రయత్నం నుండి విరమించు."

కణ్వమహర్షి మాటలు విన్న దుర్యోధనుడు కర్ణుని కేసి చూచి, బిగ్గరగా నవ్వి, తొడచరుస్తూ - "మహర్షీ! ఈశ్వరుడు నన్నెలా సృష్టించాడో, ఏది జరుగనున్నదో, ఏది నా గతియో అదే విధంగా ప్రవర్తిస్తాను. ఈ ప్రలాపా లన్నీ ఎందుకు?"

**యథైవేశ్వరసృష్టోస్మి యద్ భావి యా చ మే గతిః**
**తథా మహర్షే వర్తామి కిం ప్రలాపః కరిష్యతి.**

(ఉద్యోగపర్వం 105.40)

అన్నాడు.

నారదుడు నిర్బంధం మంచిది కాదని దుర్యోధనునికి ఉపదేశిస్తూ గాలవుని కథ చెప్పాడు.

"విశ్వామిత్రుడు తీవ్రమైన తపస్సు చేస్తుండగా ధర్మదేవుడు (ధర్మదేవత) అతనిని పరీక్షించడానికై సప్తర్షులలో ఒక డైన వసిష్ఠుని రూపంలో వెళ్లి - "నేను ఆకలితో బాధపడుతున్నాను, ఆహారం ఏదైనా పెట్టు" అని విశ్వామిత్రుణ్ణి కోరాడు.

విశ్వామిత్రుడు ఆతని నిమిత్తం ఉత్తమమైన అన్నం సిద్ధం చేసి వేడి వేడిగా ఉన్న ఆ పరమాన్నం పాత్రలో ఉంచి అది తన శిరస్సుపై పెట్టుకొని ఆతనిని వెదుకుతూ వచ్చాడు. ఇంతలో ధర్మదేవత ఇతరులిచ్చిన ఆహారం భుజించాడు. "నేను మళ్లీ వచ్చి భుజిస్తాను" అని విశ్వామిత్రునితో చెప్పి వెళ్లిపోయాడు.

విశ్వామిత్రుడు తలమీద ఆ పాత్రను ధరించి కదలకుండా కట్టెవలె అలా నిలిచి నిరీక్షిస్తున్నాడు. నూరు సంవత్సరాల తరువాత ఆ ధర్మదేవత మళ్లీ వచ్చి వేడిగాను, మధురంగాను ఉన్న ఆ పాత్రలోని పాయసం భుజించి విశ్వామిత్రుని తపః శ్రద్ధలకు అతనిని ప్రశంసించి, ఆతనికి బ్రాహ్మణత్వం ప్రసాదించి వెళ్లిపోయాడు.

విశ్వామిత్రుడు ఆ విధంగా పాయసపాత్ర తలమీద పెట్టుకొని నిలబడి ఉన్నంత కాలము గాలవు డను ఆతని శిష్యుడు అన్ని విధాల ఆయనకు శుశ్రూష చేశాడు. విశ్వామిత్రుడు సంతోషించి "నీకు ఇష్టం వచ్చిన చోటికి వెళ్లు" అని ఆతనికి అనుజ్ఞ ఇచ్చాడు.

"గురుదక్షిణ ఇచ్చి కాని వెళ్లకూడదు కదా? ఏమి గురుదక్షిణగా ఇవ్వవలెనో ఆజ్ఞాపించుము'' అని గాలవుడు గురువును ప్రార్థించాడు. ఏమీ ఇవ్వ నవసరం లేదు అని గురువెంత చెప్పినా వినక అతడు నిర్బంధించాడు. అందుకు విశ్వామిత్రుడు విసిగికొని - "ఒక నల్లని చెవులున్న చంద్రకాంతి వంటి కాంతి గల ఎనిమిది వందల అశ్వాలను గురుదక్షిణగా తీసికొని వచ్చి ఇమ్ము'' అన్నాడు.

గాలవుడు వెళ్లి అలాంటి అశ్వాల కోసం ఎంతమంది మహారాజులను అభ్యర్థించినా అవి లభించలేదు. చాలా కాలానికి చివరికతడు ఏదో విధంగా గురుదక్షిణ ముట్టజెప్పాడు.

ఈవిధంగా నిర్బంధం చేయడం చేత గాలవుడు అన్ని కష్టాలు పడవలసి వచ్చింది. నిర్బంధం (మొండి పట్టుదల) మంచిది కాదు.''

నారదుని మాటలు విని ధృతరాష్ట్రుడు - "పూజ్యుడా! నా అభిప్రాయం కూడ ఇదే. అయినా నా చేతిలో ఏమీ లేదు'' అని నారదునితో అని కృష్ణునితో ఇలా అన్నాడు. "కేశవా! నీవు చెప్పిన మాట లన్నీ ధర్మసంమతమైనవి, న్యాయమైనవి, అయితే ఈ దుర్యోధనుడు ఎంత చెప్పినా వినడం లేదు. నువ్వే వీనికి ఉపదేశించు.''

అప్పుడు కృష్ణుడు అతిమధురములైన మాటలతో దుర్యోధనునికి అనేక విధాల బోధించాడు. "మేం చెప్పిన మాట వినక పోతే పశ్చాత్తాపం చెందవలసి వస్తుంది. ఈ కురువంశ నాశానికి నీవు కారణ మయ్యావనే అపకీర్తి తెచ్చుకొనకు. పాండవులతో సంధి చేసికొని వాళ్లతో మైత్రీభావంతో ఉండు. వాళ్లు నీ తండ్రిని మహారాజును చేసి నిన్ను యువరాజును చేస్తారు.''

**త్వామేవ స్థాపయిష్యన్తి యౌవరాజ్యే మహారథాః**
**మహారాజ్యేపి పితరం ధృతరాష్ట్రం జనేశ్వరమ్**

(ఉద్యోగపర్వం 124.60)

వస్తూన్న లక్ష్మిని అవమానించకు'' అన్నాడు.

భీష్మద్రోణులు కూడ అనేక విధాల బోధించారు. విదురుడు మాట్లాడుతూ దుర్యోధనా! నాకు నిన్ను గూర్చి ఏమీ విచారం లేదు. ముసలివాళ్లైన నీ తల్లిదండ్రులను గూర్చి మాత్రమే నా విచారం అంతా. కులవినాశనానికి కారణభూతుడవైన నీ వంటి కుపుత్రుణ్ణి కన్నందుకు ఫలితంగా వీళ్లు అందరూ నశించగా, సర్వస్వమూ కోల్పోయి, రెక్కలు తెగిన పక్షుల వలె, భిక్షుకుల



వలె తిరగవలసి వస్తుంది కదా నేది నాకు విచారం.

**దుర్యోధన న శోచామి త్వామహం భరతర్షభ,**
**ఇమౌ తు వృద్ధౌ శోచామి గాన్ధారీం పితరం చ తే.**
**యావనాథౌ చరిష్యేతే త్వయా నాథేన దుర్హృదా**
**హతమిత్రౌ హతామాత్యౌ లూనపక్షావివాణ్డజౌ.**
**భిక్షుకౌ విచరిష్యేతే శోచన్తౌ పృథివీమిమామ్,**
**కులఘ్నమీదృశం పాపం జనయిత్వా కుపూరుషమ్.**

(ఉద్యోగపర్వం 125.19-21)

అని పరుషమైన మాటలతో నిందించాడు.

దుర్యోధనుడు కృష్ణునికి సమాధానం చెపుతూ - "కృష్ణా! నువ్వు పాండవులను పల్లెత్తు మాటైనా అనకుండా కేవలం నన్ను మాత్రమే ఎందుకు తప్పు పడుతున్నావో నాకు అర్థం అవడం లేదు. భీష్మ-ద్రోణ-విదురులు నా తండ్రీ కూడ నన్నే దూషిస్తున్నారు.

నేను ఎంత ఆలోచించినా నేను చేసిన అపరాధం కొంచెం కూడ కనబడడం లేదు. అందరూ అంగీకరించి ఆడిన మైత్రీపూర్వకమైన ద్యూతంలో శకునికి పాండవులు రాజ్యం పణం పెట్టి ఓడితే దానిలో తప్పేముంది?

వాళ్లేదో ధనం తీసికొని వెళ్లి అది అనుభవిస్తూనే ఉన్నారు. దానికి మే మేమీ అడ్డు చెప్పలేదు కదా? వాళ్లు ఏదో అపరాధం కెలికి యుద్ధానికి సిద్ధం అవుతూంటారు. మేం ఏమి తప్పు చేశామని మాతో యుద్ధానికి వస్తున్నారు వాళ్లు?మేం భయపడి దేవేంద్రునికి కూడ వంగి నమస్కరించేవాళ్లం కాము. యుద్ధంలో మరణిస్తే అది స్వర్గహేతువే అవుతుంది. యుద్ధంలో శరతల్పం మీద మరణించడానికి సిద్ధంగా ఉన్నాం.

పూర్వం మా తండ్రి వాళ్లకి కొంత రాజ్య భాగం ఏదో పొరబాటున ఇచ్చాడు. నేను చిన్నవాడనై ఉండగా జరిగిన పని అది. నేను బ్రతికి ఉండగా వాళ్లు ఆ రాజ్యభాగం మళ్లీ పొందే ప్రశ్నయే లేదు. సూది మొన మోపినంత నేల కూడా పాండవులకు ఇవ్వం.'' అని నిష్కర్షగా అన్నాడు. (సశేషం)



# మహాతపస్వి చంద్రశేఖర భారతి దివ్యచరితామృతం

(గత సంచిక తరువాయి)

గురువర్యులన్న మాటలు విని శాస్త్రిగారు పులకితు లయిరి. గురువర్యులకు తమయందున్న ప్రీతి వాత్సల్యముల ననుభవించి భక్తి సంతోషములతో మైమరపు నందినారు. కనుల నుంచి ఆనందబాష్పములు గురువుల కొసంగు నర్ఘ్యపాద్యము లన్నట్లు స్రవించినవి. 'ధన్యోస్మి ధన్యోస్మి' యనుచు గురువులకు సాష్టాంగ మెరగి ఇంటికి తిరిగి వచ్చినారు.

ఇక్కడ నింటిలో కౌతుకముతో కాచుకొనియున్న లక్ష్మమ్మ హర్షచిత్తులై యింటికి వచ్చిన శాస్త్రిగారిని చూచి ఉల్లాసము నందినది. శ్రీ గురువర్యుల యాజ్ఞను విని ఆనందించినది. ఇక చెప్పవలెనా? ఆమె ఉత్సాహమున కవధి లేకపోయెను. ప్రయాణమున కవసరములయిన సన్నాహము లన్నియు తొందర తొందరగా చేయసాగినది. ఆమెకు మొదటి నుండియు బెంగుళూరులో నివసింపవలెనని యున్నది. ఇప్పుడా యవకాశము దానియంతట నదియే వచ్చినది. అన్ని సన్నాహములు చేసి బంధు బలగము నుండియు మిత్రవర్గము నుండియు నగరవాసమునకు సంబంధించిన విషయముల నన్నింటినీ గ్రహించినది. క్షణక్షణమునకు శ్రీ గురువర్యులు తమ కుమారుని అభ్యుదయము విషయమున చూపుచున్న అభిమానాసక్తులను తలచుకొనుచు ఆ దంపతులు త్రికరణశు ద్ధిగా తమ ధన్యతను వ్యక్తపరచుచుండిరి.

ఒకానొక శుభదినమున శాస్త్రాభ్యాసము నిమిత్తమై శ్రీ జగన్మాత శారదాదేవి యనుగ్రహమున శ్రీ గురువర్యుల అమోఘాశీస్సులను శిరస్సున ధరించి నరసింహ శాస్త్రిగారు తమ తల్లిదండ్రుల తోడనే బెంగుళూరునకు ప్రయాణమయినారు.

**10**

బెంగుళూరు నగరజీవనమున కలవాటు పడుట శాస్త్రిగారికి కష్టమయినది. నిత్యపరిచితమై సస్యశ్యామల శోభితమై ప్రాచీన సంస్కృతి కాకరమైన ఆ శృంగేరి యెక్కడ? ఆధునిక వాతావర ణములో యంత్రనాగరికతామయమైన బెంగుళూరెక్కడ? శ్రీ శారదా శ్రీ జగద్గురువుల నిత్యసాన్నిధ్యమువలన శాంతి, తృప్తి, సమాధానములను సమకూర్చు చుండు పుణ్యక్షేత్రము శృంగేరి యెక్కడ? చూచినచోట్ల నెల్ల గజిబిజి, జన సమర్దము, ఎంతకు నణగని గందరగోళముతో నిండియున్న నగరము బెంగుళూ రెక్కడ? ఎల్లప్పుడు పొంగి పొరలుచు ప్రవహించు పావన తుంగా నది సమృద్ధి యెక్కడ? బొట్టు నీటికి పంపువద్ద చేయి పట్టవల సిన బెంగుళూరెక్కడ? నిత్యజీవితము నందలి జంజాటముల నన్నిటిని ధైర్యముతో నెదుర్కొను నిబ్బరము కలిగించి మన స్సును సమాధాన శాంతి స్థితికి తీసుకొనిపోగలదు శృంగేరి. మరి బెంగుళూరన్నచో ఉన్నదానికి తోడు మనస్సు నింకను హెచ్చిన గడబిడ, చింత, ఉద్వేగము. పరిపరివిధముల యోచనలు మున్నగు వానితో ప్రక్షుబ్ధ మొనరించును. ఎంతటి కష్టముల నైనను, మరెంతటి శత్రువు నైనను కోటలో నిలకడగా నుండి ఎదిరింపవచ్చును. కాని కోటను విడిచి వెలుపలికి వచ్చిన తరువాత ఎంత రక్షక దళమున్నను చాలదు గదా! ప్రాచ్య నాగరికతకు ప్రతీకగా నున్న శృంగేరి నుంచి పాశ్చాత్య నాగరికతతో పెళపెళలాడుచున్న బెంగుళూరికి వచ్చిన తరువాత శాస్త్రిగారికి దిక్కులేనిచోట నున్నట్లే అయినది.

ఎటువంటి చోట నైనను అలవాటు కాకుండ నుండుట చాలాకాలము సాగదు కదా! శాస్త్రిగారి మనస్సు క్రమేణ బెంగుళూరు పరిస్థితుల కలవాటు కాజొచ్చెను. అక్కడ గూడ వారి కాప్తమిత్రులు లభించిరి. ఉన్నచోటనే తమ కానుకూల్యములను కల్పించుకొనుచు బెంగుళూరునందే యున్న శంకరమఠము మున్నగు తావులలో తమ కాలమును గడపుచుండిరి. లక్ష్మమ్మకు గూడ అక్కడి వాటావరణ మలవాటగుటకు కొంత కాలము పట్టినది. ఆమెకు తన నృసింహుడే సర్వస్వ మయినందున ఇతర యోచన లేమియు రానేలేదు. కుమారుని లాలనపాలన యందే ఆమె మునిగియున్నది. వాని విద్యాభ్యాసము, వాని యోగక్షేమము ఇవియే అమెకు సర్వస్వము.

శృంగేరిలో జరుగుచుండినట్లే, ఇక్కడ గూడ నృసింహుడు బజారునకు బయలుదేరి మూక పంచశతి చదువుకొనుచునో, ఆనంద సాగరస్తవమును పారాయణ చేసికొనుచునో చాల దూరము నడచుకొని వెళ్లిపోవుచుండెడివాడు. ఇట్లు మైమరచి సాగునప్పుడు బస్సులకు బండ్లకు నడ్డముపోవు సందర్భము లధికమగుచున్నందున లక్ష్మమ్మ కుమారుని బజారునకు పంపుటయే మానుకొనినది. కుమారుని యోగక్షేమములే ఆమెకు సర్వస్వమయి యుండెను.




నృసింహునకు కొంతకాలము తండ్రిగారి అనుభవమే అయ్యెను. ఎల్లప్పుడు జన సమ్మర్దము నుండి దూరముగాపోయి విహరించుచుండు నాతనికి ఇక్కడ జనసమ్మర్దము నడుమనే ఉండవలసిన అవసరమేర్పడినది. తనకు నిత్యపరిచయమై యున్న శ్రీ శారదా సాన్నిధ్య శ్రీ గురుసాన్నిధ్యములు, దేవస్థానములు, విపినమునందలి ఏకాంత స్థలములు మున్నగునవి బెంగుళూరు నగరములో నెక్కడ లభించును? అయినను నరసింహుడు నగరజీవనమునందలి అసౌకర్యముల నన్నింటిని నివారించుకొని తన విద్యాభ్యాసమునందే నిమగ్ను డయ్యెను. బెంగుళూరంతటి ఆధునిక వాతావరణముతోడి నగరమున నుండియు నాగరికతా ప్రలోభనములకు వశము కాకుండ తన లక్ష్యమున కభిముఖముగనే నడచెను. సదాచార సంపన్నులు, శాస్త్ర పారంగతులు నయిన ఉపాధ్యాయుల నేతృత్వములో నృసింహుడు తన వ్యాసంగము నహర్నిశలు సాగించెను. జ్ఞానపిపాసను తనియజేయుట యందే నిమగ్నుడయ్యెను.

పాఠశాలకు ప్రక్కనే ఇల్లు. ఇంటి నుండి పాఠశాల, పాఠశాలలో అధ్యయనమైన తరువాత ఆ ఆవరణయందే యున్న ఏదో యొక్క చెట్టునీడ. ఇవియే నరసింహుని వ్యాసంగ స్థలములు. ఇంటియందు చదువు, పాఠశాలలో చదువు. ఎక్కడకు పోయినను అధ్యయన విషయమున గురించియే ఆలోచన. శృంగేరిలో నున్నట్లుగనే ఇక్కడగూడ నతనికి మిత్రులుండిరి. వారుగూడ తమ సందేహములను నృసింహునితో చర్చించి వానిని పరిహరించుకొందురు ఇక్కడగూడ నరసింహుడు జ్ఞానబోధకులైన ఉపాధ్యాయులకు తన సతీర్థ్యులకు ప్రశంసాపాత్రుడయ్యెను. మహామహోపాధ్యాయ వైద్యనాథ శాస్త్రిగారు పూర్వమీమాంసా శాస్త్రము నకును, మహామహోపాధ్యాయ వెల్లూరు సుబ్రహ్మణ్యశాస్త్రిగారు ఉత్తర మీమాంసా శాస్త్రమునకును ప్రాధ్యాపకులై యుండిరి. వారిద్దరూ శ్రీ సచ్చిదానంద శివాభినవ నృసింహ భారతీ స్వామివారి వద్ద వేదాంతాధ్యయన మొనర్చినారు. వీరి నేతృత్వములో నరసింహ శాస్త్రి అధ్యయనము సక్రమముగా సాగెను. తరగతిలో నందరికంటె చిన్నవాడైన ఈ విద్యార్థి ప్రగతి నధికముగా సాగించుచు వచ్చెను. అత్యంత వేగమున కఠినమైన పాఠములను గూడ నేర్చుకొనుచున్న అతని మేధాశక్తి ఉపాధ్యాయులకే ఆశ్చర్యము కలిగించుచుండెడిది. పాఠప్రవచనములకు నియమితమైన కాలముకంటె నెంతో ముందుగనే ముగించి పూర్వ మీమాంసా శాస్త్రమును నరసింహశాస్త్రి చాలా వేగమున హృద్గత మొనర్చికొనెను. ఈ విద్యార్థి అభ్యున్నతి విషయములో శ్రీ వైద్యనాథశాస్త్రిగారి అభిమానమునకు అవధులే లేవు. అతని మేధాశక్తి మనసా మెచ్చుకొనుచుండిరి. తరువాత శ్రీ నరసింహ శాస్త్రిగారు దక్షిణామ్నాయ పీఠమునకు నియుక్తులైరన్నప్పుడు వారు పొందిన ఆనంద మంతయు నింతయు కాదు. ఆ పీఠము నధిరోహించుటకు శ్రీ నరసింహశాస్త్రిగారే మిక్కిలి యెగ్యు లనియు, వారి తపశ్శక్తిచే ఆ పీఠము కీర్తి గౌరవములు అతిశయించుననియు ఆత్మీయతతో ననుచుండెడివారు. విద్యాగురువుల ఆశీర్వాదము, జగద్గురువుల అనుగ్రహము లభించినట్లుగనే శ్రీ శారదాదేవియు నరసింహశాస్త్రిగారిని కటాక్షించినది. “సర్వజ్ఞం శ్రీ నరసింహ కురు శివదయితే” యని శ్రీ జగద్గురువులు జగదంబికను ప్రార్థించియుండుట వ్యర్థమగునా?

శ్రీ గురువర్యుల కప్పుడప్పుడు నరసింహశాస్త్రి యోగక్షేమ విద్యాప్రగతులను గూర్చి వార్తలందుచుండెడివి. శ్రీ గురువర్యులు తమ శిష్యుని అభ్యుదయము నాలకించి తృప్తి సమాధానములను పొందుచుండెడివారు. సంతోషమును వ్యక్తమొనర్చుచుండెడివారు. (సశేషం)




# తిరుమల చరితామృతం

149

(గత సంచిక తరువాయి)

వారి స్థానంలో ఇంకొక అర్చకత్వ బృందం కర్తవ్యాలు నిర్వర్తించేవారు. ఇదే సంప్రదాయం అన్న ప్రసాదాలు, పడి (భక్ష్యాలు) చేసే వంటబ్రాహ్మణుల విషయంలోనూ ఉండేది. పురాణంలో చెప్పినదయితే, వేదం చదివిన బ్రాహ్మణులచే వండబడిన పదార్థాలు తనకు నైవేద్యంగా పెట్టాలని బ్రహ్మకు శ్రీనివాసుడు చేసిన ఆజ్ఞ. తొండమానునికి అవే ఆదేశాలిచ్చి, అతను అమలు చేసేటట్లు వ్యవస్థ చేస్తారు బ్రహ్మదేవులు.

20వ శతాబ్ది మొదటి వరకూ కొండపైన ఉన్న అతిథి గృహాల్లో, వసతిగృహాల్లో మంచాలు కూడా ఉండేవి కావు. క్షేత్రంలో మంచం మీద పడుకోరాదని, అది అపరాధమని, దేవుని సన్నిధిలో కటిక నేలపై పడుకునేవారు. వారందరికీ సుఖం అనుభవించే స్తోమత లేకకాదు, వచ్చింది సుఖం అనుభవించడానికి కాదు- స్వామివారి యాత్ర ఒక తపస్సు, దీక్ష- వీలయినన్ని ఐహిక సుఖాలకు దూరంగా ఉండి సాధన చేయాలన్న నియమం, పాటిద్దామన్న పట్టుదల. చాలామందిని నిష్ఠగల భక్తులు, కొండమీద మలమూత్ర విసర్జన కూడ పాపంగా భావించి అలానే నిగ్రహంతో స్వామి దర్శనం చేసుకుని వెళ్లేవారని విన్నాం. కాళ్లతో కొండను తాకడం ఇష్టంలేక మోకాళ్లపై కొండకు వచ్చి వెళ్లిన మహాభక్తుల విషయం మనకు చరిత్ర చెబుతుంది.

అన్ని కష్టాలు మనం పడనక్కరలేదు... ఎలాగూ పడలేం కూడా! ఎందుకంటే, ప్రాపంచిక సుఖాలకు చాలా అలవాటు పడిపోయాం గనుక. పాతకాలంలో ఎన్నో సుఖోపయోగ వస్తువులుగా భావించబడినవి ఈనాడు కనీస సౌకర్యాలుగా భావింపబడుతున్నాయి.


కీ.శే. పివిఆర్కె ప్రసాద్

పంచాగ్నుల మధ్య తపస్సు శుకులలా చేయక్కరలేదు - నిరాహారంగా క్షేత్రదర్శనం చేయనక్కరలేదు. కనీస అవసరాలు వదలనక్కరలేదు. కాని భోగ విషయాలు విడిచిపెట్టకపోతే ఈ యాత్ర ఎందుకు? క్షేత్రదర్శనం ఎందుకు? అది సాధన అవుతుందా?

ఈనాడు కొండమీద పరిస్థితులు గమనించాల్సిన అవసరం ఉంది. నారాయణ వనంలో పద్మావతీదేవిని పెళ్లి చేసుకొన్న శ్రీనివాసుడు, పెండ్లి అయ్యాక ఆరునెలలు కొండెక్కనని సంకల్పం చేసి, అగస్త్యుల వారి ఆశ్రమంలో కళ్యాణమంగాపురంలో ఉండిపోయిన విషయం పురాణ భాగంలో చూశాం. దానికొక సంకేతం ఉంది. కొండ ప్రణయ విహారాలకు నిలయం కాకూడదు. ఈనాడు మనం చేస్తున్నదేమిటి?

కొండమీదే పెళ్లిళ్లు... చరిత్రలో గత నలభై, యాభై సంవత్సరాల క్రితం వరకు పెళ్లిళ్లు చేసే సంప్రదాయమే లేదు. కొండమీద కల్యాణం స్వామివారికే కాని, ఇతరులు కొండపై కళ్యాణాలు చేసుకొనే స్థలం కాదు అది... స్వామివారిని దర్శనం చేసుకొనేవారు, దాని కోసమే కొండకు రావాలి కాని, ఎవరి పెళ్లో

చూడ్డానికో, చేయించడానికో కొండకు వచ్చి, వచ్చాం కదా అని దర్శనం చేసుకోవడం కాదు. అందుకే గతంలో దేవస్థానం వారు, కళ్యాణమంటపాలు కట్టించింది తిరుచానూరులో సరే, కొత్త వధూవరులు స్వామివారి ఆశీర్వాదానికి అనుగ్రహానికి పెళ్లయిన వెంటనే కొండకు దర్శనానికి వస్తున్నారనుకొని సమాధానపడవచ్చు. కాని హనీమూన్‌కని కొండకి రావడం క్షమించరాని పాపం!

నేను కార్యనిర్వహణాధికారిగా ఉన్నప్పుడు, కొండమీద పెళ్లిళ్లు నిషేధించడానికి ప్రయత్నం చేశాను. కాని సాధ్యం కాలేదు. ధర్మకర్తల మండలిలో కొందరు సభ్యులు "మనవాళ్లలో కొండమీద పెళ్లి చేస్తాం అని మొక్కుకునే వాళ్లున్నారు. వారి మొక్కు తీరేదెలా?" అని ప్రశ్నించారు. అందుకు మనం పెళ్లిళ్లు నిషేధించకుండా పెళ్లి చేద్దామనుకునేవారికి అన్ని సౌకర్యాలూ తిరుచానూరులో కల్పిద్దాం అన్నాను. కాగా తిరుమలలో పెళ్లిళ్లకని ప్రత్యేక సదుపాయాలు చేయకుండా ఉందామన్న నిర్ణయం తీసుకొన్నాం. ఎవరైనా అలా మొక్కుకొని పెళ్లి చేయాల్సి వచ్చి, చేసుకొని మిగతా బంధుమిత్రులకు విందులు వినోదాలు వారి ఊళ్లల్లో చేసుకోమన్నాం. అలా కొంతకాలం మఠాలలో, సత్రాలలో కాటేజీలలో మొక్కుకున్నవారు పెళ్లిళ్లు చేయడం జరిగేది.

అటు తర్వాత లాభసాటిగా ఉందని, మఠాలలోనే కళ్యాణమండపాలలో ఉండే సదుపాయాలన్నీ ఏర్పాటుచేసి, దర్శనంతో సహా కాంట్రాక్టు తీసుకొని అన్ని ఏర్పాట్లూ చేసే సంప్రదాయం మొదలైంది. పలుకుబడిగలవారు పెళ్లిళ్లు చేస్తే జరిగే విషయం చెప్పనక్కరలేదు. పెళ్లికి పెద్దయెత్తున ఏర్పాట్లు కావాలి. చాలామందికి వసతి కల్పించాలి. పెళ్లికి వచ్చే చాలామంది విఐపీలకు ఏర్పాట్లు, భక్తులకు ఇబ్బంది లేకుండా చేయగలమా? పెళ్లిళ్లు చేసుకునేవారు, చేసేవారూ భక్తులు కారా? అన్నది ఒక వాదం. కాని, స్వామివారి కోసమే కొండకు రావాలన్నది తిరుమల యాత్ర వెనుక గల స్ఫూర్తి.

నేను పదవీవిరమణ చేశాక, దాదాపు ఆరు సంవత్సరాలు తిరుమల తిరుపతి దేవస్థానాల సలహాదారుగా ఉన్నాను. అప్పుడూ ఈ పెళ్లిళ్లు చేసే సంప్రదాయాన్ని నెమ్మదిగా తగ్గిద్దామని సలహా ఇచ్చాను. పాలకవర్గాల్ని ఒప్పించడం నాకు చేత కాలేదు.

ఇతర లౌకిక విషయాల సంగతి సరేసరి. కొండమీద మొదటి విఐపీ అతిథిగృహం కట్టే ఘనత నాకే దక్కింది. కట్టడం అయితే నేనుగాని, నా ఆలోచన చేసింది నా ముందు ఉన్న కార్యనిర్వహణాధికారి రాజగోపాలరాజు. కారణం సమర్థించదగినదే. అప్పటివరకూ ప్రత్యేకమైన కాటేజీలని




ఉండేవి. వాటిలో మిగతా కాటేజీలకన్నా కొంచెం సదుపాయాలు ఎక్కువ. అవి కూడా ఎన్నో ఉండేవి కాదు. ప్రధానమంత్రో, రాష్ట్రపతో లేదా ముఖ్యమంత్రి, గవర్నర్లు కొండకు వస్తే వారికి వారితో వచ్చే పరివారానికీ... ఈ అన్ని కాటేజీలు ఇచ్చేసేవారు. ఈ కాటేజీలు కట్టడానికి డబ్బు ఇచ్చిన దాతలకు చాలా ఇబ్బంది. అదీకాక, భద్రత, ఇతర సదుపాయాలు చేయాలంటే, ఎన్నో కాటేజీలలో చేయాలి కనుక ఇబ్బంది. విఐపీలు రాక మానరు. వారికీ వారితో వచ్చేవారికీ సదుపాయాలు చేయక తప్పదు. అందుకని, అన్ని సౌకర్యాలు కలిగి, అందరినీ ఒకచోట ఉంచి, యాత్రికులకు ఇబ్బంది లేకుండా చేయాలని పద్మావతీ అతిథిగృహం కట్టడం జరిగింది. దాని కథ అంతా విపులంగా 'నాహం కర్తా హరిః కర్తా'లో రాశాను. అసెంబ్లీలో గొడవ - విఐపీల కోసం దేవస్థానం డబ్బు తగలేస్తోందని. అందుకని అది కూడా దాతల పథకంలోకి వెళ్లింది.

ఆ అతిథిగృహం కూడా సదుపాయాలు అన్నీవున్నా... భోగాల కోసం ఏర్పాట్లు చేయలేదు. పెద్దలు వచ్చినప్పుడు వారి కోసం వచ్చేవారు చాలామంది ఉంటారు. అందరికీ సానుకూలంగా ఉండేటట్లు విశాలంగా ఏర్పాట్లు చేశాం కాని, విఐపీలు రానప్పుడు అతిథిగృహంలో ఉండడం ఒక స్టేటస్ సింబల్‌గా తయారయ్యింది. రాష్ట్రపతి ఉన్న గదిలో ఉన్నాం, ఇందిరాగాంధీ ఉన్న గదిలో ఉన్నాం. అందులో మనం కూడా ప్రధానమంత్రో, రాష్ట్రపతో అన్నట్లు తయారయింది. అలా మొదలయింది... నెమ్మదిగా ధనికులు దేవస్థానాలకు విరాళాలిచ్చి, వారే స్వయంగా నిర్మాణాలు చేపట్టి, అందులోని అన్ని అవసరాలు సమకూర్చే బాధ్యత కూడా వారే తీసుకొని, వాటిని సక్రమంగా నిర్వహించడానికి వారి సిబ్బందినే నియమించే సంప్రదాయం మొదలైంది. (సశేషం)

అరణ్య కాండ



'ఆంధ్ర వాల్మీకి'
**వాసుదాసస్వామి**
(వావిలికొలను సుబ్బారావు)
విరచిత
# 'మందర-మకరందం'






అనువక్త-వాచవి
వనం జ్వాలా నరసింహారావు

## సర్గ-8
(గత సంచిక తరువాయి)

నువ్వు ఎవరివెంట పోవాలనుకుంటున్నావో ఆ ఋషులు మిక్కిలి పుణ్యాత్ములు. వారు నిన్ను పాపపు పనులు చేయమని ప్రోత్సహించరు. కాబట్టి వారి ఇష్టప్రకారం పో. దానివల్ల నీకు కీడులేదు. మేలు కలుగుతుంది. లక్ష్మణా! ఇక్కడి కొండలు, వృక్షాలు, సరస్సులు అందలి నెమళ్లు మీకు అత్యంత ఆనందాన్ని కలిగిస్తాయి. కాబట్టి సుఖంగా పోయిరండి. పాపరహితుడవైన శ్రీరామచంద్రా! నా ఆశ్రమానికి మళ్లీ రండి." అని అంటాడు.

అప్పుడు లోకసుందరి అయిన సీత విల్లంబులను, ఇతర ఆయుధాలను అంబుల పొదులను రామలక్ష్మణులను తీసుకొమ్మని చెప్పి ఇచ్చింది. వాళ్లు వాటిని తీసుకుని తమదగ్గర వుంచుకుని ఎక్కుపెట్టారు. రామలక్ష్మణులు విండ్లు ధరించిన విధం చూసి ఆయుధాల పట్టువిడుపులు తెలిసిన సీతాదేవి వారు యుద్ధ సన్నద్ధులైనారని తెలుసుకుంది.

## సర్గ-9
## శ్రీరాముడికి హితోపదేశం చేసిన సీతాదేవి

అందరూ బయటకు పోతున్న సమయంలో సీతాదేవి శ్రీరాముడు ముఖారవిందాన్ని చూసి, స్నేహభావంతో, ప్రేమతో, మెత్తటి-తియ్యటి మాటలతో ఇలా చెప్పింది: "ప్రాణేశ్వరా! నువ్వు అనుష్టించదల్చిన వానప్రస్థ ధర్మం కామం వల్ల కలిగే వ్యసనాలను వదిలి కూడా సూక్ష్మమైన ధర్మ మార్గంలో అనుష్ఠించవచ్చు కదా? కామజ వ్యసనం లేదంటావా? అవి మూడు. మొదటిది అసత్యం చెప్పడం. దానికంటే పెద్దది పరస్త్రీలతో భోగించడం. దానికంటే పెద్దది పగలేకుండా ఇతరులను నిష్కారణంగా హింసించడం. ఈ మూడింటిలో మొదటిదైన మిధ్యాభిభాషణం నీలో లేదు. ఇంతదాకా నువ్వు అసత్యం ఆడలేదు. ఇక, రెండోదైన పరభార్యా సంగమం విషయంలో నీకలాంటి కోరికే లేదు. నువ్వు ధర్మ నిరతుడవు కాబట్టి నీలో ఏ పాపాలు కనబడవు. కాబట్టి అధర్మకర దోషం లేదు. లక్ష్మణాగ్రజా!నాథా! నువ్వు సర్వదా సత్యం, ధర్మం తప్పనివాడివి. కాబట్టే తండ్రి వాక్యాన్ని పాలించడానికి ఇంత శ్రమ పడ్తున్నావు. సత్యం, ధర్మం నీలో ఏ కొరతా లేకుండా వున్నాయి. ఇంత సత్యం, ధర్మం విజితేంద్రియులకు తప్ప ఇతరులకు లభించవు. నువ్వెంత జితేంద్రియుడివో నాకు తెలుసు. రామచంద్రా! మిథ్యాభిభాణం పరదార సంగమాభిలాష నీలో లేవు. ఆ విషయం గురించి నేనేం చెప్పను. కామజవ్యసనాలలో మూడోది మిగతా రెండింటి కంటే క్రూరమైనది. నువ్వు అది చేయబూనావు. జ్ఞానహీనులు పగలేక పోయినా ఇతరుల ప్రాణం తీస్తారు. అది అలాంటివారికి తగును కాని నీకు తగదు. అది నాకెలా తెలుసంటావా? మునీశ్వరుల

కొరకు దండకారణ్య వాసులైన రాక్షసులను చంపుతానని ప్రతిజ్ఞ చేశావు. అందుకోసమే ఇక్కడకు వచ్చావు. మునిలాగా తిరగాలనుకుంటున్న నీకు, నీ తమ్ముడికి విల్లు బాణాలెందుకు? అవి హింసించే సాధనాలే కదా? ఆత్మరక్షణ కోసమని అనుకోవచ్చు కదా అంటావేమో? ఈ మునులందరూ ఆత్మరక్షణ కొరకు ఏ ఆయుధాలు ధరించారు? నువ్వు సాయుధుడవై వచ్చినందున మునులు వచ్చి నిన్ను రక్షించమని అడిగారంటావా? అలాగే నిన్ను రాక్షసులు హింసించడానికి వస్తే క్షత్రియుడవైన నువ్వు ఎవరిని ప్రార్థించాలంటావా? అలా వారు వస్తే నువ్వు ఆయుధాలు పట్టవచ్చు. కాని, ఇప్పుడు మీరు విల్లు-ఆయుధాలు పట్టిన తీరు చూస్తే యుద్ధానికి పోతున్నట్లున్నది. అందువల్ల మీ శుభం, హితం కోరినదాన్నైన నేను, నిష్కారణ విరోధంతో మేకేం అశుభం కలుగుతుందో అని భయపడుతున్నా. నువ్వు సత్యం, ధర్మం పాటించేవాడివి. ఇంతదాకా ఆ రెంటినీ సమంగా కాపాడుకుంటూ వస్తున్నావు. సంతోషమే! ఇప్పుడు రెంటికీ విరోధం వచ్చేట్లున్నది. సత్యంతో విరోధించే ధర్మం, ధర్మం కాదు. ధర్మంతో విరోధించే సత్యం, సత్యం కాదు".

"మీరు ఇప్పుడు అడవులకు ప్రయాణమై పోవడం సమ్మతమైన కార్యం కాదు. పోతే ఏమైతుందంటావా? కారణం చెప్తా విను. మీరు యుద్ధానికి పోయే విధంగా చేతులో విల్లంబులు, కత్తులు ధరించి పోతున్నారు. తోవలో ఎవరైనా రాక్షసుడు కనిపిస్తే ఇదిగో రాక్షసుడు దొరికాడని వాడిమీద బాణం వేస్తారు. ఆ దెబ్బకు వాడు చస్తాడు. అదే రాక్షసులకు, మనకు విరోధ కారణమవుతుంది. రాక్షసులు మనకు ప్రత్యక్షంగా అపకారం చేస్తే వారిని చంపవచ్చు కాని, ఎవరో ఋషీశ్వరులు చెప్పారని రాక్షసులను చంపి మనం కయ్యానికి కాలు త్రవ్వడం నాకిష్టం లేదు. రాక్షసులమీద బాణం నువ్వు ప్రయోగిస్తావని నేనెలా ఊహించానంటావా? నువ్వు రాక్షసులను చంపుతానని ప్రతిజ్ఞ చేశావు.నువ్వు సత్య ప్రతిజ్ఞుడవు. కాబట్టి చంపక మానవు. భయపడవద్దు... నిష్కారణంగా నువ్వెవరినీ చంపనని అంటావా? హింసించవచ్చే వారినే హింసిస్తానంటావా? అలా అను ధైర్యం చెప్తావా? అలా అయితే నీ ప్రతిజ్ఞ ఎలా నెరవేరుతుంది? దానికి సరైన కారణం కావాలి. ఆ కారణం నేనే అవుతా. అప్పుడు నాకొరకు నువ్వు రాక్షసులను వధించవచ్చుకాని, నువ్వు ఏక పత్నీవ్రతుడవు కదా! నన్ను వదిలి నువ్వెలా వుంటావు? నా వియోగం వల్ల నువ్వెంత దుఃఖిస్తావో? నీ దుఃఖం నేను సహించలేను. కాబట్టి నువ్వు అరణ్యానికి పోవడం నాకిష్టం లేదు. నా వియోగం వల్ల మీ ప్రతిజ్ఞ నెరవేరడం మేలా? ప్రతిజ్ఞ చెడినప్పటికీ మీరు దుఃఖపడకుండా వుండడం మేలా? అనేదే నా ఆలోచన. క్షత్రియులకు చేతిలో ఆయుధం వుంటే బలాన్ని-



తేజాన్ని వృద్ధి చేస్తుంది. కాబట్టి కలహం లేకుండా వుండేందుకు మీ ఆయుధాలను ఇక్కడే వుంచి పోదాం".

## శస్త్ర సాంగత్య దోషాన్ని తెలియచేసే ఇతిహాసాన్ని శ్రీరాముడికి చెప్పిన సీత

సీత శ్రీరాముడికి శస్త్ర సాంగత్య దోషాన్ని తెలియచేసే ఇతిహాసాన్ని చెప్తూ ఇలా అంటుంది: "ప్రాణేశ్వరా! రామచంద్రా! పూర్వకాలంలో సత్యం, ధర్మం అంటే ఆసక్తిగల ఒక ముని వుండేవాడు. అడవిలోని మృగాలన్నా, పశు పక్ష్యాదులన్నా మిక్కిలి ప్రేమకలవాడాయన. ఆయన తపస్సుకు విఘ్నం కలిగించడానికి ఒకనాడు ఇంద్రుడు భటుడి వేషంలో వచ్చి, ఒక కత్తిని ఇచ్చి, ఇది నీదగ్గర వుంచుకొమ్మని చెప్పి వెళ్లాడు. దాన్ని కాపాడాలన్న ఆసక్తితో ఆ ముని ఎక్కడికి పోయినా ఆ కత్తిని వెంట తీసుకుపోయేవాడు.అలా దానికి అలవాటు పడ్డాడు. కత్తి చేతులో వుంచుకుని పోవడానికి అలవాటుపడ్డ మునికి దానిమీద ప్రేమ పుట్టుకొచ్చింది. లోగడ కాయలు, కూరలు చేతితో కోసే ముని ఇప్పుడు కత్తితో కోయసాగాడు. అగ్నిహోత్రానికి సమిధలు చేత్తో విరిచేవాడల్లా కత్తితో కొమ్మలు కోయసాగాడు. అడవి మృగాలను కత్తితో తరమ సాగాడు. ఆ తరువాత హింసనే ప్రారంభించాడు. ఈ క్రూర వినోదాలకు అలవాటుపడి తాను చేయాల్సిన నిత్య కృత్యాలను ఉపేక్షించాడు. ఆ కారణాన వాడు అధోగతుల పాలయ్యాడు. ఆయుధం చేతిలో వుండడాన ఎంత అనర్థం కలిగిందో చూశారా? ఆయుధం చేతిలో వుంటే దేన్నైనా కొడ్దామన్న ఆలోచనే కలుగుతుంది".

"ఇప్పుడు నేను చెప్పిన ఇతిహాసం నా కల్పితం కాదు. పూర్వకాలంలో జరిగిన చరిత్రే. ఇది శస్త్ర సంయోగం వల్ల కలిగే కీడు గురించి తెలియచేస్తుంది. అగ్నిహోత్రుడు దేనిని (కట్టెలను) ఆశ్రయిస్తాడో, దాన్నే దహించి వేస్తాడు. అలాగే శస్త్రం కూడా తన్నెవరు ధరిస్తారో వారికే కీడు చేస్తుంది. ఇదంతా నీకు తెలియదని, నువ్వు **(మిగతా 63వ పేజీలో)**



# క్షయ సంవత్సరం బార్హస్పత్యమానం



(గత సంచిక తరువాయి)

1. వినియోగం - ప్రాంత విభజన, జ్యోతిష శాస్త్ర సంప్రదాయం ప్రకారం:

◆ నర్మదా నదికి దక్షిణాన: చాంద్రమానం లేదా సౌరమానం ఆధారంగా ప్రభవాది 60 సంవత్సరాల చక్రం స్థిరంగా ఉంటుంది. ఇందులో "లుప్త సంవత్సరం" ఉండదు.

◆ నర్మదా నదికి ఉత్తరాన: బార్హస్పత్య మానం ఉపయోగిస్తారు. అక్కడ గురువు రాశి సంచారాన్ని బట్టి సంవత్సరం నిర్ణయిస్తారు. గురువు అతిచారం వల్ల ఒక్కోసారి ఒక రాశిని వేగంగా దాటడం వల్ల అక్కడ "లుప్త సంవత్సరం" ఏర్పడుతుంది.

"వింధ్యాదుత్తర దేశే బార్హస్పత్యేన లిఖేదబ్దమ్ । తద్దక్షిణే తు దేశే చాంద్రం సౌరం చ సావనం చైవ ॥"వింధ్య పర్వతాలకు (లేదా నర్మదా నదికి) ఉత్తర దేశంలో బార్హస్పత్య మానం ప్రకారం సంవత్సరాన్ని రాయాలి (సంకల్పం చెప్పుకోవాలి). దక్షిణ దేశంలో చాంద్రమానం, సౌరమానం లేదా సావనమాన పద్ధతిని పాటించాలి.

2. బార్హస్పత్య మానం ఎక్కడ ఉపయోగిస్తారు?దక్షిణ భారతదేశంలో (మనం) నిత్య సంకల్పంలో బార్హస్పత్య మానాన్ని ఉపయోగించము. కానీ ఈ క్రింది ప్రత్యేక సందర్భాలలో జ్యోతిష పండితులు దీనిని గమనిస్తారు:

1. పుష్కర నిర్ణయం: నదులకు పుష్కరాలు నిర్ణయించేటప్పుడు గురువు ఏ రాశిలో ఉన్నాడనేది ముఖ్యం (ఇది బార్హస్పత్య మాన సిద్ధాంతమే, కానీ మనం సంవత్సరం పేరు మార్చము, కేవలం గురు స్థితిని తీసుకుంటాము).

2. కుంభమేళా: ఉత్తర భారతంలో కుంభమేళా సమయాలు గురువు స్థితి, బార్హస్పత్య మానం ఆధారంగానే నిర్ణయిస్తారు.

3. సంహితా ఫలితాలు: మేదినీ జ్యోతిషంలో వర్ష ఫలితాలు చెప్పేటప్పుడు, వరాహమిహిరుడు వంటి వారు బార్హస్పత్య మాన సంవత్సరాన్ని బట్టి దేశానికి శుభాశుభాలు చెప్పారు. (ఉదాహరణకు: గురువు అశ్వని నక్షత్రంలో ఉదయించినప్పుడు వచ్చే సంవత్సరం పేరును బట్టి ఫలితం చెప్పడం).



మన పద్ధతి (దక్షిణ): ప్రభవ, విభవ... అనేవి ఒక వరుస క్రమంలో వస్తాయి (1 నుండి 60). గురువు ఏ రాశిలో ఉన్నా సరే, వరుస మారదు.బార్హస్పత్య పద్ధతి (ఉత్తర): గురువు కుంభ రాశిలో ఉంటే ఒక పేరు, మీనంలో ఉంటే మరొక పేరు... ఇలా నక్షత్ర/రాశి గతిని బట్టి సంవత్సరం పేరు మారుతుంది. అందుకే అక్కడ 85 ఏళ్లకు ఒకసారి ఒక సంవత్సరం పేరు లుప్తం అవుతుంది. మనంనిత్య సంకల్పంలో ప్రభవాది చాంద్ర సంవత్సరాలనే వాడాలి. బార్హస్పత్య మానం అనేది కేవలం సిద్ధాంత గణితానికి (పంచాంగకర్తలకు), మేదినీ జ్యోతిష ఫలితాలకు మరియు ఉత్తర దేశ ఆచారాలకు వాడుతున్నారు.

మరి సూర్య సిద్ధాంతంలో బార్హస్పత్యమానాన్ని చెప్పటంలో అంతర్యం ఏమిటి?

సూర్య సిద్ధాంతం అనేది కేవలం పండుగలు నిర్ణయించే ధర్మశాస్త్ర గ్రంథం కాదు, అది ఒక 'గణిత స్కంధం' కాల స్వరూపాన్ని సంపూర్ణంగా నిర్వచించడమే దాని పరమావధి.సూర్య సిద్ధాంతంలో బార్హస్పత్య మానాన్ని ప్రత్యేకంగా చెప్పడం వెనుక ఉన్న అంతర్యం, శాస్త్రీయ కారణాలు ఇవి:

1. నవవిధ కాలమానాల నిర్వచనం: సూర్య సిద్ధాంతం (మానాధ్యాయం) ప్రకారం కాలం 9 విధాలుగా ఉంటుంది. దీనిని ఒక శ్లోకంలో చెబుతారు:

"బ్రాహ్మం దివ్యం తథా పిత్యం ప్రాజాపత్యం గురోస్తథా ।
సౌరం చ సావనం చాంద్రం ఆర్క్షం మానాని వై నవ ॥"

సృష్టిలోని కాలాన్ని కొలవడానికి ఈ 9 ప్రమాణాలు అవసరం:

1. బ్రాహ్మమానం (సృష్టి స్థితిని, బ్రాహ్మగారి కాలాన్ని తెలియజేస్తుంది)

2. దివ్యమానం (దేవతల కాలాన్ని తెలియజేస్తుంది)

3. పితృమానం (పితృ దేవతల కాలాన్నితెలియజేస్తుంది)

4. ప్రాజాపత్యం (మన్వంతరాలు తెలియజేస్తుంది)


5. గురు మానం (బార్హస్పత్యం- 60 ఏళ్ల చక్రం తెలియ జేస్తుంది)

6. సౌరమానం (సూర్య గతిని తెలియజేస్తుంది)

7. సావనమానం (సూర్యోదయం నుంచి సూర్యోదయాన్ని తెలియజేస్తుంది)

8. చాంద్రమానం (తిథులను తెలియ జేస్తుంది)

9. నాక్షత్రమానం (నక్షత్ర గతిని తెలియ జేస్తుంది)




గురువు ఆకాశంలో అతిపెద్ద గ్రహం, కాల పురుషభగవానుని మంత్రి. ఒక 'సౌర సంవత్సరం' అనే పదం ఏర్పడటానికి సూర్యుడు ఎలా కారకుడో, 60 షష్టి సంవత్సర క్రానికి గురువు కారకుడు. కాబట్టి ఖగోళశాస్త్ర రీత్యా గురువు వాస్తవగతిని లెక్కించడం సిద్ధాంతం పని.

మనం ఇప్పుడు వాడుతున్న ప్రభవాది చక్రం (దక్షిణ దేశంలో) సాంకేతికంగా గురువు ఎక్కడున్నా సరే ప్రభవాదిగా సంవత్సర నామాలను వరుసగా పేర్లు చెప్పుకుంటూ పోతాం. ఇది ధర్మ కార్యాల సౌలభ్యం కోసం (నిత్య సంకల్పం కోసం) ఏర్పాటు చేసుకున్న చాంద్రమాన పద్ధతి. కానీ, సూర్య సిద్ధాంతం గురుగతిని చెబుతుంది. ఆకాశంలో గురువు ఒక రాశిని దాటడానికి పట్టే కాలం సుమారు 361 రోజులు (సౌర సంవత్సరం కంటే తక్కువ). ఈ లెక్కన సుమారు 85 సౌర సంవత్సరాలు గడిచేసరికి, గురువు 86 రాశులు దాటేస్తాడు. అప్పుడు ఒక సంవత్సరం పేరు అదనంగా వస్తుంది (అదే లుప్త సంవత్సరం లేదా క్షయ సంవత్సరం) ముఖ్య ఉద్దేశ్యం ఏమిటంటే సిద్ధాంతం ఎప్పుడూ "ఆకాశంలో గ్రహం ఎక్కడ ఉంది?"అనేదే చూస్తుంది తప్ప, "మనం సంకల్పంలో ఏ పేరు చెబుతున్నాం?" అనేది కాదు. గ్రహాల వాస్తవ స్థితిని అనుసరించి మధ్యమ గురుగతిని తెలపటమే దీని ఉద్దేశం.

3. మేదినీ జ్యోతిషం - ఫలిత భాగం: ఇది చాలా ముఖ్యమైన విషయం. వర్ష ఫలితాలు (దేశ క్షేమ లాభాలు, వర్షాలు, పంటలు) చెప్పేటప్పుడు, మనం వాడుతున్న 'వరుసపేరు'కంటే, గురువు ఉన్న రాశిని బట్టి వచ్చే పేరే పనిచేస్తుంది. ఉదాహరణకు: మనం వరుసగా 'సిద్ధార్థి' నామ సంవత్సరం అని పిలుస్తున్నాం అనుకుందాం. కానీ ఆకాశంలో గురువు అతిచారం వల్ల 'రౌద్రి' లక్షణాల్లోకి వెళ్ళిపోతే, ఫలితాలు 'సిద్ధార్థి' ఫలితాలే ఇస్తాయి, అని వరాహమిహిరుడు వంటి వారు తీసుకున్నారు. కానీ సత్యం అదికాదు. సూర్యసిద్ధాంతం బార్హస్పత్యమానాన్ని గణిత రీత్యా వివరించింది. అప్పుడే జ్యోతిష్కుడు సరైన ఫలితాన్ని చెప్పగలడు.

4. పుష్కరాలు, కుంభమేళాలకు గురు స్పష్ట గతి: పుష్కరాల నిర్ణయం పూర్తిగా బార్హస్పత్య మానం మీదే ఆధారపడి ఉంటుంది. గురువు మేషంలోకి వస్తే గంగకు పుష్కరం. వృషభంలోకి వస్తే నర్మదకు పుష్కరం. ఈ నిర్ణ యాలు జరగాలంటే సూర్య సిద్ధాంతం చెప్పిన గురు స్పష్టగతి తెలియాలి. కేవలం చాంద్ర మాన సంవత్సరం పేరు తెలిస్తే సరిపోదు. మనం సౌలభ్యం కోసం చాంద్రమానంతో అనుసంధానం చేసి, లుప్త సంవత్సరాన్ని వదిలేసినా... సూర్య సిద్ధాంతం అంతర్యం మాత్రం "ఖగోళంలో జరిగే వాస్తవ మార్పును గణితం ద్వారా పట్టుకోవడమే".

ప్రభవ నామ సంవత్సరంతో కాకుండా, విజయనామ సంవత్సరంతో సూర్య సిద్ధాంతం ఎందుకు మొదలుపెట్టాల్సి వచ్చింది.

సాధారణంగా అందరూ ప్రభవ, విభవ అని చదువుతారు కదా, మరి సూర్య సిద్ధాంతం విజయ నామ సంవత్సరంతో గణితాన్ని ఎందుకు మొదలు పెట్టింది? అనే సందేహం రావడం సహజం.దీనికి ప్రధాన కారణం: కలియుగ ఆరంభ సమయం.

1. సూర్య సిద్ధాంతం తన గణితాన్ని 'కలియుగ ఆరంభం' (మధ్యరాత్రి, ఉజ్జయిని సమయం, చైత్ర శుద్ధ పాడ్యమి) నుండి ప్రామాణికంగా తీసుకుంటుంది. సృష్టి ఆరంభం (కల్పం) నుండి గ్రహాలు తిరుగుతూనే ఉన్నాయి. సరిగ్గా కలియుగం ప్రవేశించే సమయానికి (క్రీ.పూ 3102 ఫిబ్రవరి 17/18), ఆకాశంలో బృహస్పతి (గురువు) స్థితి మేషం కాబట్టి, విజయాదయః అన్నారు కనుక అప్పటికి నడుస్తున్న సంవత్సరం 'విజయ' నామ సంవత్సరం. అందుకే సూర్య సిద్ధాంతకర్తలు, కలియుగం మొదలైన దగ్గరి నుండి అహర్గణం (రోజుల సంఖ్య) కట్టుకుని, గురువు స్థానాన్ని సాధించినపుడు, వచ్చే సంఖ్యను 'విజయ' నుండి లెక్కించాలి" అని సూత్రం చెప్పారు. (సశేషం)

**- డా. శంకరమంచి రామకృష్ణ శాస్త్రి**
**శంకరమంచి శివ**



# శ్రీమద్దేవీభాగవతం

## నవమ స్కందం



డా॥ వద్దిపర్తి పద్మాకర్

(గత సంచిక తరువాయి)

అనంతరం భూలోకంలో రోగిగాపుడతాడు. మాంసం అమ్ముతూ, మోస్తూ బ్రతుకుతాడు. ఇలా తులసి పలికిన వెంటనే బ్రహ్మ అక్కడకు వచ్చాడు. శంఖచూడా!ఈమెను గాంధర్వ వివాహం చేసుకో!, తులసీ ! నీవు శంఖచూడుని భర్త గా స్వీకరించు. ఇతడు ఉత్తమ జాతులను జయించగల వీరుడు. ఈతనికి భార్యవై సౌభాగ్యాలు పొందు. అనంతరం గోలోకం చేరి శ్రీకృష్ణుని అనుగ్రహం పొంది శంఖచూడ మరణానంతరం చతుర్భుజ నారాయణుని, వైకుంఠంలో సేవించి తరించు.

ఇలా బ్రహ్మ వారితో పలికి, తన లోకానికి వెళ్ళాడు. శంఖచూడుడు తులసిని గాంధర్వ వివాహం చేసుకొన్నాడు. ఆమెతో అనేక భోగాలు అనుభవించాడు. శంఖచూడుడు త్రిలోకాలలో దుర్లభాలైన అనేక వస్తువులను ఆమెకు ఇచ్చాడు. వరుణుని రత్నమాల, వస్త్రాలు, స్వాహాదేవి యొక్క నూపురాలు, ఛాయాదేవీ భుజకీర్తులు, రోహిణీకుండలాలు, రతీదేవి యొక్క రత్నాంగుళీయకాలు, గాజులు, విశ్వకర్మ ఇచ్చిన శంఖం, విచిత్ర పద్మాలు, శయ్య, భూషణాలు తులసికి శంఖచూడుడిచ్చాడు.ఓ దేవీ! నేను నీ దాసుడను అని పదేపదే పలికాడు. వక్షఃస్థలానికి అదుముకొన్నాడు. ఒక్కొక్కప్పుడు మలయపర్వతంపై విహరిస్తాడు. దేవనిలయాలైన పర్వతాలు, తపోవనాలు, పుష్పోద్యానాలలో విహరిస్తాడు. పుష్పభద్రానదీ తీరంలోని మెత్తని ఇసుక తిన్నెలపైనా, నందనవనాలలోనూ, గంధమాదనపర్వతంపైనా, చిత్ర చందన వనాలలోనూ విహరిస్తాడు. నిత్యం కామం పెరుగుతుండగా, ఆమెతో విహరిస్తూ, ఒక మన్వంతరకాలం దేవదానవులను పరిపాలించాడు. దేవతలు సర్వం కోల్పోయి భ్రష్టులై తిరిగారు.

ఒకనాడు వారు బ్రహ్మసభకు వెళ్ళారు. శివుడా సమయంలో బ్రహ్మలోకంలో ఉండడంతో వారు, తమను రక్షించమని ఆయనను వేడుకొన్నారు. శివుడు, బ్రహ్మాదులతో కలసి ముసలితనం, చావు మున్నగు వాటిని హరించే పరమధామమైన వైకుంఠం వెళ్ళాడు. అక్కడ శ్రీహరిభవన ద్వారం వద్ద ద్వారపాలకులను చూసారు. ద్వారపాలురు రత్నసింహాసనాసీనులై, పీతవస్త్రాలు ధరించి, రత్నాభరణభూషితులై ఉన్నారు. వారందరూ, వనమాలలు ధరించినవారే. నీలమేఘశరీరులే. శంఖచక్రగదాపద్మాలను ధరించిన వారే. వారి అనుమతి తీసుకుని బ్రహ్మాదులు లోపలకు వెళ్ళారు. పదహారుద్వారాలు దాటాక శ్రీ విష్ణువు ఉండే సభాభవనం ఉంది. అక్కడి సభ్యులందరూ నారాయణుని వలె కనబడుతున్నారు.

నారాయణ సభాభవనం నవ చంద్ర మండలమా అన్నట్లుగా, చతురస్రాకారంలో, మనోహరంగా ఉంది. ఇంద్ర నీలమణులచే నిర్మింపబడి, వజ్రాలు తాపడం చేయబడి ఉన్న భవనమది. శ్రీహరి తన ఇచ్ఛతో అమూల్య రత్న ఖచితమైన ఆ సభాభవనాన్ని నిర్మంచాడు. పద్మరాగాది మణులతో కూడి మెట్లు ఆ భవనానికి శోభను చేకూరుస్తున్నాయి. అది మణిస్తంభాలతో కూడినది. ఆ స్తంభాలకు మంచి మంచి వస్త్రాలు, పల్లవాలు కట్టబడి ఉన్నాయి. అక్కడ రత్ననిర్మిత పూర్ణ కుంభాలపై పారిజాతపుష్పమాలలు శోభిస్తున్నాయి. కస్తూరీ కుంకుమ చందన పరిమళాలు సభలో వ్యాపిస్తున్నాయి. శతయోజన

విస్తీర్ణమైన ఆ సభలో విద్యాధర స్త్రీలు నృత్యాలు చేస్తూ, పాటలు పాడుతున్నారు. నక్షత్రాల మధ్యలో చంద్రుడా అన్నట్లు అక్కడి దివ్యజనులమధ్య శ్రీమహావిష్ణువు శోభిల్లుతున్నాడు. దివ్యసింహాసనంపై కూర్చుని ఉన్న విష్ణువును బ్రహ్మాదులు దర్శించుకొన్నారు. హారకిరీటకుండల శోభితుడైన శ్రీహరికి లక్ష్మీ సరస్వతులు సేవ చేస్తుండగా, గంగ శ్వేత చామరంతో వీస్తున్నది. స్వామి వారికి దేవతలు తలలు వంచి నమస్కరించారు. భక్తితో స్తుతించారు. సృష్టి కర్త అయిన బ్రహ్మ శంఖచూడుని గుఱించి విష్ణువునకు విన్నవించాడు. హరి బ్రహ్మతో ఇలా అన్నాడు ? చతుర్మ్ముఖా! శంఖచూడుని చరిత్ర నాకు తెలుసు. వాడు నా భక్తుడు. తేజశ్శాలి అయిన గోపాలుడు. పురాతనం అయిన ఆ చరిత్ర విను. గోలోక చరిత్రం పాపాలను తొలగిస్తుంది. పుణ్యమిస్తుంది.

నా పార్శ్వచరుడైన సుదాముని రాధ శపించింది. అతడే దానవుడుగా జన్మించాడు. నేను ఒకప్పుడు విరజతో రాసమండలంలో ఉండగా రాధ అక్కడకు వచ్చింది. నేను ఆమెకు దర్శనం ఇవ్వలేదు. విరజ నదీ రూపం ధరించడం, నేను కనపడకబోవడంతో రాధ తన చెలులతో ఇంటికి వెడుతూ, దారిలో సుదాముని ఇంటికి వెళ్ళింది. నేనక్కడ ఆమెకు కనబడ్డాను. రాధ నన్ను నిందించింది. నాకు రాధా తత్త్వం తెలుసు కనుక ఏమీ పలకలేదు. సుదాముడు మాత్రం ఆమెపై ఆగ్రహించాడు. రాధను నిందించాడు. రాధ వానిని బయటకు పొమ్మన్నది. ఆ సమయంలో రాధా సఖులు అతడిని బయటకు పంపించివేసారు. అతడు ఆ స్త్రీలను కొట్టడంతో రాధ దానవ జన్మ ఎత్తమని శపించింది. అతడు దుఃఖించి నాకు నమస్కరించి శాపవిముక్తి ప్రసాదించమని ప్రార్థించాడు. దాంతో కరుణించి రాధ ఇలా అంది - నా శాపాన్ని అనుభవించి తిరిగి ఇక్కడకు వస్తావు. అప్పుడు సుదాముడు ఎంతకాలం అన్నాడు. క్షణార్థం అని ఆమె అంది. గోలోకంలో క్షణంలో సగభాగం అనగా భూలోకంలో ఒక మన్వంతరమని బ్రహ్మ కాలాన్ని నిర్ణయించాడు. కనుక శంఖచూడుని శాపం ముగియబోతున్నది. అతడు తిరిగి గోలోకం చేరతాడు. బలవంతుడు, మాయా యోగేశుడైన శంఖచూడుని, శివుడు నా శూలంతో సంహరిస్తాడు.

(సశేషం)






# శ్రీ సాందీపని గురుకుల సేవాట్రస్ట్

Founded By:Maharanyam Sri Sri MuraliDhara Swamiji (Chennai)

Sri Hari

మన సనాతన ధర్మంలో మన జీవన ఆధారం వేదం, వేదం మన హిందూ ధర్మానికి భారతదేశానికి హృదయం వంటిది. ఎటువంటి సౌకర్యాలు లేని ప్రాచీన కాలంలో ఎన్నో ఇబ్బందులు ఎదుర్కొని మహాత్ములు,ఋషులు చాలా కష్టపడి వేదాన్ని సంరక్షించి ఇప్పుడు మన తరానికి అందించారు. వాళ్ళు అందించిన వేదాన్ని కాపాడవలసిన బాధ్యత మన అందరి మీద ఉన్నది.

హైదరాబాద్ నగరంలో ECIL సాకేత్, కాప్రా నందు శ్రీ ప్రేమిక వేదాశ్రమం అను పేరుతో శ్రీ కృష్ణ యజుర్వేద పాఠశాల నిర్వహింపబడుతున్నది, కావున ఆస్తిక జనులందరూ ఈ వేద పాఠశాలకు ధన, వస్తు రూపేణ సహాయ సహకారములు అందించి ఆ వేదమాత యెక్క అనుగ్రహమునకు పాత్రులు కాగలరని కోరుకుంటున్నాము.

ఈ వేద పాఠశాల యందు బ్రాహ్మణ సమారాధన తమ తమ గోత్ర నామములతో చేయించుకున్న వారికి ప్రసాదముగా కుంకుమ, మంత్రాక్షతలు తగు రసీదు పంపడం జరుగుతుంది.

ఆ వేదమాత యొక్క అనుగ్రహం అందరికీ లభించుగాక

Donation Type:One Day Samaradhana-Rs.5000/- One Vidhyarthi Expenses/Month-Rs.8000/- One Day Patasala Expenses-Rs.14000/-

Donations can be made by cheques favoring '' SRI SANDEEPANI GURUKULA SEVA TRUST (A.P.)"

donation can be made by online fund transfer : IFSC Code : **SBINOO12739**

Account Number : **34134951509** Name : SRI SANDEEPANI GURUKULA SEVA TRUST (A.P.),

Branch : SAKETH (HYDERABAD) UPI:ssgsthyd@icici

**Donations are eligible for exemption U/S 80G of Income - Tax Act**

**Admin & Patasala Address : Door no.1-1-31/399A, Lane - 26,Phase-1 Saket nagar,Saket, Kapra, Hyderabad-62. cell:9440875114 - 8667000419**

# వేదాల్లో విజ్ఞానాంశాలు




పోలిశెట్టి బ్రదర్స్

(గత సంచిక తరువాయి)

### 8. గ్రహశకలాలను గురించి...

గ్రహశకలాలు అంటే గ్రహానికి చెందినదిన ముక్కలని అర్థం. ఇటువంటి ముక్కలు అసంఖ్యాకంగా మన సూర్యకుటుంబంలోని కుజ, గురు గ్రహాల మధ్యగా తిరుగుతున్నాయి. ఈ గ్రహశకలాలను ''గ్రహ శకలాల మండలం'' (యాస్టెరాయిడ్స్ బెల్ట్) అంటారు. అయితే సూర్యకుటుంబంలోని గ్రహశకలాలు మొత్తం అన్నీ ఈ మండలంలోనే లేవు. కొన్ని గ్రహశకలాలు ఇతరితర గ్రహాల కక్ష్యల దగ్గర్లోకి వస్తూ కూడా తిరుగుతుంటాయి. వాటిలో ఏదైనా ఎప్పుడైనా భూమిపై పడుతుందేమోనని ఆధునిక శాస్త్రవేత్తలు ఇప్పటికీ అదిరిపడుతూనే ఉన్నారు. ఈ గ్రహశకలాలు ఎలా ఏర్పడ్డాయనే విషయాన్ని మన శాస్త్రవేత్తలు సరిగా చెప్పలేకపోతున్నారు. భిన్నాభిప్రాయాలు వ్యక్తమౌతున్నాయి. గ్రహశకలాల సైజుల్లో తేడాలుంటాయి. కొన్ని రాతిబండల సైజులోనూ, మరికొన్ని పెద్ద పెద్ద పర్వతాల సైజులోనూ ఉంటాయి. ఈవిధంగా ఇవి అతి చిన్న పరిమాణం నుండి అతిపెద్ద పరిమాణం వరకూ ఉంటాయి. పెద్ద గ్రహశకలం అంటే మైళ్లకొలదీ పొడవు, వెడల్పులను కలిగి ఉంటుంది. భూమి కక్ష్యకు దగ్గరగా తిరుగుతూ ఉండే గ్రహశకలాలు అప్పుడప్పుడూ భూమి ఆకర్షణకు లోనై భూమిపై పడుతుండేవి. ఇది కృతయుగం నాటి మాట. వీటిని ''రెక్కల పర్వతాలు''గా పురాణాల్లో వర్ణించారు. ఈ రెక్కల పర్వతాల వల్ల నగరాలు, పట్టణాలు నాశనమవుతుండడంతో, ఇంద్రుడు వాటి రెక్కల్ని నరికివేశాడట. అక్కడితో భూమికి రెక్కల పర్వతాల బాధ తప్పిందట. పురాణకాల ఋషులు తమకు గల గ్రహశకలాల పరిజ్ఞానాన్ని బట్టి ఈ విధమైన వర్ణన చేశారన్నమాట. మన భూమికి గ్రహశకలాల బాధ, పురాణకాలంలోనే అంతమయింది.

ఈ గ్రహశకలాలను గురించిన ప్రస్తావన మనకు రామాయణంలో కూడా కన్పిస్తుంది. సీతాన్వేషణలో హనుమంతుడు గాలిలో ఎగురుతూ సముద్రాన్ని దాటుతూ ఉంటాడు. అప్పుడు సముద్రంలో నుండి 'మైనాకుడు' అనే పర్వతం పైకి లేచివచ్చి, హనుమంతుణ్ణి తనపై కాస్త విశ్రాంతి తీసుకోమంటాడు. మైనాకుడు అనే ఈ పర్వతం ఒక గ్రహశకలమే! ఈ విషయాన్ని మైనాకుని మాటల వల్ల మనం గ్రహించవచ్చు. ''ఓ హనుమా! కాస్సేపు నా శిఖరంపై నిలచి, నా ఆతిథ్యం స్వీకరించు. నేను నీ హితుణ్ణి, ఎలాగంటే చెప్తాను, విను. కృతయుగంలో పర్వతాలకు రెక్కలుండేవని వినే ఉంటావు. అవి ఆకాశంలో ఎగురుతూ ఉండేవి. ఏ సమయంలో ఎక్కడ వాలి, అవి ప్రాణికోటిని పిండి చేస్తాయోనని అందరికీ భయంగా ఉండేది. అప్పుడు సర్వ దేవత, మానవ, ఋషిగణాలు ప్రార్థించగా ఇంద్రుడు ఆ పర్వతాల రెక్కలు నరికేశాడు. ఆ రెక్కల పర్వతాల్లో నేనూ ఒకణ్ణి. నా రెక్కలు నరికివేయబడ్డ సమయంలో నీ తండ్రి వాయుదేవుని సహాయంతో నేనీ లవణ సముద్రంలో సురక్షితంగా పడ్డాను. నీ తండ్రి చేసిన సహాయానికి ప్రత్యుపకారం నన్ను చెయ్యనీ!'' అంటాడు మైనాకుడు.

పై సంఘటన ఆధునిక గ్రహశకలాల పరిజ్ఞానానికి అనుకూలంగానే కన్పిస్తుంది. చూడండి. రామాయణ రచయిత వాల్మీకి తనకుగల గ్రహశకలాల పరిజ్ఞానాన్ని పైవిధంగా మనకు అందించాడు. నిజ విజ్ఞానాన్ని సూటిగా చెప్పకుండా, ఒక అందమైన కథగా అల్లి చెప్పడం మనమహర్షులకు అలవాటే కదా! మైనాకుడు అంటే భూమికి దగ్గరగా తిరిగే ఒక గ్రహశకలం అన్నమాట. అది ఎప్పుడో భూమి ఆకర్షణకు లోనై వచ్చి సముద్రంలో పడి ఉంటుంది. భూమిపైకి చేరుకునే లోపులో గాలి ఒరిపిడికి గ్రహశకలాలు మాడి మసి కావచ్చు. అయితే మైనాకుడు మాత్రం క్షేమంగా వచ్చి సముద్రంలో పడడం జరిగింది. దారిలో వాయుదేవుడు దయచూపడం వల్లనే, తాను మాడి మసికాకుండా ఉండడం జరిగిందని మైనాకుని భావన. పూర్వం భూమిపై పడుతుండే గ్రహశకలాల్లో ఇంచుమించుగా చివరి గ్రహశకలం ఇదే కావచ్చు. వాల్మీకి దానికి 'మైనాకుడు' అని ఒక ముద్దుపేరు పెట్టాడు. స్వేచ్ఛగా తిరుగుతూ అప్పుడప్పుడూ భూమిపై రాలిపడే గ్రహశకలాలను 'రెక్కలున్న పర్వతాలు'గా మన మహర్షులు వర్ణించడం సమంజసంగానే కన్పిస్తుంది. భూమి ఆకర్షణకు అవి రాలిపడడాన్నే ఇంద్రుడు వాటి రెక్కలు నరికితే కూలిపోవడంగా వారు వర్ణించారు. ఇటువంటి పురాణ విశేషాలను అర్థం చేసుకోగలిగితే, అవన్నీ విజ్ఞాన గుళికలే!

(ఇప్పటికీ మనకు టెలిస్కోపుల్లో కన్పిస్తూ తిరుగుతున్న గ్రహశకలాలు అనేకం ఉన్నాయి. వాటిలో కొన్నింటిని "సెరిస్, ఇరాస్, జూనో, అపోలో, హెర్మిస్, వెస్టా, ఎడోనిస్, ఎమర్, యాస్ట్రీ" అంటూ రకరకాల పేర్లు కూడా పెట్టడం జరిగింది. ఇవి గ్రహాల వలె తమ చుట్టూ తాము తిరుగుతూ ఉంటాయి. 'ఇకారస్, అపోలో, ఎడోనిస్, హెర్మిస్, ఇరాస్, ఎమర్' అనే గ్రహశకలాలు అప్పుడప్పుడూ మన భూమికి దగ్గరగా వచ్చి వెళ్తూ మనల్ని భయపెడుతూ ఉంటాయి. రెక్కల పర్వతాలనబడే ఈ గ్రహశకలాలను గురించి పురాణకాలంలోనూ ఇలాగే భయపడుతూ ఉండేవారు. "ప్రస్తుతం ఏ గ్రహశకలం మన భూమిని ఢీకొట్టినా, వెయ్యి హైడ్రోజన్ బాంబులు పేల్చినంత విధ్వంసం జరుగుతుందని' ఆధునిక శాస్త్రవేత్తల అంచనా. అయితే ఇప్పుడిప్పుడే ఏ గ్రహశకలమూ కూడా భూమిని ఢీకొట్టే ప్రసక్తి లేదని వారు చెప్తున్నారు. కాబట్టి మీరేం భయపడకండి.)

+++

## 9. పురాణంలో కాంతివేగ ప్రయాణం

ఇంతవరకూ కనుగొన్న ప్రకారం విశ్వంలో అన్నింటికంటే వేగంగా ప్రయాణించగల శక్తి 'కాంతి'కి ఉంది. (కాంతి కంటే వేగంగా పయనించే 'వాయు వాహినులను' విశ్వంలో కనుగొన్నామని ఇటీవల కొంతమంది శాస్త్రవేత్తలు చెప్తున్నారు. ఆ విషయం గురించి ఇంకా చాలా పరిశోధనలు జరుగవలసి ఉన్నది. నిర్ధారణగా చెప్పాలంటే, ప్రస్తుతానికి మాత్రం అన్నింటికంటే వేగంగా పయనించేది కాంతియే!) ఈ విషయం మన పూర్వులకు తెలియనిది కాదు. అన్నింటికంటే వేగంగా పయనించేది కాంతి అని ప్రస్కణ్వ మహర్షి ఋగ్వేదంలో చెప్పాడు. కాంతి 1 సెకను కాలానికి సుమారుగా 1,87,000 మైళ్ల దూరం ప్రయాణించగలదని ఆధునిక శాస్త్రవేత్తలు తేల్చారు. దీని ప్రకారం కాంతి 1 సంవత్సర కాలంలో దాదాపుగా 6 లక్షల కోట్ల మైళ్ల దూరం ప్రయాణిస్తుంది. ఈ 6 లక్షల కోట్ల మైళ్ల దూరాన్నే నేటి శాస్త్రవేత్తలు "కాంతి సంవత్సరం" అంటారు. భూమి నుంచి నక్షత్రాల దూరాలను మామూలు దూరమానంలో కాకుండా కాంతి సంవత్సరాలలో లెక్కిస్తారు. కోటానుకోట్ల మైళ్ల దూరాల్లో ఉండే నక్షత్రాలకు ఇటువంటి లెక్క అవసరం. (సుమారు 26 లక్షల కోట్ల మైళ్ల దూరంలో ఉన్న 'అల్ఫా సెంటారై' అనే నక్షత్రం నుండి బయలుదేరిన కాంతి, మన దగ్గరకు రావడానికి 4 సంవత్సరాలకు పైగా (4.3 సం.) సమయం పడుతుంది. అందుచేత అల్ఫాసెంటారై అనే నక్షత్రం మనకు 4.3 కాంతి సంవత్సరాల దూరంలో ఉన్నట్లుగా శాస్త్రవేత్తలు చెప్తారు. ఈ ప్రకారంగా రోహిణీ అనే నక్షత్రం మనకు 57 కాంతి సంవత్సరాల దూరంలో ఉందట.)

కాంతి వేగాన్ని పురాణకాలంలోనే మనవారు చక్కగా గణించారు. వారి లెక్కతో ఆధునిక పాశ్చాత్యుల లెక్క సరిగ్గా సరిపోయింది. వాటి వివరాలు ఈ క్రింద ఇస్తున్నాం చూడండి.

### కాంతి వేగం గురించి మన పూర్వీకుల లెక్క

కాంతి వేగం గురించి మన పూర్వీకులు శ్లోకరూపంలో ఇలా చెప్పారు.

శ్లో ॥ యోజనానాం సహస్రేద్వే ద్వేశతే ద్వేచయోజనే
ఏకేన నిమిషార్ధేన క్రమమాణ నమోస్తుతే॥

ఋగ్వేదంలోని 1-50-4 సూక్తానికి వ్యాఖ్యానం రాస్తూ విద్యారణ్యులు, భాస్కర రామాయణాన్ని తెనిగిస్తూ మల్లికార్జున భట్టు మహాభారతంలో ఆదిపర్వం నందలి తపతి సంవరణోపాఖ్యానమును నన్నయభట్టారకుడు, కాశీఖండ గ్రంథాన్ని రాస్తూ (III - 176లో) శ్రీనాథుడు "పై శ్లోక ప్రమాణమును బట్టి" కాంతివేగం అర్ధ నిమిషేన 2,202 యోజనాలని చెప్పుకొచ్చారు. అంటే అర (1/2) నిమేషంలో కాంతి 2,202 యోజనాల దూరం ప్రయాణిస్తుందని భావం ఈ సందర్భంలో 'నిమేషము' అనగా ఆంగ్లేయులు వాడే 'నిముషం' అనే పదం కాదు. మన హైందవ కాలమానానికి చెందిన 'నిమేషం' అనే మరో పదం ఇది. ఈ సందర్భానికి చెందిన హైందవ కాలమానం ఇలా ఉంటుంది చూడండి. (సశేషం)



# ఒక దివ్యజ్యోతి అంతర్ధానం

## విజయదుర్గ పీఠాధిపతి వెదురుపాక (గాడ్) శివైక్యం

**కలియుగ వైభవంలో అలసిపోయిన అసంఖ్యాక జీవులకు ఆధ్యాత్మిక మార్గదర్శనం చేసిన ఒక మహోన్నత దివ్యజ్యోతి పరమాత్మలో లీనమైంది. భక్తుల పాలిట కల్పవృక్షమై, ఆర్తుల పాలిట కామధేనువై నిలిచిన తూర్పు గోదావరి జిల్లా వెదురుపాక శ్రీ విజయదుర్గా పీఠాధిపతి పరమపూజ్యులు శ్రీ వి.వి. సుబ్రహ్మణ్యం గారు తమ భౌతిక లీలను ముగించి కైవల్యపదాన్ని అధిరోహించారు. భక్తుల హృదయాలలో 'వెదురుపాక గాడ్'గా, 'హిస్ హోలీనెస్ మిస్టర్ గాడ్' గా అఖండ స్థానాన్ని సంపాదించుకున్న సద్గురువర్యుల నిర్యాణం ఆధ్యాత్మిక జగత్తుకు తీరని లోటు. ఆయన భౌతికంగా మన మధ్య లేకపోయినప్పటికీ, ఆయన వెలిగించిన జ్ఞానజ్యోతి, చూపిన ధర్మమార్గం నిరంతరం విశ్వవ్యాప్తంగా భక్తుల హృదయాలలో ప్రకాశిస్తూనే ఉంటాయి.**

వెదురుపాక అనగానే - అది ఎక్కడికి దగ్గర? అనే ప్రశ్న ఉదయిస్తుంది. అది ఒక చిన్న గ్రామం. రాయవరం దానికి మజరా గ్రామం. రాజమండ్రికి 36 కిలోమీటర్లు, కాకినాడకు 29 కి.మీ, తూర్పుగోదావరి జిల్లా. మహాభారత గాథలో ప్రసిద్ధుడైన విదురుడు ఈ ప్రాంతాలలో సంచరించాడనీ, అందువల్ల ఇది విదురుపాక అనీ ఒక ఐతిహ్యం.



విజయదుర్గా పీఠం వెదురుపాకలో వేలాది భక్తులకు కొంగు బంగారం. ఎన్నో కుటుంబాల ఆర్తిని తొలగించిన మహామహిమాన్విత విజయదుర్గాదేవి పీఠాన్ని 1972 ఆగస్టు 18న వాడ్రేవు వెంకట సుబ్రమణ్యం స్థాపించారు. వెదురుపాక 'గాడ్'గా ఆయన లోకానికి సుపరిచితులు. ఆయన ఒక సిద్ధయోగి. సన్యాసాశ్రమం స్వీకరించలేదు. మంత్ర శక్తులతో భక్తులనాకర్షించలేదు. సంసారంతో ఆ పీఠంలోనే ధర్మపత్ని సీతమ్మతో కలిసి జీవిస్తూ భక్తులకు బాసటగా నిలిచారు. ముగ్గురు ఆడపిల్లలకు తండ్రి. వేలాది భక్తులకు అండ దండ.

అందరినీ ఆప్యాయంగా బంధువర్గంగా భావించి బావ వరుస, చెల్లెలు వరుస, అల్లుడు, కూతురు సంభావనలతో వారి వారి యోగక్షేమాలను సాదరంగా అడిగి తెలుసుకొని ఆశీర్వదించేవారు. 2026 జనవరి 19న 'గాడ్'గారి 90వ జన్మదినోత్సవం వెదురుపాక ఆడిటోరియంలో వైభవంగా జరిగింది. ఆ సభలకు ఆనవాయితీగా కొన్నేళ్లుగా నేనే అధ్యక్షుడిని. జన్మదినోత్సవాలు ఏటా జనవరి 19న భక్తులు శ్రద్ధాసక్తులతో నిర్వహిస్తారు. సంస్థకు 'గాడ్' కనిష్ఠ సోదరులు బాపిరాజు, వారి కుమారులు బాబీ సూత్రధారులు. కార్యనిర్వాహక బృందం. జ్యేష్ఠ సోదరుని (సూర్యనారాయణమూర్తి) కుమారులు - పెదబాబు, పండు సహకార బృందం. అదొక కుటుంబ వాతావరణం. భక్తులు తమ సొంత ఇల్లుగా భావించి మసలుకొంటారు. దీర్ఘవ్యాధుల నుంచి బయటపడినవారు, మృత్యుముఖం నుంచి వెలువడిన వారికి అదొక పర్వదినం.

జన్మదినోత్సవ వేడుకల సభ భువన విజయ సభా ప్రాంగణంలా భాసిస్తుంది. సహస్రావధానులు గరికపాటి నరసింహారావు, మేడసాని మోహన్, వద్దిపర్తి పద్మాకర్, ధూళిపాళ మహదేవమణి, ఆచార్య శలాక రఘునాథ శర్మ, విద్వన్మణులు విశ్వనాథ గోపాలకృష్ణమూర్తి, ఎర్రాప్రెగడ రామకృష్ణ, అనంతపద్మనాభరావు, ఆకెళ్ల విభీషణ శర్మ, ఆచార్య బేతవోలు రామబ్రహ్మం ప్రభృతులు జన్మదినోత్సవ వేడుకలలో అంజలి ఘటిస్తారు. సుప్రసిద్ధ రాజకీయ నాయకులు, హైకోర్టు న్యాయమూర్తులు, ఐఎఎస్, ఐపిఎస్ అధికారులు సభా కార్యక్రమాలలో పాల్గొంటారు. సిఎంఆర్ గ్రూపు సంస్థల అధిపతి తుమ్మిడి రామకుమార్ సభా నిర్వహణలో భాగస్వామి.

90వ జన్మదినోత్సవ వేడుకలు బ్రహ్మాండంగా జరిగిన నాలుగు నెలలలోపే (వంద రోజులలో) గాడ్ గారు జూన్ 5, 2026న రాత్రివేళ శివైక్యం చెందడం భక్తకోటికి అశనిపాతం. గత కొద్ది సంవత్సరాల క్రితమే ఆయన ధర్మపత్ని సీతమ్మ కాలధర్మం చెందారు. రాజమండ్రిలో గోదావరీ

తీరంలోని కోటిలింగాల రేవులో జూన్ 6న 'గాడ్'గారి అంత్యక్రియలు జరిగాయి.

**పూర్వాశ్రమం**

గాడ్ గారు 1972 ఆగస్టు 18న విజయదుర్గాదేవి ఇచ్చిన మంత్రదీక్షతో సన్యాసం స్వీకరించారు. 1936 జనవరి 19న వెదురుపాక కరణంగా ప్రసిద్ధులైన వాడ్రేవు చిన కృష్ణంరాజు, వెంకట రత్నమ్మ దంపతుల మూడవ సంతానం వెంకట సుబ్రమణ్యం (ఆయనే గాడ్‌గా ప్రసిద్ధులు). కృష్ణంరాజుకు నలుగురు కుమారులు- సుబ్బారావు (కీర్తిశేషులు), సూర్యనారాయణమూర్తి (94 సం.లు), వెంకట సుబ్రమణ్యం, చిన్నవాడు వెంకట బాపిరాజు. బాపిరాజే గత మూడు దశాబ్దాలుగా సంస్థ కీర్తిప్రతిష్ఠలు ఇనుమడంపజేశారు. సంస్థ కార్యకలాపాలు ఉధృతం చేసి పీఠ వ్యవహారాలకు ప్రచారం తెచ్చారు. ఏటా జనవరి 19న జన్మదినోత్సవం, ఆగస్టు 16,17,18 తేదీలలో పీఠస్థాపన మహోత్సవాలు, దసరా ఉత్సవాలు క్రమబద్ధంగా, వైభవంగా పీఠంలో నిర్వహిస్తారు. భక్తులకు అవి పర్వదినాలు. సుదూర ప్రాంతాల నుంచి విచ్చేసి 'గాడ్' గారి ఆపన్నహస్త అభయముద్రలను స్వీకరించి కృతార్థులవుతారు. ధన్యజీవులుగా భావిస్తారు. యోగక్షేమాలను అడిగి ఆశీర్వదిస్తారు గాడ్.

వెంకట సుబ్రమణ్యం (గాడ్) గుంటూరు హిందూ కళాశాలలో బి.ఎ డిగ్రీ చేశారు. ఆయన సహపాఠులు ఇద్దరు ముఖ్యమంత్రులు- నాదెండ్ల భాస్కరరావు, కొణిజేటి రోశయ్య. డిగ్రీ పూర్తిచేసిన సుబ్రమణ్యం రాజమండ్రి సహకార శిక్షణా సంస్థలో డిప్లొమా చేశారు. శ్రీకాకుళం, యలమంచిలి, బొబ్బిలి, విజయనగరం సహకార బ్యాంకులలో చాలాకాలం పనిచేశారు.

ప్రవృత్తిరీత్యా సమాజసేవ ఆయన కిష్టం. ఉద్యోగానికి రాజీనామా చేసి కాంగ్రెస్ పార్టీలో చేరారు. 1970లో జరిగిన పంచాయతీ సమితి ఎన్నికలలో రాయవరం సమితిని





కపిలేశ్వరం జమీందార్ల వర్గానికి సంక్రమింపజేయడం వెనుక సుబ్రమణ్యం కృషి ఉంది. రాయవరం మునసబు ఆ ప్రాంతంలో మోతుబరి. ఆయనను ఎన్నికలలో ఓడించడం సాహసకార్యం. 1972లో కాంగ్రెస్ అధిష్ఠానం వెంకట సుబ్రమణ్యాన్ని ఎంఎల్‌సిగా ఎంపిక చేసే ప్రక్రియలో భాగంగా నామినేషన్ పేపర్లు సిద్ధం చేశారు.

దైవానుగ్రహం, సంకల్పం మరోలా ఉంది. 1972 ఆగస్టు 18న విజయదుర్గాదేవి ప్రత్యక్షమై సుబ్రమణ్యంకు మంత్రోపదేశం చేసింది. రాజకీయ చతురులైన పి.వి. నరసింహారావు సలహా మేరకు 'గాడ్' ఆధ్యాత్మిక జీవనానికి నాంది పలికారు. రాజకీయాలకు స్వస్తి చెప్పారు. ఆధ్యాత్మిక ప్రభంజనం మొదలైంది.

గాడ్ గారికి 1977లో ఘనంగా కనకాభిషేకం జరిపారు. ఆంధ్రదేశంలోని ప్రముఖ పండితులు, రాజకీయ మేధావుల సమక్షంలో సభ జరిగింది. దివాకర్లవెంకటావధాని, జోస్యుల జనార్దనశాస్త్రి, కూచి వీరభద్రశర్మ, ప్రకాశం పంతులు వద్ద పార్లమెంటరీ కార్యదర్శిగా పనిచేసిన క్రొవ్విడి లింగరాజు సభలో 'గాడ్'ను ప్రశంసించారు. రవాణా సౌకర్యాలు సరిగా లేని ఆ రోజుల్లో నలుమూలల నుంచి కవి పండితులు సభకు రావడం విశేషం 'గాడ్'ను ప్రశంసించారు. రవాణా సౌకర్యాలు సరిగా లేని ఆ రోజుల్లో నలుమూలల నుంచి కవి పండితులు సభకు రావడం విశేషం. 'గాడ్' గారి ప్రతిభావ్యుత్పత్తులు క్రమంగా దేశంలో ప్రచారానికి వచ్చాయి. భగవత్ చింతనతో జీవితం గడుపసాగారు.

**అభినవ విద్యాతీర్థ స్వామివారి ఆశీస్సులు**

1986లో 'గాడ్' గారు బంధుమిత్ర సమేతంగా యాత్రలకు బయలుదేరారు. కొల్లూరు మూకాంబికాలయంలో దేవిని సేవించారు. బయట (మిగతా 57వ పేజీలో)

# ఆర్ష ధర్మంపై అన్యుల విషం

## భరతజాతిని మేల్కొల్పే 'అరవిందుని' కలం

(గత సంచిక తరువాయి)

ఈ సాధనల్లో కూడా వామాచారం అనే పద్ధతిలో మద్యం, మాంసం, మైథునం లాంటివి ఉండేవి. ద్విజులు పాటించే దక్షిణాచారం కన్నా వామాచారమే మేలని, దానికన్నా పంచమకారాలతో కూడిన (మద్యం, మాంసము) మొదలైన కౌల మార్గం మేలని తంత్రసాధనలు చేసేవారి వాదం. ఈ తంత్రశాస్త్రాలు చాలా మటుకు శివుడు పార్వతికి చెప్పినట్లు ఉన్నాయి. చతుర్వేది అయినా ఈ కౌల మార్గం తెలియకపోతే కుక్క మాంసం తినేవాడికన్నా అధముడు, కుక్క మాంసం తినేవాడు ఈ తంత్ర సాధనల్ని చేస్తే బ్రాహ్మణుడి కన్నా గొప్పవాడు, అని శివుడు చెప్పినట్లు ఒక వాక్యం ఉంది. ఈ వాక్యాల్ని పట్టి చూస్తే శూద్రుల్లో తంత్ర సాధన చేసేవారు తమకు తాము బ్రాహ్మణులకన్నా శ్రేష్ఠులని భావించేవారని తెలుస్తుంది. బ్రాహ్మణులు పూజించే దేవతలనే వీరు మరొక మార్గంలో పూజించేవారు.

అలాగే సూతసంహిత అనే ప్రసిద్ధ గ్రంథంలో తంత్ర సాధనలో దీక్ష తీసుకున్న వారు వైదికుల్ని ముట్టకూడదని, వైదికులు కూడా తంత్రసాధన చేసేవారిని ముట్టకూడదని చెపుతుంది (సూతసంహిత 4-8-47).

భారతీయ సమాజమంటే కేవలం హిందూ సమాజమే కాదు. బౌద్ధుల్లో తాంత్రిక సాధనలు అనేకం ఉన్నాయి అలాగే జైనుల్లోనూ. బౌద్ధమతం దాదాపు క్రీ.శ. 10, 11 శతాబ్దాల వరకు వ్యాప్తిలో ఉండేది, మహమ్మదీయ దండయాత్రల సమయంలో క్షీణించింది అని ప్రముఖ చరిత్రకారులు చెప్పారు. జైనులు మాత్రం వ్యాపార రంగంలో ఉంటూ దాదాపు హిందూ సమాజంలో కలిసి ఉండడం వల్ల ఇప్పటికీ బౌద్ధుల కన్నా అధిక సంఖ్యలో ఉన్నట్లు చూడగలం. బౌద్ధుల్లోనూ జైనుల్లోనూ తంత్ర సాధనలు ఉన్నప్పటికీ వామాచారమార్గం బౌద్ధులలో ఎక్కువ ప్రచారంలో ఉండేది. పురుషులు, స్త్రీలు ఇద్దరూ సన్యసించి యోగి, యోగినీ అనే పేర్లతో కలిసి ఉండేవారు. రానురాను సమాజంలో గౌరవాన్ని కోల్పోయారు. టిబెటన్ బుద్ధిజంలో మాత్రం వామాచారం కన్నా యోగసాధనపై అధిక ప్రాధాన్యాన్ని ఇచ్చారు. బౌద్ధ గ్రంథాల్లో మహావైరోచన తంత్రం, వజ్రభైరవ తంత్రం మొదలైన అనేక గ్రంథాలు. అలాగే జైన సంప్రదాయంలో భైరవ పద్మావతీ తంత్రం అనేది ప్రసిద్ధమైనది.

మిషనరీలు, మార్క్సిస్టులు సమాజం కళ్లకు గంతలు కట్టి గుర్రపుబండి గుర్రాలలాగా ప్రజల్ని అజ్ఞానుల్ని చేసి ఒక హిందూమతాన్నే విమర్శించడంతో మనం కూడా ప్రాచీన సంప్రదాయాల ఉనికిని, సమాజంలో వాటి ప్రభావాన్ని మరచిపోయాం. హిందూ సమాజం అంటే కేవలం ఆర్థిక వ్యవస్థపై ఆధారపడిన నాలుగువర్ణాలు అనే భావనలో ఉన్నాం. ఆర్థిక వ్యవస్థకు అతీతంగా మనుషుల్లో అనేక కోణాలుంటాయన్న విషయాన్ని ఈ మిషనరీలు పక్కన పెట్టారు. వీరే గుర్రంబండి గుర్రాలలాగా ఒకే కోణాన్ని చూశారేమో.



తంత్రాలు సమాజంలో ఇంత ప్రచారం రావడానికి కారణమేమిటి? మహాభారత యుద్ధంలో అనేక క్షత్రియ కుటుంబాలు నశించిన తర్వాత వైదిక యజ్ఞాలు చేయించేవారు కరువయ్యారనీ, ఆ స్థితిలో కొందరు మునులు, ఋషులు ఈ తంత్రాల్ని నిర్మించి సమాజంలో అన్ని వర్గాలవారూ ఏదో ఒక ఆధ్యాత్మిక సాధనలో ఉండేట్టు చేయడానికై నిర్మించారనీ ఒక వాదం ఉంది. అలాగే కలియుగంలో మనుషులకు శ్రద్ధ, తపస్సు కరువైనందువల్ల నైతిక ప్రవర్తన తగ్గడం వల్ల కూడా ఈ శాస్త్రాల్ని చెప్పారని కూడా ఒక వాదం ఉంది. ఉపనిషత్తుల్లో చెప్పిన సిద్ధాంతాన్నే వీరి సంప్రదాయానికి తగిన విధంగా అన్వయించుకుని ఈ తాంత్రిక సాధన ద్వారా మోక్షం వస్తుంది అని తంత్రశాస్త్రాల్ని నిర్మించారు. భరతఖండంలోని దాదాపు అన్ని ప్రాంతాల్లోనూ ఈ తాంత్రిక సాధనలు ఉండేవని తెలుస్తోంది. ముఖ్యంగా బెంగాల్, అస్సాం, కాశ్మీరు, తమిళనాడులలో ఎక్కువ ప్రచారంలో ఉన్నట్లు తెలుస్తోంది. సంస్కృత మంత్రాలే కాక తమిళంలోనూ మంత్రాలు, సాధనలు ఉండేవి. శాబరతంత్రం అనే పద్ధతిలో అనేక ప్రాంతీయ భాషల్లో ఈ మంత్రాల సాధన చేసేవారని తెలుస్తుంది.

శూద్ర కులాల్లో ఆత్మవిశ్వాసాన్ని, ఆత్మగౌరవాన్ని పెంచిన మరో వ్యవస్థ యోగసాధన. బ్రాహ్మణులు ముఖ్యంగా వైదిక క్రతువుల్లో, యజ్ఞాలు మొదలైన కర్మలలో మునిగి ఉండేవారు. శూద్రకులాలవారు అనేకులు యోగసాధన చేసేవారు. ఇటీవలి కాలంవరకు ప్రతి పల్లెలోనూ బ్రాహ్మణేతరులు యోగులుగా

ఉండేవారు. వీరిలో కొన్ని సిద్ధుల్ని పొందినవారు వారుండేవారు. A Search in Secret India అనే పుస్తకంలో Paul Brunton అనే పరిశోధకుడు ఇలాంటి సాధకుల గురించి వ్రాసాడు. దాదాపు 60, 70 సంవత్సరాల క్రితం వరకు తెలుగు ప్రాంతంలోని గ్రామాల్లో గారడీవారు, మాంత్రికులు సంచారం చేసేవారు. కొన్ని తాంత్రిక సాధనల్ని ప్రదర్శించి బ్రాహ్మణులకు చేతనైతే ఆ మాయను విడిపించమని సవాలు చేసేవారు.

తాంత్రిక సాధనల్ని చేసి మహిమల్ని చూపించే వారిని బ్రాహ్మణులు కూడా ఆదరించేవారనడానికి ఈనాటికీ గొప్ప ఉదాహరణం షిర్డీసాయిబాబా. ఆయన జీవితమంతా ఇస్లాం లోనే గడిపాడు, ఇస్లాంనే బోధించాడు. ఫకీరు అని పిలువబడే వాడు. కొన్ని సిద్ధుల్ని పొందినట్లు ఆయన జీవితచరిత్రలో చూడగలం. ఆనాటి బ్రాహ్మణులే ఆయనకు శిష్యులయ్యారు. ఏ గ్రంథంలోనూ, శాస్త్రంలోనూ ప్రమాణం లేకున్నా ఆయన్ను ఒక అవతార పురుషుడని కీర్తించి పూజించారు. ఇతర అగ్రవర్ణాలవారు కూడా ఆయనకు భక్తులయ్యారు. సమాజ స్వభావం ఇలా ఉండగా బ్రాహ్మణులు మిగతా వర్ణాలను తక్కువగా చూసేవారని ముద్ర వేయడం మానవ స్వభావాన్ని, బలహీనతల్ని సరిగా అర్థం చేసుకోకపోవడమే అవుతుంది.

పాశ్చాత్య సమాజంలోని caste అనేది ఒక ఆర్థికవర్గంగా ఉండేది. ఆర్థికంగా ఉన్నత వర్గాలు, వెనుకబడిన వర్గాలు ఉండేవారు. భారతీయ సమాజంలోని వర్ణం, కులాలు ఆర్థిక స్థితిపై కాక వారి ఆధ్యాత్మిక విధానాలపై, వారి వృత్తులపై ఆధారపడి ఉండేది. బ్రాహ్మణులు పేరుకు అగ్రకులాలవారైనా చాలామటుకు పేదరికంలో ఉండేవారు. శూద్రులపై ఆధారపడి ఉండేవారు. గ్రామంలో భారతం, భాగవతం లాంటి విషయాలపై ప్రవచనాలు, జ్యోతిషం మొదలైనవి చెప్పేవారు. రాజకీయ అధికారం క్షత్రియుడిది. ధనం వైశ్యుడిది. శూద్రులు చాలా మటుకు క్షత్రియ, వైశ్య వర్ణాలకే ఎక్కువగా సహాయకులుగా ఉండేవారు. క్షత్రియ వ్యవస్థలైన సైన్యం, రాజుల ఆస్థానాలు మొదలైన వ్యవస్థల్లో ఉండేవారు. వైశ్యుల సహాయకులు వ్యవసాయం, పశుపాలన, వర్తకం మొదలైన పనుల్లో సహాయకులుగా ఉండేవారు. పేద బ్రాహ్మణులకి సేవకులుగా ఉండే అవకాశం చాలా తక్కువే. సమాజంలో కొందరు విద్యావంతులైన బ్రాహ్మణులకు రాజుల ఆస్థానాల్లో పలుకుబడి ఉండేది. అలాంటి వారికి సహాయకులుగా ఉండేవారనడం యుక్తియుక్తం.

ఆనాటి గ్రామాలు ఆర్థికంగా స్వతంత్ర ప్రతిపత్తి కల్గి ఉండేవి. గ్రామానికి కావలసిన అవసరాలు, వస్తువులు చాలా మటుకు గ్రామాల్లోనే తయారయ్యేవి. వస్త్రకారులు, స్వర్ణకారులు, ఇనుప



కర్మకారులు, బుట్టలు అల్లేవారు, కుండలు చేసేవారు, నూనెల్ని తయారు చేసేవారు, చాకలి, మంగలి మొదలైన అన్ని కులాలవారు ఆనాటి ప్రజలకు కావాల్సిన అవసరాల్ని తీర్చేవారు. బ్రిటీషు పరిపాలన సమయంలో ఈ వ్యవస్థ దెబ్బ తినింది. ముఖ్యంగా చేనేత పనివారు దెబ్బతిన్నారు. ముడిసరుకు అంతా బ్రిటన్‌కు తీసుకువెళ్లటంతో ఇక్కడి పరిశ్రమలు, గ్రామీణ పరిశ్రమలతో పాటు అన్నీ దెబ్బతిన్నాయి. పారిశ్రామిక రంగంలో ఉన్న అనేక కులాలు పేదరికంలోకి నెట్టబడ్డాయి. హిందూమతం లోని కులవ్యవస్థ ఈ పేదరికానికి కారణమంటూ బ్రిటీషు పాలకులు తమ తప్పిదాన్ని హిందూధర్మంపై మోపారు. పండిట్ నెహ్రూ లాంటి పండితుడు కూడా హిందూమతం పేదరికానికి కారణం అని పలుచోట్ల వ్యాఖ్యానించడం ఆశ్చర్యకరం. బ్రిటీషు పాలనకు ముందు భారత GDP ప్రపంచ GDP లో 30% ఉండేది. బ్రిటీషువారు వదిలేసరికి ఇది 2 శాతానికి దిగజారింది. రెండవ ప్రపంచ యుద్ధకాలంలో ఆహారధాన్యాల్ని మొత్తం బ్రిటన్‌కు తరలించడం వల్ల కొన్ని లక్షల బెంగాలీలు ఆకలి చావులు చచ్చారు. వీటన్నింటిని చూసిన పండిట్ నెహ్రూయే హిందూమతంపై నిందమోపాడు. భారత చరిత్రలోని ఒక ఉజ్జ్వల తరుణంలో సనాతనధర్మాన్ని మరింత కృంగదీసి ధర్మ ద్వేషుల వాదనలకు బలాన్ని కల్పించడం నెహ్రూ చేసిన పెద్ద తప్పిదం.

## స్వాతంత్ర్యం తర్వాత కులరాజకీయాలు

స్వాతంత్ర్యం తర్వాత ప్రభుత్వాలు సనాతనధర్మాన్ని నిలపడానికి ఎలాంటి ప్రయత్నం చేయకపోగా బ్రిటీషు పాలకులు హిందూమతాన్ని క్షీణింపచేయడానికి సృష్టించిన చట్టాల్ని అలాగే కొనసాగించారు. (సశేషం)

# కంచిస్వామి దివ్య చరిత్ర 'గిని - అద్వైత గని'

(గత సంచిక తరువాయి)

### చంద్రమౌళీశ్వరశాస్త్రిగారి మాట

ఒకసారి చంద్రమౌళీశ్వరశాస్త్రి గారు చెబుతున్నారు. మహాస్వామి వారు కళ్ళుమూసుకొని ధ్యాననిష్ఠలో కూర్చుని ఉన్నారు. ఒక్కొక్కసారి పాములు ఎగురుతాయి. మీరెప్పుడైనా చూసారో లేదో!... అకస్మాత్తుగా, ప్రవాహంలో వస్తున్న ఓ పాము ఎగిరి ఆయన మెళ్ళో పడింది. ఆయనేమి కదలల్లేదు. కానీ పక్కనున్న ఈయన (చంద్రమౌళీశ్వరశాస్త్రి గారు) చాలా కంగారు పడిపోయి కేకలేశారు. ఆయన (మహాస్వామి వారు) బహిర్ముఖులయ్యారు.

ఆ పాము జారి వెళ్ళిపోయింది. ఎందుకు అరిచావు అని అడిగారు మహాస్వామివారు. అయ్యా! పాము ఎగిరి మీ మెళ్ళో పడింది అని అన్నారు చంద్రమౌళీశ్వరశాస్త్రిగారు. ఫ్చ్....ఇందులో ఉన్నవాడు అందులో ఉన్నాడు. దానికి అంత అల్లరి ఎందుకు అన్నారు మహాస్వామివారు. నాలా నోటితో చెప్పడం చాలా తేలిక. కానీ అనుభవంలో అలా నిలబడడం చాలా కష్టం. అనుభవంలో అలా నిలబడాలంటే, ఆ స్థాయికి వెళ్ళినవాడే అలా ప్రవర్తించగలడు తప్పా, వెళ్ళనివాడు నాలా పుస్తకం వ్రాయగలడు లేదా నాలా చెప్పగలడంతే. తప్పా అలా అనుభవించలేను. కాబట్టి ఆ మహానుభావుడి నోటివెంట ఏ మాటలు వస్తూ వుంటాయో, అవి సమస్త తత్త్వమునకు సారమయ్యి ఉంటాయి. అంత గొప్ప తత్త్వాన్ని ఆయన ప్రతిపాదన చేస్తూ ఉంటారు. ఎప్పుడు ఏ మాట మాట్టాడనివ్వండి, అది ఆ సందర్భానికి వారితో మాట్లాడినట్టుగా ఉంటుంది. కానీ, దానిలో ఒక తత్త్వం ఉంటుంది. అర్థమైనవాడికే అర్థమవుతుంది.

### కామాక్షి దర్బార్

ఒకప్పుడు మహాస్వామివారి దగ్గరికి ఒకాయన వచ్చాడు. అతను ఏదో మాట్లాడుతున్నాడు. మహాస్వామివారు ఎదో పన్లో ఉన్నారు. ఇతనేమో ఆపట్లేదు, అదేపనిగా మాట్లాడుతున్నాడు. మహాస్వామివారు అన్నారూ...తొందరగా వెళ్ళు కామాక్షి దర్బార్ అవుతోంది అన్నారు. ఆయన గబగబా కామాక్షిదేవి గుళ్ళోకి పరుగెత్తాడు. ఎక్కడో పీఠంలో చెప్పారీమాట. తొందరగా వెళ్ళు కామాక్షి దర్బార్ అవుతోంది... అయిపోతుంది...అన్నారు. ఆయన గబగబా పరుగెత్తుకుంటూ వెళ్ళాడు దర్బారేమి అవ్వట్లేదక్కడ. మామూలుగా గుడి ఉందంతే. దర్బార్ అంటే అమ్మవారు బయటకొచ్చి ఏదో సభతీర్చాలి. అలా ఏం లేదు. ఆయన తెల్లబోయాడు. మహాస్వామి నోటివెంట ఏం అబద్ధం రాదుగా? అదేమిటి కామాక్షి దర్బార్ అవుతోంది... తొందరగా పరుగెత్తు అన్నారు నన్ను. ఆలోచించాడు...ఆ రోజు ఎమ్.ఎస్. సుబ్బులక్ష్మిగారక్కడ కచేరీ చేస్తూ 'దర్బార్ రాగం'లో కీర్తన చేస్తున్నారు.



తూములూరి
మోహన్ కుమార్


ఆయనకెలా తెలుసు? ఆమాట నన్నడక్కండి మళ్ళీ మళ్ళీ... ఆ స్థాయి కెళ్ళిన వారికి తెలియకపోవడమన్న మాట ఉండదు. తెలుస్తుంది. కాబట్టి వారి నోటివెంట వచ్చేటటువంటి మాటలు అంత గొప్ప తత్త్వప్రతిపాదకములై ఉంటాయి. కామాక్షి దర్బార్ ఉంది... నిజమే... ఆ తల్లి పద్మాసనమేసుకొని ఇలా చూస్తూ ఎదురుకుండా సభామండపంలో ఎవడొచ్చి నిలబడి ఆర్తితో మాట్లాడినా వినడానికి సిద్ధంగా లేదూ...! తలుపులేయ లేదుగా ఇంకా... గుడికి? ఆవిడ దర్బార్లో ఉంది, ఇన్ని కోరిక లుంటే వెళ్ళి ఆవిడతో చెప్పు... అనడానికి, కామాక్షి దర్బార్లో ఉంది... ఆయన నోటిమాటా అబద్ధం కాకూడదు. ఖచ్చితంగా అదే సమయంలో ఎమ్.ఎస్. సుబ్బులక్ష్మి గారు దర్బార్ రాగంలో కీర్తన చేశారు.

కామాక్షి దర్బార్ లోనే ఉందిగా, దర్బార్ రాగం పాడుతుండగా వింటోంది. అది "యస్య రసజ్ఞచ తాత్త్వికర్థజ్ఞా"వారి నోటివెంట వచ్చేటటువంటి మాటలు ఏవైతే ఉంటాయో, అవి అంత గొప్పగా తత్త్వాన్ని ఆవిష్కరిస్తూ ఉంటాయి. "చిత్తం, దేవ్యాయత్తం" వారి మనస్సు ఎప్పుడు అమ్మవారి చుట్టూ తిరుగుతూ ఉంటుంది. ఎలా తిరుగుతూ ఉంటుంది? అమ్మవారంటే శక్తి. ఆయన ఏంచేస్తూ ఉండనివ్వండి! అమ్మవారిని లోపల స్మరిస్తూ ఉంటారు. ఇలా అన్నారనుకోండి! ఈ చెయ్యి కదిలింది అంటే ఇందులో శక్తి 'కామాక్షి'. మాట మాట్లాడాను, మాట్లాడ్డానికి శక్తి 'కామాక్షి'. ఈ కన్ను కనపడుతోంది...'కామాక్షి' అనుగ్రహం. అన్నీ..."కామాక్షి" "కామాక్షి" "కామాక్షి" "కామాక్షి". అందుకే ఆయన వెడుతున్న పల్లకీలో కూడా ఆయనకి ఆ "కామాక్షి" నామం వినపడుతూ వుండాలి. ఎప్పుడు "కామాక్షి" "కామాక్షి" అని వినపడుతూ వుండాలి.

'మనసు' ఎప్పుడూ "చిత్తం, దేవ్యాయత్తం"... అమ్మవారి చుట్టూ తిరుగుతూ ఉంటుంది. అలా అమ్మవారి చుట్టూ ఉన్నటు వంటివాడు ఏమవుతాడు? అమ్మవారికి గొప్ప భక్తుడై ఉంటాడు. అంత గొప్ప భక్తుడై ఉన్నాడనుకోండి! ఆయన నోటివెంట ఒక మాట వచ్చినా...ఆయనలో ఏదైనా ఒక

సంకల్పం కల్పినా... ఎవరు తీర్చాలి? ఆవిడే తీర్చాలి. ఎందుకని?... ఆయన మనసెప్పుడూ ఆవిడచుట్టూ తిరుగుతూ ఉంటుంది. అంతకన్నా ఉపాసన ఏమిటి? 'ఉపాసన' అంటే దగ్గరగా కూర్చుండుట...'ఆసనం' అంటే కూర్చోవడం. 'ఉపాసన' దగ్గరగా కూర్చుండుట. అమ్మవారి ఉపాసన...ఎప్పుడూ అమ్మవారిని మనస్సులో స్మరిస్తూ ఉండటం.


ఎప్పుడూ ఆవిడనే స్మరించేవాడి మనస్సులోంచి ఏదో ఒక సంకల్పం వచ్చిందనుకోండి, ఆ సంకల్పం నిజమయ్యేటట్టు ఎవరికి చెయ్యాలి? ఆవిడే చెయ్యాలి. అందుకే ఒక్కటి బాగా పట్టుకోండి మీరు. "యోగి సత్యం చెప్పాడు అని అనకూడదు." "యోగి చెప్పినది సత్యమవుతుంది" అనాలి. అంతేగాని, యోగి సత్యం చెప్పాడండి అనకూడదు. ఈవాళ సాయంకాలం చాలా పెద్ద వానొస్తుంది అన్నాడనుకోండి! నిజంగా వాన రావాలనిలేదు. ఆయనన్నాడు కాబట్టి వస్తుంది. లేకపోతే ఆయనమాట అబద్ధం అవుతుంది. అందుకు కామాక్షి దర్బార్లో ఉంది అంటే, ఆవిడ దర్బార్ రాగం పాడింది. అమ్మవారు చేస్తుందది. యోగి మాట్లాడినది సత్యమవుతుంది. నిజాంగా అల్పాయుర్దాయం ఉన్నవాడిని ఆయన 'దీర్ఘాయుషుమాన్భవ' అన్నారనుకోండి, వాడు దీర్ఘాయుర్దాయాన్ని పొందుతాడంతే.





ఎందుకంటే అమ్మవారు నిజం చేస్తుంది దాన్ని. ఏదో ఆయన ఓ ఆశీర్వచనం చేశారను కోండి, ఆశీర్వచనం నిజమై తీరవలసిందే. అంతేకాని ఆయన నోటివెంట వచ్చినమాట కానీ, ఆయన మనసులోంచి వచ్చిన సంకల్పం కానీ పోవటానికి వీల్లేదు. మీరందుకే చూడండి కొన్ని కొన్ని ఆశ్చర్యకరమైన సంఘటనలు జరిగాయి. అదీ మహానుభావుడు పరబ్రహ్మమై ఈ భూమిమీద తిరుగాడారు అందుకే "నడిచే దేవుడన్న" కీర్తిని పొందారు. ఆ పేరు పెట్టి పిలుపిచ్చుకున్నవారెవరు లేరు. ఆయనకొక్కరికే ఆ బిరుదు నామం.

(సశేషం)

('గిని..అద్వైతగని' పుస్తకం నుంచి)






# దక్షిణామ్నాయ శృంగేరీ శ్రీశారదాపీఠ వైభవం

(గత సంచిక తరువాయి)

అటువంటి కోరికతో ఎవరైనా మనల్ని సమీపిస్తే, వెంటనే మనం రక్షణకై చాలా మంది రక్షకభటులను మన చుట్టూ పెట్టుకుంటాం. శ్రీ శంకరుల సమాధానం మాత్రం విశిష్టంగా ఉన్నది. తనను మరునాడు కలుసుకొమ్మని భైరవునికి సూచించారు. ఇంకా ఇలా చెప్పారు. ''నా శిష్యులు చుట్టుప్రక్కల ఉన్నప్పుడు రావద్దు. వాళ్ళు నీపనిని పూర్తి చేసుకోనివ్వరు. మధ్యాహ్న స్నానానికై వాళ్ళు బయలుదేరినప్పుడు నేను తరువాత వస్తానని ఆగిపోతాను. నేను ఒంటరిగా ఉంటాను. అపుడు నీవు వచ్చి నీ పనిని పూర్తి చేసుకో'' అని చెప్పినట్లు మరొకరు చెప్పడం మనం ఊహించగలమా?

మరునాటి మధ్యాహ్నం శిష్యులు స్నానానికై వెళ్ళారు. శిష్యులతో శ్రీశంకర భగవత్పాదులు ఉగ్రభైరవుని రాక గురించి ఏమీ చెప్పలేదు. వానికి సహాయం చేయాలని ఆయన ఉద్దేశం. ఉగ్రభైరవుడు వచ్చే సమయానికి ఆయన ఆనందంతో సమాధిలో నిమగ్నులైపోయారు. శ్రీ శంకరులను చూసిన ఉగ్రభైరవునికి చాలా సంతోషమయింది. తన కోరికను తీర్చుకోవడానికై కత్తిని చేత పట్టుకున్నాడు. అయితే ఈశ్వరేచ్ఛ మరో విధంగా ఉన్నది. ఉగ్రభైరవుని ఆశయం పూర్తి కాలేదు. అనుకోకుండా శ్రీ నరసింహస్వామి ఆవహించిన పద్మపాదాచార్యులు అక్కడకు వచ్చి ఉగ్రభైరవుని మీద పడి గోళ్ళతో చీల్చి సంహరించాడు. శ్రీ నరసింహస్వామి చేసిన గర్జనకు శ్రీ శంకరులు సమాధి నుండి బయటకు వచ్చారు.

ఒక స్తంభం నుండి గర్జనతో భయంకర రూపంతో వెలువడి హిరణ్యకశిపుని సంహరించిన శ్రీ నరసింహస్వామి వర్ణన శ్రీమద్భాగవతం సప్తమ స్కంధంలో ఉన్నది. హతుడైన ఉగ్రభైరవుని దేహాన్ని ఒకవైపు, ఉగ్రనరసింహ రూపుడైన పద్మపాదుని మరోవైపు చూచిన శ్రీ శంకరులు శ్రీ నరసింహస్వామిని స్తుతించి, ప్రశాంత వాతావరణాన్ని పునఃప్రతిష్ఠించారు. ''నేను సమాధిలో ఉన్నాను. నేను అనుమతించినట్లుగా ఉగ్రభైరవుడు నా శిరస్సును ఖండించలేదే?'' అని శ్రీ శంకరులు ప్రశ్నించారు. ''అది ఈశ్వరేచ్ఛ కానందున ఉగ్రభైరవుడు తన లక్ష్యాన్ని సాధించలేకపోయా''డని పద్మపాదులు సమాధానం చెప్పారు.

అంతటి సహనం ఇంకెవరు ప్రదర్శించగలరు? మనమందరం అటువంటి ఓర్మిని అలవరచుకోవాలి. క్రోధాన్ని జయించడానికి సహనమొక్కటే మనకు తోడ్పడుతుంది. ఒక సంఘటనను పరిశీలిద్దాం. మా పరమేష్ఠి గురువైన శ్రీ సచ్చిదానంద శివాభినవ నృసింహభారతీ మహాస్వాముల వారి హయాంలో ఇది జరిగింది. శ్రీవారు ఒకచోట మకాం చేసియున్నప్పుడు ప్రభుత్వ అడవుల శాఖకు చెందిన అధికారి ఒకరు ఆయనను కలుసుకోవడానికి వచ్చాడు. క్షేమ సమాచారాలు అడిగి భక్తులను పంపించడం వారికి అలవాటు లేదు. ఆ అధికారికి పరమసత్యాన్ని తెలుసుకోవాలనే ఆలోచన ఉన్నదో లేదో అని గ్రహించడానికి శ్రీవారు ఇలా ప్రశ్నించారు. ''మీకెప్పుడైనా కోపం వస్తుందా?'' అధికారి అప్పుడప్పుడు సహనాన్ని కోల్పోతానని చెప్పాడు.

ఆచార్యపాదులు : మీకు కోపం వస్తే ఏమి చేస్తారు?

అధికారి: నా క్రింద పనిచేసే వారిపై ఆ కోపాన్ని ప్రదర్శిస్తాను.

ఆచార్యపాదులు : అప్పుడు అతను ఏమి చేస్తాడు?

అధికారి : అతను తన క్రింద పనిచేసే వారిపై తన కోపాన్ని ప్రదర్శిస్తాడు.

ఆచార్యపాదులు: ఒక మనిషి క్రోధం ఎందరిని ఇబ్బంది పెడ్తుందో చూశారా?

అధికారి తన తప్పును అంగీకరించి, తాను ఏమి చేస్తే బాగుంటుందో వివరించమని ప్రార్థించాడు. ఆచార్యపాదులు ఇలా బదులిచ్చారు. "మూడు రకాల మనుష్యులున్నారు. కొందరు తమకు కోపం రావచ్చని ముందే గ్రహిస్తారు. మరికొందరు వచ్చే కోపాన్ని ముందు పసిగట్టలేరు కాని కోపం వచ్చిన తరువాత తమకు కోపం వచ్చిందని గ్రహించగలరు. ఇంకొందరు తమ కోపాన్ని చాలా ఆలస్యంగా అంతా అయిపోయింతర్వాత నష్టం జరిగిన తరువాత గుర్తిస్తారు. ఈ ముగ్గురిలో నీవు ఏ వర్గానికి చెందుతావు?"

అధికారి తాను మొదటి వర్గానికి చెందననీ, రెండవ వర్గానికి చెందుతానని చెప్పగా ఆచార్యపాదులు మొదటి వర్గంలో చేరడానికి ప్రయత్నించమనీ, కోపం వస్తోందనుకున్నప్పుడు, "కోపం తెచ్చుకోవడం ఎంతవరకు సమంజసం?" అని ఆలోచించి కోపాన్ని ఆపుకోవాలనీ చెప్పారు. ఆ అధికారి జగద్గురువులకు సాష్టాంగ ప్రణామ మొనరించి సెలవు తీసుకుని తన మకాం వైపు బయలుదేరాడు. ఆయన తమ వసతిని చేరుకునేటప్పటికి మధ్యాహ్నమయింది. అందువలన విపరీతంగా ఆకలివేయసాగింది. అయితే దురదృష్టం కొద్దీ ఆయన వంటవాడు రెండు రొట్టెలను మాత్రమే చేశాడు. అది తెలియగానే ఆయనకు కోపం వచ్చి సహనం కోల్పోయి వంటవానిపై కేకలు వేయబోయాడు. అయితే ఆచార్యపాదుల సలహా జ్ఞాపకం వచ్చింది. వెంటనే వంటవాడిని పిలిచి రెండు రొట్టెలను మాత్రమే తయారుచేయడానికి కారణమడిగాడు. ఇంట్లో పిండి లేదని, పిండి తీసుకురావడానికి వెళ్ళిన నౌకరు ఇంకా రాలేదనీ, కాని అధికారి ఆకలిని కొంచమైనా తగ్గించవచ్చునని తాను ఇంట్లో ఉన్న పిండిని ఉపయోగించి రెండు రొట్టెలు తయారుచేశానన్నాడు. వంటవాడు తానేమీ తినలేదు. వస్తువులు వచ్చిన తరువాత రొట్టెలు తయారుచేసుకుని తినాలి. అధికారి తన వంటవానిని మెచ్చుకోకుండా ఉండలేకపోయాడు. అమాయకుడైన తన వంటవానిపై అనవసరంగా కోపం తెచ్చుకోకుండా జగద్గురువుల సలహా తనను కాపాడిందని సంతోషించాడు.

(శ్రీ శృంగేరీ జగద్గురు శంకర సేవా సమితి,
ఆంధ్రప్రదేశ్ వారి సౌజన్యంతో)

---

**51వ పేజీ తరువాయి... వెదురుపాక గాడ్ శివైక్యం...**

విశ్రమించారు. అక్కడ ఒక విచిత్ర సన్నివేశం భగవత్ సంకల్పంగా జరిగింది. శృంగేరి పీఠాధిపతులు శ్రీశ్రీశ్రీ అభినవ విద్యాతీర్థ స్వామి 'గాడ్'ను ఆశీర్వదించారు. వ్యక్తిగతంగా మాట్లాడడానికి శృంగేరి పీఠానికి ఆహ్వానించారు. "దుర్గాదేవి కృపాకటాక్షాలకు పాత్రమై దేవిని సాక్షాత్కరింపజేసుకున్న మీరు ధన్యజీవులు. వెదురుపాకలో విజయదుర పీఠం నెలకొల్పండి" అని సూచించారు.



అది 1989 జూన్ 16. వెదురుపాకలో విజయదుర్గాదేవి విగ్రహ ప్రతిష్ఠాపనకు స్వయంగా శృంగేరి పీఠాధిపతి శ్రీశ్రీశ్రీ భారతీతీర్థ స్వామి విచ్చేశారు. అదే జూన్ నెలలో 2026లో గాడ్ శివైక్యం-శ్రవణానక్షత్రం, శుక్రవారం రాత్రి చెందడం భగవత్ లీల. సామాన్యులకు అందుబాటులో అమ్మ కరుణావృష్టి కురిపిస్తూ ఉంది.

**కోవిడ్ మహమ్మారిలో అన్నార్తులకు బాసట**

కోవిడ్ మహమ్మారి పెనుభూతంలా దేశాన్ని ఆవరించినవేళ విజయదుర్గాపీఠం ఎందరినో అన్నార్తులను రక్షించింది. 50 సంవత్సరాలు భక్తుల పాలిట కొంగుబంగారంగా 'గాడ్ గురువు' నిలిచారు, భక్తులు కొలిచారు. ఆయన ప్రవచనాలలో జనులను సమ్మోహితులను చేయలేదు. సామాన్య వ్యక్తివలె జీవిస్తూ 'సమాజసేవ' ప్రధానంగా భక్తులకు ప్రబోధించారు. కుగ్రామాన్ని భక్తజన బృందావనంగా మలచారు. ఆధ్యాత్మిక సుందర ప్రదేశంగా తీర్చిదిద్దడంలో సోదరుడు బాపిరాజు- రామన్నకు లక్ష్మణ స్వామివలె తోడ్పడ్డారు. 'బాబీ' రామునకు హనుమన్నవలె కంటికి రెప్పలా కాపాడారు.

'గాడ్' గారు ప్రబోధించిన ఆధ్యాత్మిక సూత్రాలు పీఠానికి ఊపిరులు. భక్తులపాలిట కల్పద్రుమం విజయదుర్గాదేవి పీఠం కలకాలం వర్ధిల్లాలి. పుట్టపర్తిలో బాబా లేకపోయినా భక్తుల రాకపోకలు నిలిచిపోలేదు. అదే రీతిలో 'గాడ్' గారి స్మృతివనంగా వెదురుపాక కర్మస్థలి విలసిల్లుతుంది.

**- డా. రేవూరు అనంత పద్మనాభరావు**

# ధర్మజిజ్ఞాస


పి. భాస్కరయోగి

(గత సంచిక తరువాయి)

**259. గ్రహణ సమయంలో పాటించాల్సిన నియమాలేమిటి?**

గ్రహణాలు రెండు - 1. సూర్యగ్రహణం 2. చంద్రగ్రహణం.

గ్రహణ సమయంలో గర్భవతులైన స్త్రీలు ఏదైనా కూరగాయల్లాంటివి కోసినా పుట్టిన బిడ్డకు 'గ్రహణం మొర్రి' ఏర్పడడం మనం చూస్తున్నాం. గ్రహణం మన శాస్త్ర ప్రకారం అశౌచం (మైల) వంటిది. గ్రహణ సమయంలో ఉండే ప్రకృతి తత్వం ఆహారపదార్థాలపై, మనుషులపై ప్రభావం చూపిస్తుంది. అందుకే దర్భలను ఆహారపదార్థాల్లో, నీళ్లల్లో వేస్తారు. అలాగే దేవాలయాలను కూడా గ్రహణ సమయంలో మూసేస్తారు. గ్రహణం విడిచిన తరువాత ఆలయబింబశుద్ధి చేసి మళ్లీ దేవాలయ సందర్శనకు వీలుగా తెరుస్తారు. మనం కూడా స్నానం చేసి పరిశుద్ధులమవ్వాలి. ఎవరికైనా గురూపదేశ మంత్రం ఉంటే ఈ సమయంలో పునశ్చరణ చేస్తే విశేష ఫలితాలుంటాయని పెద్దలంటారు.

గ్రహణ సమయంలో ఎందుకు దేవాలయాలు మూసివేస్తారో అందులోని అంతరార్థం ఏమిటో - పూజ్య ఆచార్య శ్రీ ఎక్కిరాల భరద్వాజ ఇలా తెలియజేస్తున్నారు -"అటు అనంత విశ్వానికి, ఇటు మానవుడికి పరమాత్మ తత్త్వంలో ఐక్యమున్నది. సామరస్యమున్నది. దానిని వివరించడంలో అండాండ పిండాండాలకు పోలిక, సంబంధము వివరించారు ఋషులు. అలాగే జ్యోతిష్య శాస్త్రజ్ఞుల ప్రకారం సూర్యుడు ఆత్మకారకుడు. చంద్రుడు మనః కారకుడు; భూమి దేహానికి కారకురాలు. ఏ గ్రహణమైనా మనస్సు అంతర్ముఖమై ధ్యానస్థమవడానికి సంకేతం. కనుక అప్పుడు పూజాదికాలు చేస్తూ మన మనస్సును, ఇష్టదైవాన్ని బహిర్ముఖం చేయకూడదు. ఇష్టదైవం కూడా ధ్యానస్థుడై ఉంటాడని భావం. పూజించడమంటే దైవం యొక్క దృష్టిని మన మీదకు భేదభావంతో మరల్చుకొనడమన్నమాట. గ్రహణమపుడు మనం కూడా ధ్యానస్థులమై అభేదభావంతో ఆయనతో తాదాత్మ్యానికి యత్నించాలి.



**261. గ్రామదేవతలంటుంటారు కదా! వివరించండి?**

మన సంప్రదాయంలో ప్రతీతత్వాన్ని ఒక స్వరూపంగా ఆరాదిస్తాం. 'చదువు'ను సరస్వతీదేవిగా, ధనాన్ని లక్ష్మీదేవిగా, శక్తిని పార్వతీదేవిగా భావించి పూజిస్తాం. అదేవిధంగా చెట్లను (అశ్వత్థ, వేప) పాములను (సుబ్రహ్మణ్యస్వామి) పక్షులను (గరుత్మంతుడు), జంతువులను (కాలభైరవ) గజాన్ని (వినాయకుడు), వానరాన్ని (హనుమంతుడు), గోవులను ఆరాధనా భావంతో మన సంస్కృతిలో మమేకం చేసుకొన్నాం. అయితే ఈ గ్రామ దేవతలందరికీ మూలం పురాణాల్లో చెప్పబడ్డ దేవతలే. జానపదులు వీళ్లచుట్టూ రకరకాల గాథలు కల్పించినప్పటికీ ఈ దేవతల మూల స్వరూపం మాత్రం శాస్త్రాల్లో చెప్పబడిందే. గ్రామదేవతల్లో ఎక్కువగా 'దేవీ స్వరూపం' కన్పిస్తుంది. ఉదాహరణకు కొన్ని పేర్లు - వాటి మూలాలు చూద్దాం.

1. ఎల్లమ్మ : ఎల్ల = అంతటా వ్యాపించింది అని అర్థం. ఆమెనే సకల చరాచర స్వరూపిణి అయిన అమ్మ అని అర్థం చేసుకోవచ్చు. 2. పోలేరమ్మ = పాలన చేసే అమ్మ లేదా పొలిమేర (గ్రామ సరిహద్దు)ను రక్షించే అమ్మ. 3. మైసమ్మ : మహిషాసురమర్ధిని అయిన అమ్మ. 4. ఈదమ్మ = ఆది (మొదటి) అమ్మ అని అర్థం. దేవిని సృష్టికి మూలంగా దేవీశాస్త్రాలు చెబుతున్నాయి. ఆదమ్మ, ఆదయ్య అనే పేర్లు ఇప్పటికీ గ్రామాల్లో ఉన్నాయి. 5. కంకాళమ్మ = ఈమె నీళ్లల్లో (బావుల్లో) ఉండే దేవత. 6. బాలమ్మ = బాలత్రిపురసుందరి అని అమ్మవారికి పేరు. 7. ఐలమ్మ = ఏలే అమ్మ (పాలించే అమ్మ) అని అర్థం. ఇప్పటికీ ఐలమ్మ, ఐలయ్య అనే పేర్లు ప్రసిద్ధంగా వినబడుతున్నాయి. అలాగే గ్రామ దేవతలకు నైవేద్యం పెట్టే 'బోనం' అనే పదం 'భోజనం' అనే మాట 'శివోహం' అన్న పదం నుంచే వచ్చింది. గ్రామాల్లో పూనకం (ఏదైనా దేవత ఆవహించడం) 'శిగం' అనే మాట 'శివోహం' అన్న పదం నుంచే వచ్చింది. ఈ గ్రామదేవతలు మన సంస్కృతిలో అంతర్భాగమే. ఆగమశాస్త్ర నియమాలు, అర్చనాది విధులు జానపదులకు తెలియనందున పూర్వం ఈ దేవతల్ని ఏర్పాటు చేసుకొని ఆరాధించారు.

(సశేషం)

# దర్శనమ్

## ఆధ్యాత్మిక వార్తామాసపత్రిక

శ్రీ పరాభవ సం ॥ ఉత్తరా/
దక్షిణాయణం గ్రీష్మ ఋతువు
నిజజ్యేష్ఠ బ.పాడ్యమి - ఆషాఢ బ.విదియ

## జూలై JULY 2026

ఉ: ఉదయం, మ: మధ్యాహ్నం, సా: సాయంత్రం, రా: రాత్రి, తె: తెల్లవారుఝామున, వ: వర్జ్యము, శే.వ.: శేషవర్జ్యము, ల: నుండి

### పండుగలు

3 సంకష్టహరచతుర్థి
6 పునర్వసుకార్తె
10 స్మార్తులకు ఏకాదశి
11 శ్రీవైష్ణవులకుఏకాదశి
12 మాసశివరాత్రి
16 జగన్నాథ రథయాత్ర
17 కర్కాటకసంక్రమణం
దక్షిణాయనపుణ్యకాలం
21 పుష్యమికార్తె
25 సర్వేషాం
తొలిఏకాదశి
చాతుర్మాస్యవ్రతము
ప్రారంభం
29 వ్యాస,గురు పూర్ణిమ

| | | | | | |
|---|---|---|---|---|---|
| S U N ఆది<br>రాహు కాలం సా. 4.30 మొ 6.00<br>యమగండ కాలం మ. 12.00 మొ 1.30<br>వారదుర్ముహూర్తం సా. 4.24 మొ 5.12 | | **5**<br>పంచమి ఉ.9.42<br>శతభిషం మ.12.23<br>వ.సా.6.58ల8.35 | **12**<br>త్రయోదశి రా.8.47<br>రోహిణి ఉ.6.57<br>త.మృగశిరరా.తె.5.17<br>వ.మ.11.52ల1.34 | **19**<br>పంచమి ఉ.7.26<br>ఉత్తర రా.10.22<br>శే.వ.ఉ.7.08 | **26**<br>ద్వాదశి మ.1.27<br>జ్యేష్ఠ ఉ.8.15<br>వర్జ్యంలేదు |
| M O N సోమ<br>రాహు కాలం ఉ. 7.30 మొ 9.00<br>యమగండ కాలం ఉ. 10.30 మొ 12.00<br>వారదుర్ముహూర్తం మ. 12.24 మొ 1.12<br>మ. 2.48 మొ 3.36 | | **6**<br>షష్ఠి ఉ.9.24<br>పూర్వాభాద్రమ.12.45<br>వ.రా.10.19ల11.55 | **13**<br>చతుర్దశి సా.6.15<br>ఆరుద్ర రా.3.33<br>వ.మ.1.05ల2.34 | **20**<br>షష్ఠి ఉ.6.54<br>హస్త రా.10.52<br>వ.ఉ.6.57ల8.35 | **27**<br>త్రయోదశి మ.3.30<br>మూల ఉ.10.54<br>వ.ఉ.9.02ల10.54<br>తి.రా 9.31ల11.17 |
| T U E మంగ<br>రాహు కాలం మ. 3.00 మొ 4.30<br>యమగండ కాలం ఉ. 9.00 మొ 10.30<br>వారదుర్ముహూర్తం ఉ. 8.24 మొ 9.12<br>రా. 10.48 మొ 11.36 | | **7**<br>సప్తమి ఉ.8.37<br>ఉత్తరాభాద్రమ.12.19<br>వ.రా.12.30ల2.05 | **14** ●<br>అమావాస్య మ.3.53<br>పునర్వసు రా.2.02<br>వ.మ.2.48ల4.18 | **21**<br>సప్తమి ఉ.6.52<br>చిత్త రా.11.52<br>వ.ఉ.7.07ల8.47<br>తి.రా.తె 5.44ల | **28**<br>చతుర్దశి సా.5.25<br>పూర్వాషాఢ మ.1.26<br>వ.రా.10.05ల11.50 |
| W E D బుధ<br>రాహు కాలం మ. 12.00 మొ 1.30<br>యమగండ కాలం ఉ. 7.30 మొ 9.00<br>వారదుర్ముహూర్తం ఉ. 11.36 మొ 12.24 | **1**<br>బ.పాడ్యమి ఉ.6.07<br>పూర్వాషాఢ ఉ.6.14<br>వ.మ.2.52ల4.37 | **8**<br>అష్టమి ఉ.7.25<br>త.నవమి రా.తె.5.52<br>రేవతి మ.12.20<br>వర్జ్యంలేదు | **15**<br>శు.పాడ్యమి మ.1.37<br>పుష్యమి రా.12.38<br>వ.ఉ.9.29ల10.59<br>తి.రా.1.28ల3.35 | **22**<br>అష్టమి ఉ.7.20<br>స్వాతి రా.1.21<br>శే.వ.ఉ.7.26 | **29** ○<br>పూర్ణిమ సా.6.58<br>ఉత్తరాషాఢ మ.3.40<br>వ.రా.8.04ల9.48 |
| T H U గురు<br>రాహు కాలం మ. 1.30 మొ 3.00<br>యమగండ కాలం ఉ. 6.00 మొ 7.30<br>వారదుర్ముహూర్తం ఉ. 10.00 మొ 10.48<br>మ. 2.48 మొ 3.36 | **2**<br>విదియ ఉ.7.41<br>ఉత్తరాషాఢ ఉ.8.25<br>వ.మ.12.48ల2.31 | **9**<br>దశమి రా.3.54<br>అశ్విని ఉ.11.14<br>వ.ఉ.7.20ల8.52<br>తి.రా.8.21ల9.52 | **16**<br>విదియ ఉ.11.34<br>ఆశ్లేష రా.11.30<br>వర్జ్యంలేదు | **23**<br>నవమి ఉ.8.18<br>విశాఖ రా.3.34<br>వ.ఉ.7.23ల9.08 | **30**<br>బ.పాడ్యమి రా.8.11<br>శ్రవణం సా.5.34<br>వ.రా.9.54ల11.36 |
| F R I శుక్ర<br>రాహు కాలం ఉ. 10.30 మొ 12.00<br>యమగండ కాలం మ. 3.00 మొ 4.30<br>వారదుర్ముహూర్తం ఉ. 8.24 మొ 9.12<br>మ. 12.24 మొ 1.12 | **3**<br>తదియ ఉ.8.51<br>శ్రవణం ఉ.10.14<br>వ.మ.2.32ల4.13 | **10**<br>ఏకాదశి రా.1.41<br>భరణి ఉ.10.01<br>వ.రా.9.17ల10.47 | **17**<br>తదియ ఉ.9.48<br>మఘ రా.10.42<br>వ.ఉ.11.06ల12.39 | **24**<br>దశమి ఉ.9.46<br>అనూరాధరా.తె.5.39<br>వ.ఉ.8.00ల9.44 | **31**<br>విదియ రా.8.56<br>ధనిష్ఠ రా.7.02<br>వ.రా.2.32ల4.12 |
| S A T శని<br>రాహు కాలం ఉ. 9.00 మొ 10.30<br>యమగండ కాలం మ. 1.30 మొ 3.00<br>వారదుర్ముహూర్తం ఉ. 6.00 మొ 7.36 | **4**<br>చవితి ఉ.9.32<br>ధనిష్ఠ ఉ.11.34<br>వ.రా.7.01ల8.40 | **11**<br>ద్వాదశి రా.11.16<br>కృత్తిక ఉ.8.33<br>వ.రా.11.33ల1.03 | **18**<br>చవితి ఉ.8.25<br>పుబ్బ రా.10.19<br>వ.ఉ.6.30ల8.04<br>తి.రా.తె.5.32ల | **25**<br>ఏకాదశి ఉ.11.31<br>జ్యేష్ఠ పూర్తి<br>వ.ఉ.11.45ల1.31 | |

| తేది | సూ.ఉ. | సూ.అ. |
|---|---|---|
| 1 | 5.45 | 6.54 |
| 5 | 5.47 | 6.55 |
| 10 | 5.48 | 6.55 |
| 15 | 5.50 | 6.54 |
| 20 | 5.52 | 6.53 |
| 25 | 5.53 | 6.53 |
| 30 | 5.55 | 6.51 |

### మీ కోసం...

1.
2.
3.
4.
5.
6.
7.
8.
9.
10.
11.
12.
13.
14.
15.
16.
17.
18.
19.
20.
21.
22.
23.
24.
25.
26.
27.
28.
29.
30.
31.

(గత సంచిక తరువాయి)

ఆజ్ఞాచక్రాంతరాళస్థా - రుద్రగ్రంధివిభేదినీ
సహస్రారాంబుజారూఢా - సుధాసారాభివర్షిణీ 39
తటిల్లతా సమరుచి: - షట్చక్రోపరి సంస్థితా
మహాసక్తి: - కుండలినీ - బిసతంతు తనీయసీ 40
భవానీ - భవనాగమ్యా - భవారణ్య కుఠారికా
భద్రప్రియా - భద్రమూర్తిర్ - భక్త సౌభాగ్య దాయినీ 41
భక్తిప్రియా - భక్తిగమ్యా - భక్తివశ్యా - భయాపహా
శాంభవీ - శారదారాధ్యా - శర్వాణీ - శర్మదాయినీ 42
శాంకరీ - శ్రీకరీ - సాధ్వీ - శరచ్చంద్ర నిభాననా
శాతోదరీ - శాంతిమతీ - నిరాధారా - నిరంజనా 43
నిర్లేపా - నిర్మలా - నిత్యా - నిరాకారా - నిరాకులా
నిర్గుణా - నిష్కలా - శాంతా - నిష్కామా - నిరుపప్లవా 44
నిత్యముక్తా - నిర్వికారా - నిష్ప్రపంచా - నిరాశ్రయా
నిత్యశుద్ధా - నిత్యబుద్ధా - నిరవద్యా - నిరంతరా 45
నిష్కారణా - నిష్కళంకా - నిరుపాధిర్ - నిరీశ్వరా
నీరాగా - రాగమథనీ - నిర్మదా - మదనాశినీ 46

మహాయాగక్రమారాధ్యా - మహాభైరవ పూజితా 56
మహేశ్వర మహాకల్ప మహాతాండవసాక్షిణీ
మహాకామేశ మహిషీ - మహాత్రిపురసుందరీ 57
చతుష్షష్ట్యుపచరాఢ్యా - చతుష్షష్టి కళామయీ
మహాచతుష్షష్టి కోటి యోగినీ గణ సేవితా 58
మనువిద్యా - చంద్రవిద్యా - చంద్రమండల మధ్యగా
చారురూపా - చారుహాసా - చారుచంద్ర కళాధరా 59
చరాచర జగన్నాథా - చక్రరాజ నికేతనా
పార్వతీ - పద్మనయనా - పద్మరాగ సమప్రభా 60
పంచ ప్రేతాసనాసీనా - పంచ బ్రహ్మ స్వరూపిణీ
చిన్మయీ - పరమానందా - విజ్ఞాన ఘనరూపిణీ 61
ధ్యానధ్యాతృధ్యేయ రూపా - ధర్మాధర్మ వివర్జితా
విశ్వరూపా - జాగరిణీ - స్వపంతీ - తైజసాత్మికా 62
సుప్తా - ప్రాజ్ఞ్యాత్మికా - తుర్యా - సర్వావస్థా వివర్జితా
సృష్టికర్త్రీ - బ్రహ్మరూపా - గోప్త్రీ - గోవింద రూపిణి 63
సంహారిణీ - రుద్రరూపా - తిరోధాన కరీశ్వరి
సదాశివానుగ్రహదా - పంచకృత్య పరాయణా 64

# లలితా సహస్రనామ స్తోత్రం

నిశ్చింతా - నిరహంకారా - నిర్మోహా - మోహనాశినీ
నిర్మమా - మమతాహంత్రీ - నిష్పాపా - పాపనాశినీ 47
నిష్క్రోధా - క్రోధశమనీ - నిర్లోభా - లోభనాశినీ
నిస్సంశయా - సంశయఘ్నీ - నిర్భవా - భవనాశినీ 48
నిర్వికల్పా - నిరాబాధా - నిర్భేదా - భేదనాశినీ
నిర్నాశా - మృత్యుమథనీ - నిష్క్రియా - నిష్పరిగ్రహా 49
నిస్తులా - నీలచికురా - నిరపాయా - నిరత్యయా
దుర్లభా - దుర్గమా - దుర్గా - దుఃఖహంత్రీ - సుఖప్రదా 50
దుష్టదూరా - దురాచారశమనీ - దోషవర్జితా
సర్వజ్ఞా - సాంద్రకరుణా - సమానాధికవర్జితా 51
సర్వశక్తిమయీ - సర్వమంగళా - సద్గతి ప్రదా
సర్వేశ్వరీ - సర్వమయీ - సర్వమంత్ర స్వరూపిణీ 52
సర్వయంత్రాత్మికా - సర్వతంత్రరూపా - మనోన్మనీ
మహేశ్వరీ - మహాదేవీ - మహాలక్ష్మీర్ - మృడప్రియా 53
మహారూపా - మహాపూజ్యా - మహాపాతకనాశినీ
మహామాయా - మహాసత్త్వా - మహాశక్తిర్ - మహారతిః 54
మహభోగా - మహైశ్వర్యా - మహావీర్యా - మహాబలా
మహాబుద్ధిర్ - మహాసిద్ధిర్ - మహాయోగేశ్వరేశ్వరీ 55
మహాతంత్రా - మహామంత్రా - మహాయంత్రా - మహాసనా

భానుమండల మధ్యస్థా - భైరవీ భగమాలినీ
పద్మాసనా - భగవతీ - పద్మనాభ సహోదరీ 65
ఉన్మేష నిమిషోత్పన్న విపన్న భువనావళిః
సహస్రశీర్ష వదనా - సహస్రాక్షీ సహస్రపాత్ 66
ఆబ్రహ్మకీటజననీ - వర్ణాశ్రమ విధాయినీ
నిజాజ్ఞా రూప నిగమా - పుణ్యాపుణ్య ఫలప్రదా 67
శ్రుతిసీమంత సిందూరీ కృత పాదాబ్జధూళికా
సకలాగమ సందోహ శుక్తి సంపుట మౌక్తికా 68
పురుషార్థప్రదా - పూర్ణా - భోగినీ భువనేశ్వరీ
అంబికానాది నిధనా - హరిబ్రహ్మేంద్ర సేవితా 69
నారాయణీ - నాదరూపా - నామరూప వివర్జితా
హ్రీంకారీ - హ్రీమతీ - హృద్యా - హేయోపాదేయ వర్జితా 70
రాజరాజార్చితా - రాజ్ఞీ - రమ్యా - రాజీవలోచనా
రంజనీ - రమణీ - రస్యా - రణత్కింకిణి మేఖలా 71
రమా - రాకేందువదనా - రతిరూపా - రతిప్రియా
రక్షాకరీ - రాక్షసఘ్నీ - రామా - రమణలంపటా 72
కామ్యా - కామకళారూపా - కదంబకుసుమ ప్రియా
కల్యాణీ - జగతీకందా - కరుణారససాగరా 73
కళావతీ - కళాలాపా - కాంతా - కాదంబరీప్రియా

వరదా - వామనయనా - వారుణీమద విహ్వలా 74
విశ్వాధికా - వేదవేద్యా - వింధ్యాచల నివాసినీ
విధాత్రీ - వేదజననీ - విష్ణుమాయా విలాసినీ 75
క్షేత్రస్వరూపా - క్షేత్రేశీ - క్షేత్రక్షేత్రజ్ఞ పాలినీ
క్షయవృద్ధి వినిర్ముక్తా - క్షేత్రపాల సమర్చితా 76
విజయా - విమలా - వంద్యా - వందారుజన వత్సలా
వాగ్వాదినీ - వామకేశీ - వహ్నిమండలవాసినీ 77
భక్తిమత్కల్పలతికా - పశుపాశ విమోచనీ
సంహృతాశేష పాషండా - సదాచార ప్రవర్తికా 78
తాపత్రయాగ్ని సంతప్త సమాహ్లాదన చంద్రికా
తరుణీ - తాపసారాధ్యా - తనుమధ్యా - తమోపహా 79
చితిస్తత్పద లక్ష్యార్థా - చిదేకరసరూపిణీ
స్వాత్మానంద లవీభూత బ్రహ్మాద్యానంద సంతతిః 80
పరా - ప్రత్యక్చితీ రూపా - పశ్యంతీ పరదేవతా
మధ్యమా వైఖరీరూపా - భక్త మానస హంసికా 81
కామేశ్వర ప్రాణనాడీ - కృతజ్ఞా - కామపూజితా
శృంగార రస సంపూర్ణా - జయా - జాలంధరస్థితా 82
ఓడ్యాణ పీఠ నిలయా - బిందుమండల వాసినీ
రహోయాగ క్రమారాధ్యా - రహస్తర్పణ తర్పితా 83
సద్యః ప్రసాదినీ - విశ్వసాక్షిణీ - సాక్షివర్జితా
షడంగదేవతా యుక్తా - షాడ్గుణ్య పరిపూరితా 84
నిత్యక్లిన్నా - నిరుపమా - నిర్వాణసుఖ దాయినీ
నిత్యాషోడశికా రూపా - శ్రీకంఠార్ధ శరీరిణీ 85
ప్రభావతీ - ప్రభారూపా - ప్రసిద్ధా - పరమేశ్వరీ
మూలప్రకృతి రవ్యక్తా - వ్యక్తావ్యక్త స్వరూపిణీ 86
వ్యాపినీ - వివిధాకారా - విద్యా-విద్యా స్వరూపిణీ
మహాకామేశ నయన కుముదాహ్లాద కౌముదీ 87
భక్తహార్ద తమోభేద భానుమద్భాను సంతతిః
శివదూతీ - శివారాధ్యా - శివమూర్తి - శ్శివంకరీ 88
శివప్రియా - శివపరా - శిష్టేష్టా - శిష్టపూజితా
అప్రమేయా - స్వప్రకాశా - మనోవాచామగోచరా 89
చిచ్ఛక్తిశ్ - చేతనారూపా - జడశక్తిర్ - జడాత్మికా
గాయత్రి - వ్యాహృతి - స్సంధ్యా - ద్విజబృంద నిషేవితా 90
తత్త్వాసనా - తత్త్వమయీ - పంచకోశాంతరస్థితా
నిస్సీమ మహిమా - నిత్యయౌవనా - మదశాలినీ 91

(సశేషం)

- ఆచార్య కుప్పా విజయశ్రీ

అద్భుతమైన స్తోత్ర సంపద, ఇప్పుడు మీకు అందుబాటులో ఈ వెబ్‌సైట్ లో !!

stotranidhi.com
తెలుగు । ಕನ್ನಡ । தமிழ் । देवनागरी । english

- దేవ, ఋషి ప్రోక్త స్తోత్రములు
- మహా మహిమాన్వితమైన స్తోత్రములు
- అరుదుగా లభించే విశేష స్తుతులు
- పూజా విధానములు, వ్రతములు
- అష్టోత్తరములు, సహస్రనామములు
- స్వరసహిత వేద సూక్తములు
- సంధ్యావందనం, సుందరకాండ
- శ్రీమద్భగవద్గీత, దుర్గా సప్తశతి
- కీర్తనలు, మంగళ హారతులు
- ... ఇంకా ఎన్నెన్నో !!

www.stotranidhi.com



Scan this QR code to visit website

పూజా కార్యక్రమాలలో, పండుగ రోజులలో, ఆలయాలలో మరియు మీ దైవకార్యాలలో పఠించండి, తరించండి !!

Email: stotranidhi@gmail.com /stotranidhi

Download on the App Store GET IT ON Google Play

# ధృతరాష్ట్రుడు ధర్మరాజుకు చేసిన ఉపదేశం


డా. ఎమ్వీఎస్ సత్యనారాయణ

**సంజయుడు, శతయూపుడి ఆశ్రమం దగ్గరకు వచ్చిన మునులకు పాండవులను, ద్రౌపది, సుభద్ర, ఉలూపి, చిత్రాంగద మొదలగు వారందరినీ పేరుపేరునా తెలియజెప్పాడు.**

అప్పుడు ధృతరాష్ట్రుడు ధర్మరాజుతో ఇలా అన్నాడు. కురువంశశ్రేష్ఠుడా! ధర్మరాజా! నీకు క్షేమమేగదా! పౌరులు, జానపదులు నీవు చెప్పినట్లు నడచుకొంటున్నారా? ఆనందంగా జీవనం గడుపుతున్నారారు నిన్ను అభిమానించే సేవకులు, వారి వారి కోర్కెలు తీరడంతో సంతోషంగా ఉన్నారా? నీ పూర్వీకులు అనుసరించిన ధర్మమార్గంలోనే నడచుకొంటున్నావా? కోశాగారం నిండుగా ఉందా? అది కూడ న్యాయంగా తీసికొనే పన్నులతోనే నింపుతున్నావు గదా! దేవ బ్రాహ్మణులకిచ్చిన అగ్రహారాలను ఎవరూ ఆక్రమించుకొనకుండా జాగ్రత్తలు తీసికుంటున్నావా? మిత్రులైన రాజులను ప్రేమతో చేరదీసి, శత్రురాజుల పట్ల కఠినంగా ప్రవర్తిస్తూ, వారిని నీ వశం చేసికొంటున్నావా? తటస్థంగా ఉండే రాజులను ఒక కంట కనిపెడుతూ తగిన రక్షణ చర్యలు తీసికొంటున్నావా? దేవతలను, పితృదేవతలను, అతిథులను పూజాదికంతో తృప్తి పరుస్తున్నావు గదా! నాలుగు వర్ణాల వారు (బ్రాహ్మణ, క్షత్రియ, వైశ్య శూద్రులు) తమ తమ వృత్తులతో జీవనం కొనసాగిస్తూ, ధర్మబద్ధంగా నడుచుకొంటున్నారా? పిల్లలు, బలహీనులు, స్త్రీలు, వృద్ధులు - మనసులో భయం లేకుండా జీవించే విధంగా నీ ఆజ్ఞలు నగరంలోనూ, రాజ్యంలోనూ చెల్లుతున్నాయా?

ఈవిధంగా ప్రశ్నల వర్షం కురిపించిన ధృతరాష్ట్రునకు ధర్మరాజు ఇలా సమాధానం చెప్పాడు. మహారాజా! ఇంతకుముందు ఒకసారి మీరు నాకు చేసిన ఉపదేశం ప్రకారం నడచుకొంటున్నాను గనుక, ఇప్పుడు మీరు ప్రశ్నించిన విషయాలన్నీ ఏ లోటూ లేకుండా కొనసాగుతున్నాయి. అది అటులుండనీయండి. మీ విషయమై నాకు ఆందోళనగా ఉంది. అసలే మీ శరీరం శ్రమకు తట్టుకోలేని సున్నితమైనది. అటువంటి మీ శరీరం ఉపవాసం, వ్రత నియమాలను తట్టుకోగల్గుతోందా? మాతల్లి కుంతి మీ దంపతులకు సేవ చేస్తానని మీతో అడవికి వచ్చింది. మీకు అర్థమైన రీతిలో సేవలు అందిస్తున్నదా? పెద్దమ్మ (గాంధారి) మీతో తపస్సు ఆచరిస్తున్నది కదా!- ఆమె కష్టాలను ఓర్చుకొనగల్గుతున్నదా? మేమే తమ కుమారులను చంపామని మాటిమాటికీ తలచుకొని బాధ పడుతోందా? ఇక సంజయుడు తపస్సుకు ఓర్చుకొంటున్నాడా? నిర్వికారమైన మనస్సు గలిగిన విదురుడు కన్పించలేదు. ఎక్కడికి వెళ్లాడు? నేను ఆయనను చూడాలని తపన పడుతున్నాను.

ఆ మాటలు విన్న ధృతరాష్ట్రుడు వెంటనే ఇలా అన్నాడు- ధర్మరాజా! నేను తపస్సు చేయడానికి నా శరీరం అన్ని రకాలుగా సహకరిస్తోంది. మీకు పూజ్యురాలైన నా భార్య (మీకు పెద్ద తల్లి) గాంధారి కూడా ఓపికతో శ్రద్ధగా తపస్సు చేసుకొంటోంది. ఇక మీ తల్లి కుంతి ఏవిధమైన అలుపు లేకుండా, ఎంతో చక్కగా మా ఇరువురికీ శుశ్రూష చేస్తోంది. నా భార్య గాంధారి నీవు భావించినట్లుగా కాక- గుర్తుకు వచ్చినప్పుడల్లా మిమ్మల్ని, మీరిచ్చిన గౌరవాన్ని, అలాగే మీ పరాక్రమాన్ని పొగుడుతూ మీకు అన్నివిధాలా మేలు కలగాలని ఆశీర్వదిస్తూ ఉంటుంది. ఇక సంజయుని సంగతి అంటావా- అతడెంత బుద్ధిమంతుడు. అత్యంత నిష్ఠతో తపస్సు చేస్తూనే ఉంటాడు. ఇక విదురుడు మాత్రం మమ్మల్ని విడిచిపెట్టి మనుష్యులు తిరగని అడవిలో నిర్విచారంగా, స్వేచ్ఛగా తిరుగుతూ ఉంటాడు. అప్పుడప్పుడూ వచ్చి పోతుంటాడు. మునులకు సైతం వింత కలిగించే విధంగా నిరాహారుడై నీళ్లు, గాలితో జీవనం సాగిస్తున్నాడు. అప్రయత్నంగా ఒక్కొక్కసారి కన్పించి, అంతలోనే తిరిగి వెళ్లిపోతాడు.''

ధృతరాష్ట్రుడు ఇలా చెపుతూ ఉండగా విదురుడు హఠాత్తుగా ధర్మరాజు కంటపడ్డాడు. గుర్తుపట్టడానికి వీలు లేనంతగా- అడవిలోని దుమ్ముతో, ఒళ్లంతా మట్టికొట్టుకుపోయి, జడలు గట్టిన జుట్టుతో, దిగంబరుడుగా ఉన్నాడు. వెంటనే ధర్మరాజు తనతో కూడా వచ్చిన వారిని అక్కడే ఉండమని, ఒక్కడే ఆ విదురుని కలుపుకోవడానికి గబగబా వెళ్లాడు. విదురుడు ఒక్కొక్కసారి కనబడతాడు. మరొకసారి పొదలలో దూరి మాయమౌతాడు. అప్పుడు ధర్మరాజు పెద్దగా గొంతెత్తి, ఓ విదురా! ఆగుము, ఆగుము. నేను ధర్మరాజును, నిన్ను చూడాలనే తపనతో వచ్చాను. వెళ్లిపోకు, వెళ్లిపోకు అంటూ వెంటపడ్డాడు. అప్పుడు విదురుడు వెనుకకు తిరిగి ధర్మరాజును చూచి, ఏకాంతంగా ఉండేచోట ఒకానొక చెట్టు వద్దకు చేరుకొని

ఆగి నిలుచున్నాడు. ధర్మరాజు విదురుడిని సమీపించి ఎదురుగా నిలబడ్డాడు. స్వచ్ఛమైన మనస్సు కల విదురుడు అరమూసిన కన్నులతో మాట్లాడకుండా నిశ్చలంగా ఉండిపోయాడు. అప్పుడు ధర్మరాజు "ఓ యోగేశ్వరా! నేను ధర్మరాజును, కనులు తెరచి నన్ను చూడు" అని ప్రార్థించాడు. అప్పుడు విదురుడు మెల్లగా కనురెప్పలెత్తి ధర్మరాజును తదేకంగా చూస్తూ యోగశక్తితో తన ఇంద్రియాల తోను, తన ప్రాణాలను ధర్మరాజు ప్రాణాలతోనూ కలిపి, తన శరీరం విడిచిపెట్టి, కాంతిమయమైన రూపంతో ఆ ధర్మరాజు శరీరంలో ప్రవేశించాడు. వెంటనే ధర్మరాజు శరీరానికి కాంతి, శక్తి అధికమయ్యాయి. బుద్ధి ఇంకా బలపడింది. అది గ్రహించిన ధర్మరాజు ఆశ్చర్యంతో సంతోషించాడు. విదురుడి శవం ఏమార్పూ చెందకుండా, చలించకుండా నిద్రలో వాలిపోయిన విధంగా ఉండడం చూచి, ధర్మరాజు విదురుడి శరీరానికి అగ్నికార్యం (దహనకార్యం) చేయదలచాడు. ఆ సమయంలో ఆకాశంలో నుంచి ఒకానొక స్వరం ఇలా వినబడింది. "ధర్మరాజా! యతి లక్షణాలు ఆధిక్యం చేత ప్రకాశించే విదురుడి యోగ శరీరానికి అగ్నికార్యం చేయడం తగునా? ఆ ప్రయత్నం చేయకు సుమా!" ఆ మాటలు విన్న ధర్మరాజు ఆ పని మానుకొని తిరిగి ధృతరాష్ట్రుడి ఆశ్రమానికి చేరుకొని తన తండ్రితోనూ (ధృతరాష్ట్రునితోనూ) తమ్ముళ్లతోనూ అక్కడ జరిగిన సంఘటన అంతా వివరంగా చెప్పాడు. ద్రౌపది మున్నగు స్త్రీలు, పాండవులను చూడడానికి వచ్చిన తాపసులు. అంతా ఆ విషయం విని ఆశ్చర్యంలో మునిగిపోయారు. తరువాత ధృతరాష్ట్రుడు వీడ్కోలు చెప్పగా తాపసులు తమ తమ ఆశ్రమాలకు వెళ్లిపోయారు. అనంతరం ధృతరాష్ట్రుడు "తమకున్నదీ, తాము తినేది ఏదో- అదే అతిథులకు పెట్టడం ధర్మం" కాబట్టి అందరికీ పండ్లు, దుంపలు ఆహారంగా ఇచ్చాడు. వారంతా సంతోషంగా తిని రాత్రి అందరూ నేలమీద పడుకొని నిద్రపోయారు.

(సమాప్తం)

---

**5వ పేజీ తరువాయి... సంపాదకీయం..**


చూస్తూ, ధర్మ గ్లానిని సహిస్తూ చేతకానితనంతో మౌనంగా ఉండటం కూడా పెద్ద పాపమే అని మన ఇతిహాసాలు బోధిస్తున్నాయి. కాబట్టి ప్రతి ధర్మాభిమానీ ఒక ధర్మ రక్షకుడిగా మారాలి.

ధర్మగ్లాని కలిగించే ఇలాంటి దుర్మార్గుల దుశ్చర్యలను సామాజిక మాధ్యమాల్లోనే దీటుగా, బలంగా, తార్కికంగా ఎండగట్టాలి. వారు చేసే ప్రతి కుట్రపూరిత వ్యాఖ్యకు, అసత్య ప్రచారానికి ధార్మిక సత్యాలతో, చారిత్రక ఆధారాలతో బుద్ధి చెప్పాలి. సత్యం, ధర్మం, న్యాయం పక్షాన నిలబడి గురు పరంపరను గౌరవించుకునే ఉన్నతమైన సంస్కృతిని భావితరాలకు అందించాల్సిన బాధ్యత మనందరిపై ఉంది. దర్శనమ్ పత్రిక ద్వారా ఈ ధార్మిక లోకానికి మేము ఇస్తున్న పిలుపు ఒక్కటే... సనాతన ధర్మం అనే మహా వృక్షం వేర్లను కత్తిరించాలని చూసే ఈ సామాజిక చీడపురుగులను మేధోపరంగా, ధార్మికంగా, చట్టపరంగా సమిష్టిగా ఎదుర్కొందాం. మన సనాతన ధర్మాన్ని, దైవ స్వరూపులైన జగద్గురువులను కంటికి రెప్పలా కాపాడుకుందాం.

**43వ పేజీ తరువాయి... రామాయణం**


అజ్ఞానివనీ, నేను నేర్పడం లేదు. మీరు నాకిచ్చిన చనువు కారణాన, నన్ను సగౌరవంగా చూసి నా మాట మన్నించడం వల్లా, నాకు స్వభావసిద్ధంగా మీమీద స్నేహ భావం వుండడం మూలాన, నేను మీరు మరచిన దానిని జ్ఞప్తికి వచ్చేట్లు చెప్పాను. కాని నీకు తెలియని కొత్త విషయం నేర్పడానికి రాలేదు. కాబట్టి నన్ను క్షమించు. నేనెంత దూరం ఆలోచించినా ఇప్పుడు, ఇక్కడ, మీ ప్రయత్నం నాకిష్టం కావడం లేదు. నువ్వు సుజన శేఖరుడవే. కాని ఏదో ప్రమాద వశాత్తు సుజన కృత్యాన్ని మరచావు. మునివృత్తిలో వుండే వారికి ఆయుధాలతో పనిలేదు. కాబట్టి ఆయుధాలను మీరు ధరించడం సరైన పని కాదు. ఆపైన మనం బలవంతులం. మనకు ఎవరడ్డమని బలగర్వంతో పగలేకపోయినా దండకారణ్యంలోని రాక్షసులను చంపడం మరో సరికాని పని. నేనెంతో ఆలోచించా. రాక్షసులైనా నిరపరాధులను దండించడం నాకిష్టం లేదు. నాకు కొంచెమైనా తృప్తి కలగడం లేదు. ప్రాణేశ్వరా! శ్రీరామచంద్రా! అడవుల్లో మునులు తిరగడానికీ, శస్త్రాలను ధరించడానికీ ఏం సంబంధం? మునివృత్తి శాంతి ప్రధానం. ఆయుధ ధారణ కౌర్య ప్రధానం. ఒకటి శుద్ధ సాత్త్వికం....ఇంకొకటి శుద్ధ తామసం. ఇక నీకులోచితమైన క్షత్రియత్వం ఎక్కడ? బ్రాహ్మనోచితమైన తపస్సెక్కడ? రెండింటికీ పొంతన ఎలా కుదుర్తుంది? నువ్వు చేయబోయే ఈ పని పరస్పర విరుద్ధ గుణాలున్నది. నువ్వే ఆలోచించు. కాబట్టి రెండింటిలో ఒకటి వదలు. శస్త్రాన్నైనా వదలు....క్షాత్రమైనా వదలు....తపస్సైన వదలు. అలా కాకుండా ఎందుకు రెంటా చెడాలి?" (సశేషం)

# మీ రాశి




**మేషం** (అశ్విని 4 పాదాలు, భరణి 4 పాదాలు, కృత్తిక 1వ పాదం)

గొప్పవారి పరిచయం ఏర్పడుతుంది. స్త్రీల మూలకంగా లాభం వుంటుంది. మంచి ఆలోచనలను కలిగివుంటారు. బంధు, మిత్రులు గౌరవిస్తారు. కుటుంబసౌఖ్యం సంపూర్ణంగా పొందుతారు. సత్కార్యాల్లో పాల్గొంటారు. గృహ అవసరాలకు ప్రాధాన్య మిస్తారు. బంధుమిత్రుల సహాయ సహకారాలు లభిస్తాయి. మానసికాందోళనతో కాలం గడుస్తుంది. ఆకస్మిక ధననష్టమేర్పడే అవకాశముంటుంది. స్థిరమైన నిర్ణయాలు తీసుకోలేకపోతారు. అధికారులతో జాగ్రత్తగా మెలగుట మంచిది.




**వృషభం** (కృత్తిక 2,3,4 పాదాలు, రోహిణి 4 పాదాలు, మృగశిర 1,2 పాదాలు)

ప్రయత్నకార్యాలందు దిగ్విజయాన్ని పొందుతారు. ఆకస్మిక ధనలాభముం టుంది. కుటుంబం అంతా సంతోషంగా కాలక్షేపం చేస్తారు. ఒక ముఖ్యమైన పని పూర్తికావ డంతో మిక్కిలి ఆనందిస్తారు. కీర్తి, ప్రతిష్ఠలు పొందుతారు. శాశ్వత పనులకు శ్రీకారం చుడతారు. ధర్మకార్యాలు చేయుట యందు ఆసక్తి పెరుగుతుంది. దైవదర్శనం చేసుకుంటారు. కుటుంబసౌఖ్యముంటుంది. మానసికానందాన్ని అనుభవిస్తారు. పేరుప్రతిష్ఠలు లభిస్తాయి. ఆకస్మిక ధనలాభముంటుంది. శుభ వార్తలు వింటారు. విందులు, వినోదాల్లో పాల్గొంటారు.




**మిథునం**(మృగశిర 3,4 పాదాలు, ఆరుద్ర 4 పాదాలు, పునర్వసు 1,2,3 పాదాలు)

తలచిన కార్యాలకు ఆటంకాలెదురవు తాయి. స్థిరాస్తులకు సంబంధించిన సమ స్యల్లో జాగ్రత్తగా నుండుట మంచిది. మోస పోయే అవకాశాలుంటాయి. ఆర్థిక పరిస్థితి ఆందోళనకరంగా మారుతుంది. నూతన కార్యాలు ప్రారంభించరాదు. ప్రయాణా లెక్కువ చేస్తారు. స్త్రీల మూలకంగా లాభాలుంటాయి. ప్రయత్న కార్యాలన్నింటిలో విజయం పొందుతారు. శుభవార్తలు వింటారు. ఆకస్మిక ధన లాభముంటుంది. కుటుంబం అంతా సౌఖ్యంగా ఉంటారు. అత్యంత సన్నిహితులను కలుస్తారు. కోరుకునేది ఒకటైతే జరిగేది మరొకటవుతుంది.




**కర్కాటకం** (పునర్వసు 4వ పాదం, పుష్యమి 4 పాదాలు, ఆశ్లేష 4 పాదాలు)

కుటుంబ పరిస్థితులు సంతృప్తికరంగా నుంటాయి. ఆకస్మిక ధనలాభంతో ఋణ బాధలు తొలగిపోతాయి. సమాజంలో మంచి పేరు సంపాదిస్తారు. ఇతరులు మిమ్మల్ని ఆదర్శంగా తీసు కొనుటకు కృషి చేస్తారు. స్త్రీలు, బంధు, మిత్రులను కలుస్తారు. మానసికాందోళనతో కాలం గడుస్తుంది. ఆరోగ్యం విషయంలో శ్రద్ధ వహించక తప్పదు. ప్రయత్నకార్యాలు ఆలస్యంగా సఫల మవుతాయి. చెడుపనులకు దూరంగా నుండుట మంచిది. వృత్తి ఉద్యోగరంగాల్లో అభివృద్ధి ఉంటుంది.



**సింహం** (మఖ 4 పాదాలు, పుబ్బ 4 పాదాలు, ఉత్తర 1వ పాదం)


తరచూ ప్రయాణాలు చేయాల్సి వస్తుంది. అకాల భోజనం వల్ల ఆరోగ్యం చెడిపోతుంది. చిన్న విషయాల్లో మానసికాం దోళన చెందుతారు. వృత్తిరీత్యా జాగ్రత్తగా నుండుట మంచిది. సహనం అన్నివిధాలా శ్రేయస్కరం. ఆవేశం వల్ల కొన్నిపనులు చెడిపోతాయి. ప్రయత్నం మేరకు స్వల్పలాభముంటుంది. వృథా ప్రయాణాలెక్కువ చేస్తారు. వ్యాపార రంగంలో లాభాలుం టాయి. ఋణ ప్రయత్నాలు చేయవలసి వస్తుంది. నూతన కార్యాలకు శ్రీకారం చుడతారు. బంధు, మిత్రుల సహకారం ఆలస్యంగా లభిస్తుంది. నిరుత్సాహంగా కాలం గడుస్తుంది.



**కన్య** (ఉత్తర 2,3,4 పాదాలు, హస్త 4 పాదాలు, చిత్త 1,2 పాదాలు)


ఆకస్మిక ధనలాభముముంటుంది. కుటుంబంలో ఆనందోత్సాహాలు లభిస్తాయి. బంధు, మిత్రులతో కలుస్తారు. సమాజంలో గౌరవం లభిస్తుంది. సంపూర్ణ ఆరోగ్యవంతులుగా నుంటారు. ప్రతివిషయంలో అభివృద్ధి ఉంటుంది. శుభకార్య ప్రయత్నాలు సులభంగా నెరవేర్చుకుంటారు. ప్రయాణాల్లో వ్యయ ప్రయా సలు అధిక మవుతాయి. ఆకస్మిక ధననష్టమేర్పడకుండా జాగ్రత్త వహించుట మంచిది. అనారోగ్య బాధలు తొలగుటకు డబ్బు

ఎక్కువ ఖర్చుచేస్తారు. తీర్థయాత్రకు ప్రయ త్నిస్తారు. దైవదర్శనం ఉంటుంది. స్త్రీలు మనోల్లాసాన్ని పొందుతారు. కుటుంబ పరిస్థితులు సంతృప్తికరంగా ఉంటాయి.




**తుల** (చిత్త 3,4 పాదాలు, స్వాతి 4 పాదాలు, విశాఖ 1,2,3 పాదాలు)

కుటుంబ పరిస్థితులు సంతృప్తికరంగా ఉంటాయి. ఆకస్మిక ధననష్టం కలిగే అవకాశం ఉంటుంది. వృథా ప్రయాణా లెక్కువ చేస్తారు. బంధు, మిత్రులతో కలహించుకోకుండా జాగ్రత్తగా నుండుట మంచిది. వృత్తి, ఉద్యోగరంగాల్లో సహనం వహించక తప్పదు. అనుకోకుండా కుటుంబంలో కలహా లేర్పడే అవకాశముంటుంది. అశుభవార్తలు వినాల్సి వస్తుంది. ఆకస్మిక ధననష్టం జరుగ కుండా జాగ్రత్త పడుట మంచిది. మనస్తాపానికి గురి అవుతారు. ప్రయాణాల్లో అప్రమత్తత అవసరం. నూతనకార్యాలు వాయిదా వేసుకోక తప్పదు.



**వృశ్చికం** (విశాఖ 4వ పాదం, అనూరాధ 4 పాదాలు, జ్యేష్ఠ 4 పాదాలు)

మీ మంచి ప్రవర్తనను ఇతరులు ఆదర్శంగా తీసుకుంటారు. ప్రయత్న కార్యాలన్నింటిలో విజయాన్ని సాధిస్తారు. దైవదర్శనం చేసుకుంటారు. స్థిరాస్తులకు సంబంధించిన సమస్యలు పరిష్కరించుకుంటారు. కళలందు ఆసక్తి పెరుగుతుంది. నూతన, వస్తు, వస్త్ర ఆభరణాలను పొందుతారు. నూతన కార్యాలు ఆలస్యంగా ప్రారంభిస్తారు. అల్పభోజనం వల్ల అనారోగ్యాన్ని పొందుతారు. ఏదో ఒక విషయం మిమ్మల్ని మన స్తాపానికి గురిచేస్తుంది. వీలైనంతవరకు అసత్యానికి దూరంగా నుండుట మంచిది. అనవసర భయాందోళనలకు లోనవుతారు.




**ధనుస్సు** (మూల 4 పాదాలు, పూర్వాషాఢ 4 పాదాలు, ఉత్తరాషాఢ 1వ పాదం)

అనారోగ్య బాధలతో సతమతమవుతారు. స్థానచలన సూచనలుంటాయి. నూతన వ్యక్తులు కలుస్తారు. కుటుంబ పరిస్థితులు సంతృప్తికరంగా నుండక మానసికాందోళన చెందుతారు. గృహంలో మార్పులు కోరుకుంటారు. ఆర్థిక ఇబ్బందులు దూరమవుతాయి. రాజకీయ వ్యవహారాల్లో దిగ్విజయాన్ని పొందుతారు. ప్రయత్న కార్యాలన్నీ సంపూ ర్ణంగా ఫలిస్తాయి. శుభకార్య ప్రయత్నాలు సులభంగా నెరవేరతాయి. సంపూర్ణ ఆరోగ్యవంతులుగా నుంటారు. ఇతరులకు ఉపకరించు పనులు చేపడతారు. గౌరవమర్యాదలు లభిస్తాయి.




**మకరం** (ఉత్తరాషాఢ 2,3,4 పాదాలు, శ్రవణం 4 పాదాలు, ధనిష్ఠ 1,2 పాదాలు)

ఆకస్మిక ధనలాభయోగముంటుంది. కుటుంబంలో సంతృప్తికరంగా ఉంటారు. పేరు, ప్రతిష్ఠలు లభిస్తాయి. సంఘంలో గౌరవమర్యాదలుంటాయి. అంతటా అనుకూల వాతావరణ మేర్పడుతుంది. స్త్రీలు సౌభాగ్యాన్ని పొందుతారు. బంధు, మిత్రులు కలుస్తారు. కుటుంబపరిస్థితులు సంతృప్తికరంగా ఉంటాయి. సహనం వహించుట అన్నివిధాలా మేలు. బంధు, మిత్రులతో విరోధమేర్పడకుండా జాగ్రత్తపడుట మంచిది. అనవసర ధనవ్యయంతో ఋణప్రయత్నాలు చేయాల్సి వస్తుంది. అనారోగ్య బాధలకు ఔషధసేవ అవసరం. తలచిన కార్యాలన్నీ విజయవంతంగా పూర్తి చేసుకోగలుగుతారు.



**కుంభం** (ధనిష్ఠ 3,4 పాదాలు, శతభిషం 4 పాదాలు, పూర్వాభాద్ర 3 పాదాలు)

అనారోగ్య బాధలను అధిగమిస్తారు. నూతన కార్యాలకు ఆటంకాలున్నా సత్ఫలితాలు పొందుతారు. ప్రయాణాల్లో జాగ్రత్త అవసరం. వృత్తి, వ్యాపార రంగాల్లో ధననష్టమేర్పడకుండా జాగ్రత్త వహించాలి. ఆత్మీయుల సహాయ, సహకారాలకై వేచివుంటారు. దైవదర్శనం లభిస్తుంది. కుటుంబకలహాలు దూరమవుతాయి. ప్రయత్నకార్యాలకు ఆటంకాలెదురవుతాయి. వృథా ప్రయాణాల వల్ల అలసట చెందుతారు. చెడు పనులకు దూరంగా వుండుట మంచిది. అందరితో స్నేహంగా నుండుటకు ప్రయత్నించాలి. ఆర్థిక ఇబ్బందులు స్వల్పంగా వుంటాయి. వ్యవసాయ రంగంలోని వారికి లాభదాయకంగా ఉంటుంది.



**మీనం** (పూర్వాభాద్ర 4వ పాదం, ఉత్తరాభాద్ర 4 పాదాలు, రేవతి 4 పాదాలు)

ప్రయత్నకార్యాలన్నీ వెంటనే ఫలిస్తాయి. ఆకస్మిక ధనలాభమేర్పడుతుంది. సంపూర్ణ ఆరోగ్యంగా వుంటారు. నూతన వస్తు, ఆభరణాలను పొందుతారు. కుటుంబ సౌఖ్యం లభిస్తుంది. ఋణబాధలు తొలగిపోతాయి. ధైర్యసాహసాలతో ముందుకు వెళ్తారు. ఆకస్మిక ధననష్టం పట్ల జాగ్రత్త అవసరం. కొన్ని ముఖ్యమైన కార్యక్రమాలు వాయిదా వేసుకోవాల్సి వస్తుంది. స్వల్ప అనారోగ్యబాధలుంటాయి. వృథా ప్రయాణాలు చేస్తారు. స్థానచలన సూచనలున్నాయి. సన్నిహితులతో విరోధమేర్పడకుండా మెలగుట మంచిది. వ్యాపారంలో విశేష లాభాన్ని ఆర్జిస్తారు.

**- గౌరీభట్ల రామకృష్ణ శర్మ**

## పదసంపద-257

| | | | | | | | | |
|---|---|---|---|---|---|---|---|---|
| 1 | | 2 | | ✡ | 3 | 4 | | 5 |
| | ✡ | | ✡ | 6 | | | ✡ | |
| 7 | | ✡ | 8 | | | ✡ | 9 | |
| 10 | | 11 | ✡ | | ✡ | 12 | ✡ | |
| ✡ | 13 | | | | | | ✡ | ✡ |
| 14 | ✡ | | ✡ | | ✡ | 15 | 16 | 17 |
| 18 | 19 | ✡ | 20 | | | ✡ | 21 | |
| ✡ | 22 | 23 | | | ✡ | 24 | | |
| 25 | | | | ✡ | 26 | | | |

పదసంపన్నులు

పేరు ____________________

విలాసం ____________________

____________________

పిన్ __________ ఫోన్ __________

పద సంపద సమాధానాలను ఈ నెల 15 తేదీలోగా మా చిరునామాకు పంపాలి.

**దర్శనమ్** ఆధ్యాత్మిక వార్తా మాసపత్రిక

ఇం.నెం. 29-105/4/1, న్యూ విద్యానగర్, నేరేడ్‌మెట్, సికింద్రాబాద్-56

మీ అభిప్రాయాలను baludarshanam@gmail.comకు పంపగలరు.

## ఆధారాలు

### అడ్డం

1. బ్రహ్మ (4)
3. గాన యోగ్యమైన వేదం (4)
6. పెండ్లి పత్రికలలో తప్పక వ్రాసే మాటల్లో మొదటిది (3)
7. భవ్యమైనదానా! (2)
8. తమో గుణమే ప్రధానమైనది (3)
9. ఉత్తరం, వ్యావహారికంగా పోయాడనే అర్థంలో (2)
10. భూమీ! (3)
13. ఉపమానమునకు అందనిది (6)
15. కలువ అటు నుంచి (3)
18. బ్రాహ్మణ (2)
20. పుండు, గాయం (3)
21. నేర్పరి అటునుంచి (2)
22. ఏనుగు (4)
24. ఈవల కానిది (3)
25. సంఘటన (4)
26. పితృపక్షాల తర్వాత వచ్చే అమావాస్య (4)

### నిలువు

1. ఈయేడు (4)
2. దత్తాత్రేయ స్వామికి దాపున ఉండే వృక్షం (2)
3. కమల (3)
4. శుభమస్తులో చాలా (2)
5. కాశీక్షేత్ర పరిరక్షకుడైన యక్షుడు (4)
6. వాల్మీకి మహర్షి మహోత్కృష్ట రచనము (7)
11. ధాత్రి మరోలా (3)
12. జిడ్డు తైలం, ఆరోగ్యదాయకం (3)
14. అశ్వత్థ,విష్ణు స్వరూప వృక్షం (2)
16. తలకిందులైన ఉప్పు (4)
17. అంగారకుని గుడి (4)
19. గుడిలో తీర్థం తర్వాత లభించేది (3)
20. గోకులము (3)
23. కుల, జాతి లాంటిదే (2)
24. ఆనందాన్ని వ్యక్తీకరించే ప్రశంసా పదం (2)

**పద సంపాదకులు : ఎం. దత్తాత్రేయశర్మ**

## పదసంపద-256 సమాధానాలు

| | | | | | | | | |
|---|---|---|---|---|---|---|---|---|
| 1 చ | 2 క్ర | 3 వా | కం | ✡ | 4 పు | 5 న | ర్వ | 6 సు |
| 7 కో | మ | లి | ✡ | 8 సం | ✡ | ది | ✡ | వ |
| 9 ర | త | ✡ | 10 వి | భ | వం | ✡ | 11 కూ | ర్చ |
| ము | ✡ | 12 మ | రు | వం | ✡ | 13 అ | ✡ | ల |
| ✡ | 14 కు | రు | లు | ✡ | 15 స | మి | తి | ✡ |
| 16 న | ✡ | లు | ✡ | 17 స | మ | త | ✡ | 18 డు |
| 19 లా | 20 ఆ | ✡ | 21 ఉ | ద | గ్ర | ✡ | 22 చే | రు |
| 23 ఆ | స | 24 క్తి | ✡ | స్సు | ✡ | 25 ఎ | రు | క |
| 26 ప | రా | భ | వ | ✡ | 27 ప | ర | వ | శం |

## జూన్ నెల విజేతలు

**గుడి శ్రీనాథ్**
పెద్దశంకరంపేట్, మెదక్ జిల్లా

**గుళ్లపల్లి ఉదయ కుమార్**
విజయవాడ

**ఆర్. ఇందిరాదేవి**
వనస్థలిపురం,హైదరాబాద్

**వనమాల రామలింగాచారి**
ప్రశాంత్‌నగర్, యాదగిరిగుట్ట

**హరి ధనలక్ష్మి**
పాయకాపురం, విజయవాడ

**కాశీభట్ల మంజులాదత్తా**
చందానగర్, హైదరాబాద్

Edited Printed, Published and Owned by Marumamula Rukmini, Printed at Capital Graphics, 118 Chenoy Trade Centre, Parklane, Secunderabad-500003, Published at 601, Chenoy Trade Centre, Parklane, Secunderabad-500003, Editor: Marumamula Rukmini.


విలక్షణ మేధావి
వినూత్న కార్యశీలి
బహుముఖ ప్రజ్ఞాశాలి
డా. నూతన్ నాయుడు
విద్యా రంగంలో ప్రేరణ
వినూత్న ఆలోచనలతో ముందడుగు
సమాజానికి స్ఫూర్తి
అనేక అవార్డులు గౌరవాలు
ప్రపంచ దృక్పథం సేవాభావం
"జ్ఞానం తోడు... కర్తవ్యమే బాట... సమాజమే లక్ష్యం..."




విశాఖతేజం .... విశ్వమయూఖం ..... వినూతన శకం .....

- విశాఖపట్నం మట్టిలో జన్మించి, ఒక సామాన్యుడిగా ప్రస్థానం ప్రారంభించిన డాక్టర్ నూతన్ నాయుడు, నేడు అంతర్జాతీయ విద్యా, సాంకేతిక, రాజకీయ రంగాల్లో ఒక గ్లోబల్ ఐకాన్‌గా ఎదిగి సరికొత్త చరిత్ర సృష్టించారు. బుల్లితెర రియాలిటీ షో 'బిగ్ బాస్' ద్వారా తనదైన వ్యక్తిత్వంతో కోట్లాది మంది తెలుగు ప్రేక్షకుల హృదయాల్లో బలమైన ముద్ర వేసిన ఆయన, తాజాగా అద్భుతమైన అంతర్జాతీయ గుర్తింపుతో భారతదేశ ఖ్యాతిని విశ్వవ్యాప్తం చేశారు.
- **అకడమిక్ మహారథిగా అరుదైన శిఖరాలకు ...**
- ఉన్నత విద్యా ప్రమాణాలకు మారుపేరైన ప్రఖ్యాత 'ఫ్రాంక్‌ఫోర్డ్ ఇంటర్నేషనల్ యూనివర్సిటీ' ఆయన అసాధారణ ప్రతిభను గుర్తించి, అత్యంత ప్రతిష్ఠాత్మకమైన 'ప్రొఫెసర్‌షిప్' హోదాతో పాటు 4వ గౌరవ డాక్టరేట్‌ను అధికారికంగా ప్రకటించింది.
- **తొలి భారతీయుడు** : అత్యంత సంక్లిష్టమైన **'ఆర్గనైజేషనల్ న్యూరోసైన్స్ అండ్ ఏఐ ఎథిక్స్' (Organizational Neuroscience and AI Ethics)** విభాగంలో ఈ అరుదైన ద్వంద్వ గుర్తింపు సాధించిన తొలి భారతీయ అకడమిక్ మహారథి మన నూతన్ నాయుడే కావడం విశేషం.

- **నాల్గవ డాక్టరేట్ :** మానవ వనరుల నిర్వహణ, ఉన్నత విద్యా సంస్థల నిర్వహణ, ఇన్ఫర్మేషన్ సిస్టమ్స్ ఇంటిగ్రేషన్‌లో ఇదివరకే మూడు డాక్టరేట్లు సాధించిన ఆయనకు ఇది నాల్గవ సమకాలీన డాక్టరేట్.
- **ట్రైనర్లకే ట్రైనర్ :** ఐఐటీ కాన్పూర్, ఐఐఎం కలకత్తా, నల్సార్ లాంటి అత్యున్నత విశ్వవిద్యాలయాలతో అనుబంధం ఉన్న ఆయన, ప్రపంచవ్యాప్తంగా దాదాపు 17 అంతర్జాతీయ వర్సిటీలలో విజిటింగ్ ప్రొఫెసర్‌గా సేవలు అందిస్తూ విద్యా వర్గాల్లో 'ట్రైనర్లకే ట్రైనర్' గా కీర్తించబడుతున్నారు.
- పొలిటికల్ కింగ్ మేకర్ ... తిరుగులేని వ్యూహకర్త
- తెరవెనుక అత్యంత ప్రభావవంతమైన కింగ్ మేకర్‌గా ఆయన జాతీయ, ప్రాంతీయ రాజకీయ రంగాన్ని శాసిస్తున్నారు.
- **తెలుగు రాష్ట్రాల్లో :** బలమైన రాజకీయ ముద్ర వేసిన ప్రజారాజ్యం, వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ (వైసీపీ), జనసేన, కాంగ్రెస్ పార్టీలతో పాటు ఇటీవల దూసుకొస్తున్న బీసీవై పార్టీలకు ఆయన పొలిటికల్ అడ్వైజర్‌గా వ్యవహరించి, ఆయా పార్టీలు ప్రజాదరణ పొందడంలో అసాధారణ కృషి చేశారు.
- **జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో :** ప్రాంతీయంగానే కాకుండా, జాతీయ స్థాయిలో కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీకి సైతం ఎన్నికల వ్యూహకర్తగా పనిచేసిన అపార అనుభవం ఆయన











సొంతం. అంతేకాదు, అంతర్జాతీయంగా వివిధ దేశాల ప్రధానమంత్రులకు, అధ్యక్షులకు సైతం రాజకీయ, సాంకేతిక సలహాదారుడిగా విశేష సేవలు అందిస్తున్నారు.

- సాంకేతిక రంగంలోనూ, సిల్వర్ స్క్రీన్ పైనా సువర్ణాక్షరాల సంతకం
- ఒకవైపు అకడమిక్, రాజకీయ రంగాల్లోనే కాకుండా.. సాంకేతిక మరియు వినోద రంగాల్లోనూ తన బహుముఖ ప్రజ్ఞను చాటారు.
- **గ్లోబల్ లీడర్ :** ఐక్యరాజ్యసమితి (UN) సాంకేతిక దౌత్య విభాగాలకు ఎక్స్‌టర్నల్ ఎక్స్‌పర్ట్ కన్సల్టెంట్‌గా, **'ఎన్.ఎన్ న్యూరల్ నెట్‌వర్క్స్' (NN Neural Networks)** చీఫ్ ఫౌండర్, ఏఐ ఆఫీసర్‌గా గ్లోబల్ ఐకాన్‌గా ఎదిగారు. మెదడు పనితీరు-ప్రవర్తనా శాస్త్రాన్ని (న్యూరోసైన్స్), ప్రిడిక్టివ్ ఏఐ డేటాతో ముడిపెడుతూ ప్రపంచ దేశాధినేతలకు సలహాలు అందిస్తున్నారు.
- **సినీ ప్రస్థానం :** బిగ్‌బాస్ ద్వారా మాస్ పాపులారిటీ తెచ్చుకున్న ఆయన, వివాదాస్పద కథాంశంతో సంచలనం సృష్టించిన 'పరాన్నజీవి' సినిమాతో దర్శకుడిగా మరియు నటుడిగా వెండితెరపై తనకంటూ ఒక ప్రత్యేకతను నిరూపించుకున్నారు.
- **ఆశయమే గమ్యంగా ...**
- గత 25 ఏళ్లుగా అకడమిక్, కార్పొరేట్, రాజకీయ రంగాల్లో ఆయన సృష్టించిన ఇంపాక్ట్ అసాధారణం. ఇందుకు గుర్తింపుగా **"జీనియస్ ఆఫ్ ది మిలీనియం", "యువ రత్న"** లాంటి ఎన్నో ప్రతిష్ఠాత్మక అవార్డులు ఆయన ఖాతాలో చేరాయి.
- ఇటీవల న్యూఢిల్లీ వేదికగా జరిగిన ఒక హై-ప్రొఫైల్ అకడమిక్ అసెంబ్లీలో ప్రపంచ స్థాయి మేధావులు, పాలసీ మేకర్స్, గ్లోబల్ కార్పొరేట్ లీడర్స్ సమక్షంలో ఆయనకు ఘన సన్మానం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, "కోడ్, మానవీయ వివేకం కలయికే నా జీవిత లక్ష్యం.. నా తండ్రి సన్యాసి రావు నాయుడు గారి బాటలోనే సమాజ శ్రేయస్సుకు పాటుపడటమే నా జీవన గమ్యం" అని స్పష్టం చేశారు. విశాఖపట్నం కీర్తిని సగర్వంగా చాటిన ఈ బహుముఖ ప్రజ్ఞాశాలి ప్రస్థానం ఎందరికో స్ఫూర్తిదాయకం!

RNI Regd No. APTEL/2005/16209
Date of Publication : 25th of Every Month
Date of Posting : 28th & 29th of Every Month

DARSHANAM
JULY - 2026

Postal Regd.No. HQ/SD/508/2025-2027
WPP NO:PMG/TS/HQR/SC-01/WPP/2025-2027
Licensed to Post Without Prepayment
Posting at B.P.C - IV Patrika Channel,Nampally,Hyderabad-01



PM Hoist Double Cage, Hyderabad



PM Hoist with 12mts Horizontal rebar carrier, Vijayawada


Curved Hoist Bangladesh


Multi Functional Hoist, Nagpur

# CMAC

*Mechanisation & Automation in Construction*

ISO 9001:2015 CERTIFIED COMPANY
AND
CE CERTIFIED COMPANY

## Equipments & Solutions for Infrastructure fraternity. Residential, Commercial Infrastructure, Power, Steel, Cement & Industrial Infra

Innovation with safety & Sustainability
Export them as Made in India


MFH - CMAC Rambo with Rebar Carrier, Delhi



Chimney SRP, Mumbai


Pre Cast Panel Movement SRP, Hyd.


Anji Khad Cable Stayed Bridge Project,
Dist.: Reasi, Jammu



PMH at Pump House, Kaleshwaram


Bridge Special SRP at Durgam Cheruvu,
Cable Stayed Bridge, Hyd.

**ConMechAuto Consultants India Pvt Ltd.,**
**Head Office** : # 1-3-183/40/19, 2nd Floor, SBI Colony,
Gandhi Nagar, Hyderabad - 500 080, India.
Tel. No.: + 91- 40 - 2754 1464

**Factories :**
Phase 2, Phase 5, IDA Cherlapally,
Hyderabad - 500 051

For Further Details:

**CONTACT : 9393 111 464**

**Email : sales@cmac.co.in**
**www.cmac.co.in**

*If Undedelivered please return to:*
**DARSHANAM Devotional Magazine,Srirama Siddhanthi Bhavanam, H.No.29-105/4/1**
**Rythu Bazar Road, New Vidyanagar Colony, Neredmet, Secunderabad, 500056**
**Mobile 7013093123, 9441015469** *e mail: darshanameditordesk@gmail.com*